www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

లలితా జ్యూవెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

సోమవారం | 21-1-2019 | పేజీలు: 18 + 20 | వెల: రూ.6.50 | సంపుటి: 15 సంచిక: 194 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 10.46 తదుపరి బ. పాడ్యమి; నక్షత్రం: పుష్యమి రా. 2.28 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: మ. 12.24-1.49; దుర్ముహూర్తం: మ. 12.49-1.33, మ. 3.02-3.46; అమృతఘడియలు: రా. 8.50-10.15; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.55; సూర్యాస్తమయం: 5.59 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



ఇది ప్రకటన కాదు!

మీ కష్టార్జితానికి సంబంధించినది!

మా వద్ద కోట్లాది రూపాయలు తీసుకునే బ్రాండ్ అంబాసిడర్లు లేరు... తియ్యని మాటలతో మైమరిపించే ఉద్యోగులు మా షోరూంలో అస్సలు లేరు.. టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్ వంటి ఆతిథ్యాలతో ఆకట్టుకునే తీరు మేం ప్రదర్శించం.. నగల రంగంలో వీటిని అనుసరించడం చాలా క్లిష్టమైన విషయం. ఇది గొప్ప విషయమని చెప్పడం లేదు. మీరు చెల్లించే డబ్బుకు పూర్తిస్థాయి విలువతో బంగారాన్ని అందించడమే, వీటన్నింటికన్నా గొప్ప విషయం! అదే లలితా జ్యూవెల్లరీ అక్షరాలా అనుసరిస్తోంది!!

ఒక్కసారి ఆలోచించండి! మార్కెట్‌లోని పలురకాల డ్రామాల వల్ల మీరు పొందే బంగారం విలువ పెరుగుతుందా? మీరు చెల్లించే డబ్బుకు న్యాయమైన గ్రాముల బంగారాన్ని ఇంటికి తీసుకెళ్తున్నారా? ఇదే ఆలోచించాల్సిన విషయం. అందుకే మేం మీ కష్టార్జితాన్ని గౌరవిస్తాం.

గ్రాముకు రూ.50, రూ.100 తగ్గింపు, V.A.లో 50%, 20% రాయితీ, పాతనగలు ఎక్స్ఛేంజ్ చేసుకునేటప్పుడు గ్రాముకు రూ.100 ఎక్కువ.. వంటి జిమ్మిక్కు ఆఫర్లను చూసి పక్కదోవ పట్టకండి. ఇలాంటి ఆఫర్లన్నీ ఎందుకు పండగలు, ప్రత్యేకమైన రోజుల్లో ఇస్తున్నారు?.. నిజంగానే మీ మంచి కోరుకునేవారైతే.. ప్రతిరోజూ ఇలాంటి ఆఫర్లను ఇవ్వొచ్చుగా. ఇంకోవిషయం.. కాస్త ధరలు తగ్గించమని మేనేజరు దగ్గరకు వెళితే.. 2% లేదా 3% తగ్గిస్తారు. ఒకవేళ.. అలా బేరమాడే శక్తి లేనివాళ్ల పరిస్థితి ఏంటి?... వాళ్లు మోసపోయినట్టేగా!.. అసలు కస్టమర్లను అలా ఎందుకు కన్ఫ్యూజ్ చేయాలి. అందుకే లలితా జ్యూవెల్లరిలో మేం అలాంటివేం చేయం.

గరిష్ఠ గ్రాముల బంగారాన్ని పొందామనే సంతృప్తిని మీకు కలిగించడమే మా లక్ష్యం! మార్కెట్‌లోనే మరెవరికీ సాధ్యంకాని తక్కువ ధరల్లో, నాణ్యతైన నగలను మీకు అందించడంపై మాత్రమే మేం దృష్టిపెడుతున్నాం. సుస్వాగతం!



విజయవాడలో
బ్రహ్మాండమైన ప్రారంభోత్సవం.
నేడు, సోమవారం.

60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్,
సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా.
ఫోన్: 0866-2481133 / 91332 98333
91332 98444.

మార్కెట్‌లోని ఉచితాలు,
ఆఫర్లను చూసి పక్కదోవ పట్టకండి.
దయచేసి మా వద్ద ఎస్టిమేట్‌స్లిప్,
మొబైల్‌లో ఫోటోను తీసుకోండి.
నాలుగైదు షోరూంలలో
ధరలు పోల్చిచూడండి.



లలితా జ్యూవెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

త్వరలో రాజమండ్రిలో!

లక్షలాది డిజైన్లు! 100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్



వైజాగ్
29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్,
ద్వారకా నగర్.
ఫోన్: 0891 - 6600001.



తిరుపతి
481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ,
మాస్కోరోడ్, (V.V. మహల్‌రోడ్)
ఫోన్: 0877 - 666 0505 /
0606 / 7888.



హైదరాబాద్
6-3-883, SBR సౌక్,
రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా,
సోమాజిగూడ సర్కిల్.
ఫోన్: 040 - 6748 6677.

విజయవాడ • విశాఖపట్నం • తిరుపతి • హైదరాబాద్ • చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి
కుంభకోణం • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

www.lalithaajewellery.com



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



సోమవారం | 21-1-2019 | పేజీలు: 18 + 20 | వెల: రూ.6.50 | సంపుటి: 15 సంచిక: 194 | Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai | నిజామాబాద్ సిటీ*

ఏప్రిల్ 1 విడుదల

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పింఛన్ల పెంపు

"కేంద్రంలో అనుకూల ప్రభుత్వం లేదు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ నష్టపోయిందని చెప్పినా.. అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరినా స్పందించలేదు. కేసీఆర్ కిట్లకు కేంద్రం నిధులు ఇస్తోందనే భ్రమల్లోంచి బీజేపీ నేతలు బయటకు రావాలి."

- సీఎం కేసీఆర్



- **నిరుద్యోగ భృతి అమలుకు కొంత జాప్యం తప్పదు**
- **ఒక్కసారిగా రుణమాఫీ చేస్తామని చెప్పలేదు**
- **ఈసారి 24 వేల కోట్ల మాఫీ.. తయారీలో విధానాలు**
- **వచ్చే ఐదేళ్లలో 10 లక్షల కోట్ల ఆదాయం.. ఖర్చు**
- **కేంద్ర సర్కారు సహకరించలేదు.. స్పందించలేదు**
- **కేసీఆర్ కిట్‌లో కేంద్రం పైసలు ఏకానా లేదు**
- **వైఎస్ ఆరోగ్యశ్రీ పథకం చరిత్రలో నిలిచిపోతుంది**
- **వాగ్దానాలు వంద శాతం అమలు చేస్తాం**
- **అందుకు మాకు ఐదేళ్ల సమయం ఉంది**
- **ఉన్నత విద్యలో ప్రైవేటు భాగస్వామ్యం**
- **త్వరలోనే యాజమాన్యాలతో చర్చలు**
- **ధన్యవాద తీర్మానంపై చర్చలో సీఎం కేసీఆర్**



ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం కోసం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమైన యాగశాల. ఏర్పాట్లపై వివరాలు తెలుసుకుంటున్న కేసీఆర్

నేటి నుంచే కేసీఆర్ చండీ యాగం.. టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన అన్ని రకాల పెన్షన్ల పెంపును వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. నిరుద్యోగ భృతి చెల్లించేందుకు ఆరు నెలల సమయం పడుతుందన్నారు. నిరుద్యోగులు ఎవరనే అంశాన్ని పక్కాగా తేల్చేందుకు నిబంధనలు రూపొందించాల్సి ఉందని, ఇందుకు కొంత సమయం కావాలని చెప్పారు. "ఏక కాలంలో రైతు రుణాలను మాఫీ చేస్తామని మేం చెప్పలేదు. గతంలో మాదిరిగానే రూ.లక్ష వరకూ మాఫీ చేస్తాం. రుణ మాఫీలో ఉన్న ఇబ్బందులు, సమస్యలపై బ్యాంకర్లతో మాట్లాడి పరిష్కరిస్తాం. ఈసారి రూ.24 వేల కోట్ల రుణాలు మాఫీ అవుతాయి. ఇందుకు విధి విధానాలను ఖరారు చేస్తున్నాం" అని తెలిపారు. ఏకకాలంలో రూ.2 లక్షలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పినా ప్రజలు నమ్మలేదని, లక్ష మాఫీ చేస్తామని ప్రకటించిన తమపైనే విశ్వాసం ఉంచారని అన్నారు. రైతు బంధు, బీమా పథకాలను కొనసాగిస్తామని, కౌలు రైతు, భూమి యజమాని ఇద్దరూ సామరస్యంగా మాట్లాడుకుని సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ఆదివారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్ సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రతిపక్షాల ఆరోపణలు, విమర్శలను

మిగతా 11వ పేజీలో...

సీఎంతో సండ్ర భేటీ



శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్న సండ్ర

- గంటసేపు ఏకాంత చర్చలు
- త్వరలో గులాబీ గూటికి చేరే చాన్స్?
- ప్రగతిభవన్‌కు వెళ్తే తప్పేంటని ప్రశ్న 11

కేసీఆర్ మళ్లీ తప్పు చేస్తారనుకోను

- మా ఎమ్మెల్యేలను లాక్కోరని భావిస్తున్నా
- ప్రజలు టీఆర్ఎస్‌నే అసెంబ్లీకి పంపలేదు
- ప్రశ్నించేందుకు మమ్మల్ని కూడా పంపారు
- ప్రతిపక్షం లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎల్పీ నేత భట్టి



తొలి విడత 'పంచాయతీ' నేడే

3,701 గ్రామాల్లో పోలింగ్.. సాయంత్రానికే ఫలితం

మద్యం ఏర్లు.. 'ఊగు'తున్న ఊళ్లు

- చీప్ లిక్కర్, క్వార్టర్ బాటిళ్లకు తీవ్ర కొరత.. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పెరిగిన అమ్మకాలు
- జనవరిలో 25-30 శాతం అధికం.. చూసీచూడనట్లున్న ఆబ్కారీ, పోలీసులు 8

రోడ్డుపై చెత్త వేస్తే 500 ఫైన్!

- ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే రూ.1000
- గ్రామపంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే రూ.2000
- పంచాయతీరాజ్ చట్టం ఇకపై పక్కాగా అమలు
- విస్మరిస్తే ఉద్యోగాలకు ఎసరు, జరిమానాలు
- ప్రొబేషన్ తర్వాత రెగ్యులర్ చేయబోం 8
- అసెంబ్లీలో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్

కొత్త ఇంజనీరింగ్ కాలేజీలకు

అనుమతుల్లేవ్

2020-21 నుంచి అమలు: ఏఐసీటీఈ

న్యూఢిల్లీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిన నేపథ్యంలో ఇకపై కొత్త కాలేజీల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని 2020-21 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని భావిస్తోంది. అలాగే.. కొత్త కాలేజీల అవసరంపై

మిగతా 12వ పేజీలో...



169 మంది జలసమాధి

మధ్యధరా సముద్రంలో వలసదారుల విషాదాంతం 12

జైలులోనూ శశి'కళే'

- ఏ-క్లాస్ సదుపాయాలు
- దర్యాప్తు కమిటీ నిర్ధారణ 12

రిసార్టులో రచ్చ!

- కన్నడ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫైట్
- మద్యం సీసాతో దాడి...
- ఒకరికి గాయాలు



పరంజ్యోతి

వృద్ధాప్యం ఎప్పటికైనా తప్పనిదే..



ధాత్రేషు వళయః ప్రాప్తాః శ్వేతాశ్చైవ శిరోరహాః
జరయా పురుషో జీర్ణః కింహికృత్వా ప్రభావయేత్

వృద్ధాప్యం వస్తోందంటే.. దేహం ముడుతలు పడుతుంది. తలవెంట్రుకలు తెల్లబడిపోతాయి. ముసలితనం వల్ల శిథిలమైన మనిషి పూర్వపు శక్తిని ఎలా పొందగలుగుతాడు? అని శ్రీరాముని ముఖతః తన సోదరుడైన భరతునితో వాల్మీకి మహర్షి చెప్పించాడు. అరణ్యవాసానికి వెళ్లిన రాముని ఒప్పించి.. ఏ విధంగానైనా తిరిగి అయోధ్యకు తీసుకురావాలని పరివారంతో వెళ్లిన భరతుడు తన దుఃఖాన్ని పరిపరివిధాలుగా శ్రీరామచంద్రునితో మొరపెట్టుకొని బాధపడుతున్న సందర్భంలో రామచంద్రుడు భరతుణ్ని ఓదారుస్తూ వృద్ధాప్యం గురించి కొన్ని మాటలు చెప్పాడు. మనిషికి మరణం ఎంత సహజమో, వృద్ధాప్యమూ అంతే సహజం. మృత్యువు ఎప్పుడూ మనిషి వెంటనే నడుస్తుంటుంది. ముదిమి కూడా ఎప్పటికైనా తప్పని శరీరధర్మం.

సాధారణంగా.. జన్మ తీసుకున్న ప్రతి వ్యక్తికీ బాల్యం, కౌమారం, యౌవనం, వృద్ధాప్యం అనే నాలుగు దశలు తప్పవు. వృద్ధాప్యాన్ని మాత్రం తప్పించుకునే యత్నం చేయడం వృథా. ఎంత గట్టి నిట్రాడు కర్ర ఉన్నా శిథిలమైపోతున్న ఇల్లు ఆగదు. అందుకే "నరాః జరామృత్యువశం గతాః" అన్నాడు. శరీరం ఎప్పటికైనా వృద్ధాప్యం వల్ల శిథిలమై నశిస్తుంది. మానవులు సూర్యోదయ, సూర్యాస్తమయాలు చూసి సాధారణంగా ఆనందిస్తుంటారు. కొత్త రుతువుల రాకచూసి పొంగిపోతుంటారు. కానీ ఇవి గడచిపోతున్నకొద్దీ మనం వృద్ధాప్యానికీ మరణానికీ సన్నిహితమవుతున్నామని భావించరు. మనిషి ఆశాజీవి కనుక నిత్యం ఆనందిస్తుంటాడు. కానీ, నిజాన్ని ఎప్పటికీ మరువరాదు. వయసు ఎప్పుడూ ప్రవహించే ఒక ప్రవాహం వంటిది. ఇదే విషయాన్ని వాల్మీకి మహర్షి.. 'వయసః పతమానస్య స్రోతసోవా నివర్తినః' అని చెప్పారు. ఏ ప్రవాహమైనా ముందుకు సాగుతుందే తప్ప ఎన్నటికీ వెనక్కి రాదు. వయసూ అంతే. వృద్ధాప్యం దిశగా సాగిపోతుందేగానీ.. వెనక్కి తిరిగిరాదన్నది సత్యం. అదే విధంగా.. గడచిపోయిన రాత్రి కూడా మళ్లీ రాదని రాముని ద్వారా లోకానికి బోధించాడు.

జీవితం అశాశ్వతమైనదని తెలిసినా.. దాన్ని ప్రేమించి అనుభవించాలి. జీవించే కొద్దికాలంలో వచ్చే అన్ని దశల్లోనూ.. చేయగలిగిన అన్ని పనులనూ చేసి తీరాలి. అంతే కానీ, గడచిపోతున్నదాని గురించి వగచే స్థితి రాకూడదని రామాయణం మనకు సందేశం ఇస్తోంది.

యథా ఫలానాం పక్వానాం నాన్యత్ర పతనాద్భయమ్
ఏవం నరస్య జాతస్య నాన్యత్ర మరణాద్భయమ్

పండిన ఫలాలు రాలిపోవడం తప్పనట్లే, పుట్టిన ప్రతి జీవీ గిట్టక తప్పదు కదా! అందుకని మరణాన్ని గురించి భయం ఎందుకు? మరణం దిశగా సాగే వృద్ధాప్యానికీ ఎన్నడూ భయపడకూడదు.

- గన్నమరాజు గిరిజామనోహర బాబు





ఘటనా స్థలిని పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేష్ బల్లా

గట్టు మైసమ్మ ఆలయ ధ్వంసానికి యత్నం

▸ ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసు అధికారులు

భైంసా, జనవరి 20: నిర్మల్ జిల్లా భైంసాలోని ప్రసిద్ధ గట్టు మైసమ్మ ఆలయ శిఖర ధ్వంసానికి శనివారం రాత్రి విఫలయత్నం జరిగింది. దుండగులు ఆలయం పైభాగానికి ఎక్కి శిఖరాన్ని పగులగొట్టేందుకు యత్నించారు. శిఖరం పైభాగాన్ని కొద్దిమేర పగులగొట్టి.. ధ్వజాన్ని తొలగించి కింద పడేశారు. ఆలయానికి సంబంధించిన బోరు పైపును పగులగొట్టారు. ఆదివారం ఉదయం పూజలు నిర్వహించేందుకు గుడికి వెళ్లిన ఆలయ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలిని అడిషనల్ ఎస్పీ దక్షిణామూర్తి, భైంసా డీఎస్పీ రాజేశ్ బల్లా, భైంసా ఎస్సై రాజన్న పరిశీలించారు. కేసు నమోదు చేశారు. క్లూస్‌టీం వివరాలు సేకరించింది. కాగా, దోషులను వెంటనే గుర్తించి శిక్షించాలని బీజేపీ, హిందూవాహిని ప్రతినిధులు ఆందోళన నిర్వహించారు.


సినీ ఫక్కీలో బంగారం అక్రమ రవాణా

▸ విమానాశ్రయంలో 2 కిలోల స్వర్ణం స్వాధీనం

▸ ప్రయాణికుడిని అరెస్టు చేసిన డీఆర్ఐ



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమిళనటుడు సూర్య నటించిన 'వీడొక్కడే' సినిమాలో మాదిరిగా బంగారం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో నిందితుడు శనివారం అర్ధరాత్రి ఇండోర్ నుంచి శంషాబాద్ చేరుకున్న విమానం (6ఈ-648) లోంచి దిగగానే.. డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి షూలో భద్రపరిచిన 2 కిలోల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. విదేశీ ముద్ర ఉన్న ఈ బంగారం విలువ రూ. 66.27 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. బంగారం అక్రమ రవాణా వెనుక ఓ ముఠా ఉన్నట్లు గుర్తించారు. అంతకుముందు ఈ విమానం షార్జా నుంచి తిరువనంతపురానికి రాగా.. అందులో వచ్చిన ఓ ముఠా సభ్యుడు.. ఓ సీటు కింద బంగారం ఉన్న షూను దాచిపెట్టాడని, ఆ తర్వాత డొమెస్టిక్ సర్వీస్‌గా మారిన ఆ విమానంలో మరో ప్రయాణికుడు ఎక్కి.. ఇండోర్ చేరుకున్నాడని తెలిపారు. ఆ షూను తొడుక్కుని, అక్కడినుంచి శంషాబాద్‌కు వచ్చాడని వెల్లడించారు.



వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన యాగశాల

నేటి నుంచే చండీ మహాయాగం

కేసీఆర్ గణపతి పూజతో ప్రారంభం.. ఐదు రోజులు కొనసాగనున్న యాగం .. టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

హైదరాబాద్/జగదేవ్‌పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం సోమవారం ప్రారంభం కానుంది. ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉదయం 9.30 గంటలకు కేసీఆర్ గణపతి పూజతో యాగం ప్రారంభమవుతుంది. ఈ యాగం ఈ నెల 25 వరకు కొనసాగనుంది. మూడేళ్ల క్రితం అయుత చండీయాగం చేసిన సీఎం కేసీఆర్ గతేడాది రాజశ్యామల యాగం చేశారు. తాజాగా చండీ మహాయాగాన్ని నిర్వహిస్తున్నారు. 15 రోజులుగా వ్యవసాయ క్షేత్రంలో యాగానికి అవసరమైన ఏర్పాట్లన్నీ చేశారు. గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, రుత్విక్‌వరణ కార్యక్రమాలతో యాగానికి అంకురార్పణ చేస్తారు. శృంగేరీ పీఠం సంప్రదాయ పద్ధతిలో, ఆ పీఠం పండితులు ఫణిశశాంకశర్మ, గోపీకృష్ణశర్మ, తెలంగాణ పత్రిక సంపాదకుడు అష్టకాల రామ్మోహనశర్మ పర్యవేక్షణలో ఐదు రోజులపాటు యాగం జరగనుంది. ఈ యాగానికి టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లను ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది.

3 యాగశాలలు.. 16 హోమ గుండాలు

మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగ నిర్వహణ కోసం వ్యవసాయ క్షేత్రంలో మూడు యాగశాలలను నిర్మించారు. 16 హోమ గుండాలను ఏర్పాటు చేశారు. యాగ నిర్వహణకు కర్ణాటక నుంచి 200 మంది, తెలంగాణ నుంచి 50 మంది రుత్విక్కులు చేరుకున్నారు. యాగం సందర్భంగా ఎర్రవల్లిలో ఆదివారం సాయంత్రం గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు.



యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

ఫామ్ హౌస్‌కు కేసీఆర్

సీఎం కేసీఆర్ ఆదివారం సాయంత్రం ఎర్రవల్లికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న ఆయన యాగం పనులను పరిశీలించారు. ప్రధాన యాగశాలతో పాటు హోమగుండాలు, ఇతర పనులను పరిశీలించారు.

రేపు ఢిల్లీకి కేసీఆర్!

▸ కేంద్ర మంత్రి హర్షవర్ధన్ తనయుడి వివాహానికి హాజరు

ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లనున్నారు. కేంద్ర మంత్రి హర్షవర్ధన్ తనయుడు మయాంక్ వివాహ వేడుకకు హాజరు కావడానికి కేసీఆర్ వెళుతున్నారని, అదేరోజు రాత్రి తిరిగి వస్తారని టీఆర్ఎస్ ముఖ్యులు తెలిపారు. హకీంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళతారన్నారు.



యువజన నాయకత్వ సదస్సులో ఎంపీ కవితతో బబిత ఫొగట్, మాలావత్ పూర్ణ, పుల్లెల



సదస్సులో గవర్నర్ నరసింహన్‌తో మాట్లాడుతున్న ఎంపీ కవిత

ఐక్యతతోనే సుస్థిర అభివృద్ధి

లక్ష్య సాధనకు యువత కృషి చేయాలి.. అహింసా మార్గంలో ముందుకుసాగాలి.. ఫోన్లను అనవసర విషయాలకు వాడొద్దు

▸ 'యువ' సదస్సులో గవర్నర్ నరసింహన్

▸ మహిళా సాధికారతకు సహకరించాలి

▸ 19 వేల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చాం

▸ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

▸ రాజేంద్రసింగ్, మాలావత్ పూర్ణ, బబిత ఫొగట్‌కు సాఫల్య పురస్కారాలు

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనకు యువత కృషి చేయాలని, ఇది గాంధేయ మార్గంలోనే సాధ్యమవుతుందని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. శాంతి, సామరస్యం, సంతోషం, గెలుపు, పర్యావరణం అనే ఐదు లక్ష్యాలను ప్రపంచం ప్రస్తుతం సాధించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సుస్థిర అభివృద్ధి సత్వరం జరిగేది కాదని, ఐక్యంగా ఉండి కృషి చేస్తేనే సాధ్యమవుతుందని చెప్పారు. ఇక్కడ హెచ్ఐసీసీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు సభలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇన్నేళ్ల తర్వాత కూడా గాంధీజీని గుర్తుంచుకుంటున్నామంటే ఆయన అనుసరించిన మార్గమే కారణమని గవర్నర్ చెప్పారు. "యువత ఒకరితో ఒకరు కమ్యూనికేట్ కావాలని, అంతరాలను తొలగించాలని చెప్పారు. సమాజంలో అందరికీ సమాన అవకాశాలు దక్కాలని, అప్పుడే సమాజం సరైన మార్గంలో పయనిస్తుందని అన్నారు. యువత సహనంతో ముందుకు సాగాలని సూచించారు. చాలామంది యువత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లను అనవసర విషయాలకు వినియోగిస్తూ జ్ఞానాన్ని వ్యర్థం చేసుకుంటున్నారని, ఇది మంచిది కాదని హితవు పలికారు. అద్భుతమైన సదస్సు నిర్వహించారంటూ ఎంపీ కవితను ప్రశంసించారు. మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత కోరారు. అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో 50 శాతం వివిధ దేశాలకు చెందిన మహిళా ప్రతినిధులు పాల్గొన్నారని, వీరంతా తమ దేశాల్లో మహిళల సాధికారతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు పురుషుల సహకారం చాలా ముఖ్యమన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణ, అభివృద్ధి కేంద్రాలను తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మందికి నైపుణ్య శిక్షణ అందించామని, వీరిలో 15 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణ, భారత రెజ్లర్ బబిత ఫొగట్ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆమె కొనియాడారు.

పురస్కారాల ప్రదానం

సదస్సు ముగింపు సందర్భంగా గవర్నర్ నరసింహన్ అవార్డులు ప్రదానం చేశారు. 'వాటర్ మాన్ ఇండియా'గా పేరు పొందిన పర్యావరణవేత్త, జలసంరక్షకుడు రాజేంద్రసింగ్ (రాజస్థాన్)కు జీవన సాఫల్య పురస్కారాన్ని, మాలావత్ పూర్ణ, బబిత ఫొగట్‌కు యువ సాఫల్య పురస్కారాలను గవర్నర్ అందించారు.

ప్రతిభకు కొదవ లేదు: గోపీచంద్

ప్రస్తుతం సమాజంలో సంప్రదాయ క్రీడల పట్ల ఆదరణ తగ్గిపోతోందని, దీనిపై దృష్టి సారించాలని బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. తెలంగాణలో ప్రతిభ ఉన్నవారు చాలామంది ఉన్నారని, అందులో కొందరి ప్రతిభకు సానపెట్టే అవకాశం తనకు లభించిందన్నారు. ప్రభుత్వాలు క్రీడలకు మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు.

ఆడపిల్లలకు ధైర్యం నూరిపోయాలి: బబిత

దేశంలో ఆడపిల్లలను ఇప్పటికీ సున్నితంగా పెంచుతున్నారని, అది సరైంది కాదని భారత రెజ్లర్ బబితా ఫొగట్ అన్నారు. ఆడపిల్లలకు చిన్నప్పటి నుంచే ధైర్యసాహసాలు నూరిపోయాలని సూచించారు. దంగల్ సినిమాలో చూపించినట్లే అబ్బాయిలతో కలిసి శిక్షణ పొందామని, ఎవరెమన్నా తాము లెక్కచేయలేదని చెప్పారు.

అన్ని ఖండాల్లోని శిఖరాలు అధిరోహిస్తా: పూర్ణ

ప్రతి ఒక్కరి జీవితంలో ఆటలు భాగం కావాలని ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణ సూచించారు. సరదా కోసం నేర్చుకున్న రాక్ క్లైంబింగే తన జీవితాన్ని మార్చేసిందన్నారు. తన ప్రయాణం ఆపనని, అన్ని ఖండాల్లోని ఎత్తైన శిఖరాలను అధిరోహించడంతోపాటు సివిల్ సర్వీసెస్ సాధించడం తన లక్ష్యమని అన్నారు.

మానవ విజ్ఞానంలో కులవృత్తులూ భాగమే

▸ ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు



మాట్లాడుతున్న జయధీర్ తిరుమల్‌రావు

వనస్థలిపురం/హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మానవ విజ్ఞానంలో కులవృత్తులు కూడా భాగమేనని ప్రొఫెసర్, రచయిత జయధీర్ తిరుమల్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఆదివారం నిర్వహించిన ఎరుక సాహితీ సాంస్కృతిక సామాజిక వేదిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాంస్కృతీకరణ తెలుగు భాషకు అన్యాయం చేసిందని, వృత్తి నుంచే భాష వచ్చిందని ఆయన చెప్పారు. ఐక్యత లేకపోవడంవల్లే కులవృత్తులు అంతరిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బ్రాహ్మణీయ వ్యవస్థ కులాల్ని ప్రస్తావించలేదని, కుల భావజాలం వేల ఏళ్లుగా ఉందని ఆయన గుర్తు చేశారు. కులవృత్తుల్లో 33 రకాల వ్యాఖ్యాలున్నాయని తిరుమల్‌రావు తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కులవృత్తుల అభ్యున్నతికి ప్రభుత్వేతర శక్తుల సహకారం కూడా చాలా అవసరమన్న ఆయన.. రానున్న రోజుల్లో కులవృత్తుల ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

22న రాష్ట్ర కేబుల్ ఆపరేటర్ల సమావేశం

హైదరాబాద్ సిటీ, జనవరి20 (ఆంధ్రజ్యోతి): కేబుల్‌లో న్యూటారిఫ్ విధానంతో కస్టమర్లు, ఆపరేటర్లకు నష్టమని; ఎంఎస్ఓలు, పలు బ్రాడ్ కాస్టింగ్ సంస్థలకే లాభమని తెలంగాణ డిజిటల్ కేబుల్ ఆపరేటర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు అన్నారు. 24 దక్షిణాది రాష్ట్రాల కేబుల్ ఆపరేటర్ల సమ్మెకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కేబుల్ ఆపరేటర్ల సమావేశాన్ని 22వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని, అనంతరం నిర్ణయం ప్రకటిస్తామన్నారు. రూ.250లకు సుమారు 400లకు పైగా చానళ్లు అందజేస్తున్న తరుణంలో ప్యాకేజీల పేరుతో ఆపరేటర్లను, కస్టమర్లను బందీలుగా చేస్తున్నారని తెలిపారు. ట్రాయ్ నిబంధనలకు అనుగుణంగా చానళ్లను ప్రసారంచేసే కెపాసిటీ ఎంఎస్ఓలకు లేదన్నారు.

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
అదిలాబాద్	9.2	31.5
హైదరాబాద్	13.3	31.2
సంగారెడ్డి	14.0	31.0
ఖమ్మం	17.0	32.0
నల్లగొండ	18.4	31.0

24 గంటల్లో అల్పపీడనం

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకొని హిందూ మహాసముద్రం ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో 24 గంటల్లో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు.



కాంగ్రెస్ పెద్ద మనసుతో వ్యవహరించాలి

బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలను ఒక్కతాటిపై నడిపించడంలో కాంగ్రెస్ పార్టీ తన పాత్రను సమర్థంగా పోషించగలదు. అయితే ప్రాంతీయ పార్టీలను కూడా కాంగ్రెస్ అర్థం చేసుకొని పెద్ద మనసుతో వ్యవహరించాలి. అన్ని విపక్షాలకూ వారు సహకరించాలి.

- ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్



కోటాతో ఎన్డీఏకు పది శాతం ఎక్కువ ఓట్లు

ఆర్థిక బలహీన వర్గాలకు పదిశాతం కోటాతో ఎన్డీఏ కూటమికి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మరో పదిశాతం ఎక్కువ ఓట్లు వస్తాయి. నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని అవుతారు. పరస్పర విరుద్ధ భావజాలం, అస్థిరత కారణంగా విపక్షాల మహాకూటమిని ప్రజలు తిరస్కరిస్తారు.

- కేంద్ర మంత్రి రాంవిలాస్ పాసవాన్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.27	పాత ధర 71.15
కొత్త ధర రూ.75.47	కొత్త ధర 71.43
పెరుగుదల 20 పైసలు	పెరుగుదల 28 పైసలు



మెట్లు ఎక్కితే గుండెకు మేలు!

టొరంటో, జనవరి 20: మెట్లు ఎక్కడం అనేది ఒక వ్యాయామం లాంటిది. రోజూ ఈ అలవాటును కొనసాగిస్తే ఆరోగ్యం బాగుంటుంది. అయితే.. మెట్లు ఎక్కడం గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని కెనడాలోని మెక్‌మాస్టర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. కాస్తంత విరామం ఇస్తూ రోజులో కొన్నిసార్లు.. కొన్ని నిమిషాలపాటు మెట్లు ఎక్కితే గుండె ఆరోగ్యంగా ఉంటుందని అప్లయిడ్ సైకాలజీ అనే జర్నల్‌లో పరిశోధకులు వెల్లడించారు. దీన్ని ఎప్పుడైనా, ఎక్కడైనా చేయొచ్చని, రోజూ ఇలా చేస్తే ఫిట్‌నెస్ కూడా పెరుగుతుందని మెక్‌మాస్టర్ వర్సిటీ ప్రొఫెసర్ మార్టిన్ గిబాలా పేర్కొన్నారు.

కార్బన్ డయాక్సైడ్ నుంచి విద్యుత్!

సియోల్, జనవరి 20: గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణంగా నిలుస్తున్న కార్బన్ డయాక్సైడ్ నుంచి విద్యుత్, హైడ్రోజన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేసే సరికొత్త వ్యవస్థను దక్షిణ కొరియాలోని ఉస్లాన్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. హైబ్రిడ్ ఎన్ఏ-సీవో2గా పిలిచే ఈ వ్యవస్థలో కార్బన్ డయాక్సైడ్ (సీవో2) నుంచి వెయ్యి గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్, హైడ్రోజన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. మనిషి విడుదల చేసే సీవో2లో ఎక్కువశాతం సముద్రాలు గ్రహించడం వలన అది ఆమ్లాలుగా మారతాయి. దీనిపై ప్రధానంగా దృష్టిపెట్టిన పరిశోధకులు సీవో2ను నీరుగా మార్చేక్రమంలో ఒక ఎలక్ట్రోకెమికల్ రియాక్షన్‌ను ప్రేరేపించారు. సీవో2ని తొలగించడం ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని గువాంటే కిమ్ అనే శాస్త్రవేత్త చెప్పారు.

పరి'శ్రమ'ను రోడ్డున పడేశారు!

రూ.6.23 కోట్లకు.. 19 లక్షలా.. పరిహారమా.. పరిహాసమా..?

- పరిశ్రమ, స్థలానికి నామమాత్రపు ధర
- 8 ఏళ్లుగా పోరాడుతున్నా పట్టించుకోవట్లేదు
- జాతీయ రహదారికి స్థలమిచ్చిన యజమాని ఆవేదన



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలో సూర్యాపేటకు కూత వేటు దూరంలో ఉండేదా పరిశ్రమ.. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి 'ఎస్జీ ప్లాస్టిక్స్' పేరిట నెలకొల్పిన ఆ పరిశ్రమతో పలువురు ఉపాధి కూడా పొందారు.. సరిగ్గా అప్పుడే జాతీయ రహదారి కోసమంటూ పరిశ్రమ ఉన్న స్థలాన్ని ప్రభుత్వం తీసేసుకుంది. ఫలితంగా అందులో పనిచేస్తున్న ఉద్యోగులు రోడ్డున పడ్డారు. అడగ్గానే స్థలం ఇచ్చి సహకరించిన యజమానికి కూడా అధికారులు కుచ్చుటోపీ పెట్టారు. విలువైన స్థలానికి నామామాత్రపు పరిహారమిచ్చి పరిహాసం చేశారు. ఇది అన్యాయమని మొత్తుకుంటూ కాళ్లరిగేలా ఎనిమిదేళ్ల నుంచి తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో.. ఆ యజమాని దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. పరిశ్రమా లేక.. పరిహారమూ సరిగా రాక ఇబ్బంది పడుతున్నారు. ఇదీ ఎస్జీ ప్లాస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వేములపల్లి మనోహరరావు దీనగాథ. తనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే కనీస ప్రయత్నం జరగడం లేదని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో వాపోయారు.

అలా.. జరిగింది

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పక్కనే సూర్యాపేట సమీపంలో ఈ పరిశ్రమ ఉండేది. పరిశ్రమ ఉన్న స్థలం దురాజ్‌పల్లి గ్రామ సర్వే నంబరు 23 కిందకు వస్తుంది. దీని విస్తీర్ణం 1,821.09 చదరపు మీటర్లు (2177.89 చదరపు గజాలు). జాతీయ రహదారి కోసం పరిశ్రమ స్థలం మొత్తాన్నీ తీసుకున్నారు. దీంతో పరిశ్రమ కోసం ఏర్పాటు చేసిన రెండు షెడ్లు, చెట్లు, బోరు, తదితరాలన్నింటినీ తొలగించేశారు. భూసేకరణకు 2008 ఆగస్టులో నోటిఫికేషన్ జారీ అయింది. భూసేకరణ అధికారిగా సూర్యాపేట ఆర్డీవో నియమితులయ్యారు. 2009 డిసెంబరులో నిర్వహించిన సమావేశానికి హాజరైన మనోహరరావు జాతీయ రహదారికి స్థలం ఇవ్వడం వల్ల పరిశ్రమ మూతపడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ఆర్థిక సంస్థ, కెనరా బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నానని, సేల్స్ ట్యాక్స్ డిఫర్‌మెంట్ రుణాలతో కలిపితే మొత్తం రూ.6.23 కోట్లు ఉంటుందని ఒక లేఖ సమర్పించారు. ఈ మొత్తాన్ని చెల్లించి పరిశ్రమ స్థలాన్ని తీసుకోవాలని కోరారు. అయితే అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా స్థలానికి నామమాత్రపు ధరను నిర్ణయించారు. చదరపు గజం రూ.165గా నిర్ధారించారు. ఆ ప్రకారం స్థలం విలువ రూ.3.59 లక్షలుగా తేల్చారు. ప్లాస్టిక్ ఉత్పత్తి కోసం నిర్మించిన షెడ్లు రెండు ఉంటే ఒక దానికే (రూ.13.74 లక్షలు) లెక్క కట్టారు. అందులో ఉన్న చెట్లు, బోరు, సొలేషియం, తదితరాలన్నింటికీ కలిపి మొత్తం పరిహారం రూ.19.08 లక్షలుగా తేల్చారు. ప్లాస్టిక్ పరిశ్రమ ఉన్నప్పటికీ ఆ స్థలాన్ని వ్యవసాయ భూమిగానే పరిగణిస్తూ ధర లెక్కించారు. సమీపంలో తీసుకున్న భూమికి చదరపు గజానికి రూ.1,500 చొప్పున అయినా ఇవ్వాలన్న విన్నపాన్ని కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. నిరసన వ్యక్తం చేస్తూనే విధి లేని పరిస్థితుల్లో 2010 జూన్‌లో అధికారులు ఇచ్చిన పరిహారాన్ని (రూ.19.08 లక్షలు) తీసుకున్నట్లు మనోహరరావు తెలిపారు. న్యాయం చేయాలని కోరుతూ ఆర్బిట్రేటర్‌కు దరఖాస్తు చేశానన్నారు. ఆర్బిట్రేటర్ అయిన నల్లగొండ అదనపు జాయింట్ కలెక్టర్ ముందు వరుసగా రెండు పిటిషన్లు (రాతపూర్వక వాదనలు) కూడా వేశానని.. పరిహారం నిర్ధారణ సరిగ్గా జరగలేదని అందులో వివరించానని తెలిపారు. పరిహారం ఖరారులో నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని వెల్లడించారు. ప్రభుత్వ రిజిస్టర్డ్ వాల్యువర్ ప్రకారమే నికర ఆస్తి విలువ రూ.2.73 కోట్లు అని, అందుకే స్థలం తీసుకునే ముందే రూ.6.23 కోట్లు చెల్లించాలని తాను కోరానని గుర్తు చేశారు.

పంజాబ్‌లో అలా.. ఇక్కడ ఇలా..

జాతీయ రహదారి కోసం పంజాబ్‌లో ఒక కంపెనీని పూర్తిగా తరలించాల్సి రావడంతో దానికి రూ.43.96 కోట్లు పరిహారం ఇవ్వడంతోపాటు పరిశ్రమను తరలించేందుకూ సహకరించారని మనోహరరావు తెలిపారు. ప్రభుత్వ విలువ, సొలేషియం, రీప్లేస్‌మెంట్‌కు చెల్లించే పరిహారంతో కలిపితే తనకు కూడా రూ.7.76 కోట్లు రావలసి ఉంటుందని చెప్పారు. కేపిటలైజేషన్ పద్ధతిలో అయితే ఈ పరిహారం రూ.61.05 కోట్లు అవుతుందన్నారు. తన పిటిషన్‌పై భూసేకరణ అధికారిగా నియమితులైన సూర్యాపేట ఆర్డీవో స్పందించాల్సి ఉండగా ఎన్‌హెచ్ఏఐ కౌంటర్ దాఖలు చేసిందని ఆయన తెలిపారు. ఆర్బిట్రేటర్‌గా జిల్లా కలెక్టర్ ఉండాలని, కానీ అదనపు జేసీ ఉండొచ్చని ఎన్‌హెచ్ఏఐ తర్వాత సవరించిందని, ఈ మార్పు చెల్లుబాటు కాదని పేర్కొన్నారు. కేంద్రం జారీ చేసిన 3-డి నోటిఫికేషన్‌లో పరిశ్రమ పేరు కూడా తప్పుగా ప్రచురించారని తెలిపారు. ప్రస్తుతం కేసు హైకోర్టులో ఉందని, దీనికి అధికారులు స్పందించడం లేదని చెప్పారు.

సీటుబెల్టు లేకుండా డ్రైవింగ్

- బ్రిటన్ రాణి భర్త తీరు చర్చనీయాంశం

లండన్, జనవరి 20: బ్రిటన్ రాణి ఎలిజిబెత్-2 భర్త ఫిలిప్ సీటు బెల్టు పెట్టుకోకుండా వాహనం నడిపిన దృశ్యాలు ప్రమాదం జరిగిన రెండు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చాయి. 97 ఏళ్ల వయసున్న ఫిలిప్ గురువారం కారు నడుపుతూ శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్ వద్ద మరో కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదం నుంచి ఆయన సురక్షితంగానే భయటపడినప్పటికీ, మరో కారులో ఉన్న ఇద్దరు మహిళలు, తొమ్మిది నెలల చంటిబిడ్డ గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ శనివారం వెలుగులోకి వచ్చింది. ఫిలిప్ సీటుబెల్టు పెట్టుకోకుండా కారు నడుపుతున్న దృశ్యాలు అందులో రికార్డవడంతో నార్ఫోక్ పోలీసులు ఆయనకు 'తగిన సూచనలు' చేశారు. మరోవైపు ఇంత వయసులో ఆయన కారు నడపడం చర్చనీయాంశమైంది. కాగా ఫిలిప్ క్షమాపణ కూడా చెప్పలేదని ఈ ప్రమాదంలో గాయపడిన ఎమ్మా ఫెయిర్‌వెదర్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో హౌస్‌సర్జన్ మృతి

నార్కట్‌పల్లి, జనవరి 20: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని జాతీయరహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హౌస్‌సర్జన్ మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కామినేని ఆస్పత్రిలో హౌస్‌సర్జన్లుగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన సరిపల్లి స్రవంతి (22) హైదరాబాద్‌కు చెందిన రమ్య, నవ్యజ్యోతి పనిచేస్తున్నారు. వీరు ఆస్పత్రి సమీపంలోని ఏపీ లింగోటం వద్ద ఉన్న హోటల్‌లో ఆదివారం టిఫిన్ చేసి.. ద్విచక్ర వాహనంపై హాస్టల్‌కు వెళుతున్నారు. వీరి బైక్ రోడ్డు మీదకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్రవంతి అక్కడికక్కడే మృతిచెందింది. రమ్య, నవ్యజ్యోతి తీవ్రగాయాలపాలయ్యారు. వెంటనే వీరిని అంబులెన్సులో కామినేని ఆస్పత్రికి తరలించారు. నవ్యజ్యోతిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

'ఇతరుడి' అస్తిత్వ కథలు

దళిత బహుజన స్త్రీ అస్తిత్వాల పీడన, దోపిడి, విస్మరణ, అప్రధానీకరణ- ఇవన్నీ ఎంతోకాలంగా జరుగుతూ వస్తున్నాయి, వర్తమానంలో కూడా జరుగుతూనే ఉన్నాయి. ముస్లిమ్ మైనారిటీ అస్తిత్వం అట్లా కాదు. ముస్లిముల నిమ్నీకరణం, పరాయీకరణం అతి తీవ్రస్థాయిలో కొత్తగా మొదలయ్యాయి. అస్తిత్వాల వికసనం అని మనం చెబుతున్న సమయంలో 'ఇతర' ముస్లిమ్ నిర్మాణం ఉధృతరూపం తీసుకున్నది.

విశాలమైన వరండాలూ గదులూ వదిలిపెట్టి ఇరుకుటింట్లోకి ముడుచుకుపోవడం, ఆరుబయలు రహదారులు స్వేచ్ఛా సంకేత స్థలాలు కాదని ఖిల్లాలోపలకి ఒదిగిపోవాలనుకోవడం, ఎటు నుంచి ఎటు పోయినా మన ఉనికి మనతోనే వస్తూ, ఆచ్ఛాదన కరువు కావడం- ఇది జీవిత వాస్తవం అయినవాళ్ల కథలు చదివితే కాందిశీకత్వం భౌతికం కాదని, భయం మానసికం కాదని అర్థం అవుతుంది. ఎక్కడో కూలిన పురానిర్మాణాల, ఆకాశహర్మ్యాల శిథిల శకలాలు చింతకానిలోనూ ఖమ్మంలోనూ రాళ్లవాన వలె కురుస్తాయని తెలిసి భయం వేస్తుంది. దేవుడే పగబట్టి చంపుతానని ప్రతిజ్ఞ చేస్తే దాక్కోవడానికి స్థలంలేక గయుడు అల్లాడినట్టు, కండెమ్డ్ అస్తిత్వం ప్రాప్తించినప్పుడు ఆశ్రయం ఎక్కడో తెలియక కాళ్ల కింద నేల లేని స్థితి అనుభవంలోకి వస్తుంది. ఏ రాజ్యమూ లేని శరణార్థులు, ఏ దేశానికీ చెందని పోరాటవాదులు, ఏ ప్రభుత్వమైనా బంధించగలిగిన నేరస్థులు- ఇదొక కొత్త ప్రపంచీకరణ. అంతర్జాతీయ, బహుళజాతి, ఏకధృవ ప్రపంచ శక్తుల అనుబంధ ఉత్పత్తులు. విషాద పర్యవసానాలు, విలోమ ప్రతిబింబాలు.

'సాహిల్ వస్తాడు' అన్న కథనే మకుటం చేసుకుని అఫ్సర్ ప్రచురిస్తున్న కథా సంకలనంలోని పదకొండు కథల్లో అత్యధికం, బలవంతపు ప్రవాసాన్ని, వియోగభారాన్ని, ప్రవాసజీవితం నుంచి తిరిగి మూలాల్లోకి పునరాగమన కాంక్షను, వెళ్లినచోటా, ఉన్నచోటా, తిరిగివచ్చిన చోటా కలిగే ఆశాభంగాల వేదనను, జీవితపు సన్నటి సందుల గుండా, సున్నితమైన సన్నివేశాల మీదుగా చిత్రించాయి. బాల్యంలోకి తొంగిచూసినప్పుడు, ఎడమైపోయిన స్థలాల్లోని జీవితాన్ని స్పృశించినప్పుడు, మార్మికతలోకి ఏకాంతంలోకి కూరుకుపోయిన వ్యక్తిత్వాలను విప్పిచూస్తున్నప్పుడు- రచయితో, ఉత్తమ పురుష కథకుడో పడిన విభ్రమ, కలవరం, వేదన, దిగులు ఈ కథలన్నిటిలో పాఠకులను కూడా తాకి ఒక మెలాంకలీ లోకి నడిపిస్తాయి.

డెబ్భైల దందహ్యమానత నుంచి ఎనభైలు కాలాన్ని కొత్తలోకి మలుపు తిప్పాయి. సామూహికత, పోరాటశీలత, నూతన సమాజ స్వప్నాలు అన్నీ కొనసాగుతూనే ఉన్నా, వ్యవస్థాగత పరిణామాలూ, అపసవ్యతలూ మధ్యతరగతిలో సొంత వేదనలకు, సొంత వ్యక్తీకరణలకు ఆస్కారమిచ్చాయి. సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలో అంతర్‌యుద్ధారావం కూడా బలంగా వినిపించడం మొదలయింది. అప్పుడే, వైయక్తికత, అంతర్ముఖీనత్వం, అనుభూతి ప్రాధాన్యం మొదలైన మాటలు అసామాజికంగా, ప్రతీఘాతుకమైనవిగా విమర్శలను ఎదుర్కొన్నాయి. స్త్రీవాదం 80లలోనే వ్యక్తిగతం కూడా రాజకీయమేనన్న విశ్వాసంతో, వ్యక్తిగత స్థాయిలో జెండర్ చైతన్యవాదాన్ని తీసుకువచ్చింది. సామాజిక, వైయక్తిక సాహిత్యాల మధ్య గీతలు చెరిగిపోవడం మహిళావాదంతోనే మొదలయింది. తొంభైలలోకి 20వ శతాబ్దం మలుపు తిరిగేటప్పటికి, సామూహిక ఆత్మాశ్రయత్వం, సామాజిక అంతర్ముఖీనత్వం రంగం మీదకు వచ్చి, కొత్త మిశ్రమం రూపొందింది. అందుకు కూడా కారణాలు చారిత్రకమయినవీ రాజకీయమైనవీ సామాజికమయినవే. రిజర్వేషన్ల అనుకూల వ్యతిరేక సంవాదం; అంబేద్కర్ శతజయంతి, పునరావిష్కారం; బాబ్రీమసీదు కూల్చివేత... ఈ సంఘటనలు 90ల నాటి దేశ రాజకీయ, సామాజిక చిత్రపటాన్ని మార్చివేశాయి. తెలుగు సాహిత్యంలో కొత్త వరవడిని ప్రవేశపెట్టాయి. అప్పటి దాకా సమాజం గురించి, తమ తమ ఉనికి గురించి ప్రగతిశీలురకున్న అభిప్రాయాలు ప్రశ్నలు ఎదుర్కొనసాగాయి. 80లలో కవిత్వ వ్యక్తీకరణలో కొత్తగొంతు సవరించుకున్న అఫ్సర్ వంటి వారు కూడా 90ల సంచలనంలో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. స్వయంగా మైనారిటీ అయినప్పుడు ఆ ఉక్కిరిబిక్కిరి కేవలం తాత్వికమయినది కాదు, భౌతికమయినది, ఉద్వేగపూరితమయినది. జీవన్మరణ సంక్షుభితమైనది.

తెలిసిన విభజనల మధ్య అలవాటుపడి, వాటిని అధిగమించడానికేవో తెలిసిన ఉపశమనాలను పోరాటాలను స్వీకరించి, ఏలాగో ఒకలాగు బతుకు ఈడుస్తున్న సమాజానికి ఒక్కసారిగా అనేక విభజనలు స్పృహలోకి వచ్చి, అనేకత్వపు వేదుకను, భీతిని అనుభవించవలసి వచ్చినప్పుడు, లోకం ఒక్కసారిగా అపరిచితమైపోతుంది. పాత స్వప్నాలు శిథిలమై, విశ్వాసం అపనమ్మకమై, సోదరత్వంలో గర్భితమైన దాయదిత్వం ఆవిష్కృతమై, ఆలింగనాలన్నిటిలో ముళ్లు మొలిచిన వేళ.. సమాజంలోనూ సాహిత్యంలోనూ సంభాషణ, సంఘర్షణ కొత్త రూపం తీసుకుంది. అస్తిత్వాల వికసనమా, గుర్తింపుల సంక్షోభమా, ఆధునికత పునర్మూల్యాంకనమా, చరిత్ర ముగింపు ప్రకటనా, నాగరికతల యుద్ధమా- ఎన్నెన్ని పేర్లతో కొత్త సంవాదాలు వేదికమీదికి వచ్చాయో, లెక్కలేదు. ఇవి కేవలం ప్రశ్నలుకావు, కేవలం పండిత చర్చలూ కావు, అక్షరాలలో మాత్రమే వ్యక్తమైన సంక్షోభమూ కాదు. అవి, మనుషుల రక్తసిక్త సంవేదనలూ బాధమయ జ్ఞానోదయాలూ ఉనికిని భీతిగా బీభత్సంగా దహించివేసే విచికిత్సలూ అనుభవైకవేద్యమైన బాధాగ్ని పరిమళాలు. ఇదొక మంద్రస్థాయి అంతర్యుద్ధం.

దళితులూ బహుజనులూ స్త్రీలూ మైనారిటీలూ అంటూ అన్ని అస్తిత్వాలను ఒక వరుసలో చెబుతాము కానీ, వాటిలో ఒకదానికీ మరొకదానికీ మధ్య, తక్కిన అన్నిటికీ మైనారిటీ అస్తిత్వానికీ మధ్య ఉన్న తేడాను తరచు విస్మరిస్తాము. దళిత బహుజనులూ స్త్రీలూ- వీరిపై సామాజిక తదితర ఆధిపత్యాలు నిరంతరం సాగుతూ ఉన్నా, కొత్త కొత్త రూపాలు తీసుకుంటున్నా, సమాజాన్ని మార్చాలనుకునే శక్తుల ప్రాధాన్యాలలో వాటి పరిగణన

అఫ్సర్ తన కథల్లో అధికభాగం సహజీవన, సమ్మతి విలువలనే పదే పదే బలంగా చెప్పారు. అదే తన సిద్ధాంతం అన్నట్టు నిబద్ధతతో తపనతో చెప్పారు. ఒక కథలో ఉత్తమపురుష పాత్ర చెప్పినట్టు, "ఇప్పటికీ నాకు మసీదు పతనం కంటే, మున్నాతో ఆడుకునేవాళ్లు ఎవరూ లేరన్నదే పెద్ద సమస్య". మసీదు పతనానికి ఆ సమస్యకు సంబంధం ఉన్నది కానీ అఫ్సర్ మున్నా కోణం నుంచే కథ చెబుతాడు.

భిన్నంగా ఉంటూ వచ్చింది. సమాజాన్ని అంతరాల నుంచి, అన్యాయాల నుంచి విముక్తం చేయాలనుకునేవారి పొరపాటు ప్రాధాన్యాలను ప్రశ్నించడం, తమ తమ రాజకీయ, సామాజిక ఆకాంక్షలను వేదికల మీదికి ప్రముఖంగా తీసుకురావడం - ఆయా అస్తిత్వాల సంవాదం బలంగా చేసింది. ఆయా అస్తిత్వాల పీడన, దోపిడి, విస్మరణ, అప్రధానీకరణ- ఇవన్నీ ఎంతోకాలంగా జరుగుతూ వస్తున్నాయి, వర్తమానంలో కూడా జరుగుతూనే ఉన్నాయి. మైనారిటీ అస్తిత్వం, ముఖ్యంగా ముస్లిమ్ మైనారిటీ అస్తిత్వం అట్లా కాదు. ముస్లిముల నిమ్నీకరణం, పరాయీకరణం అతి తీవ్రస్థాయిలో కొత్తగా మొదలయ్యాయి. అస్తిత్వాల వికసనం అని మనం చెబుతున్న సమయంలో 'ఇతర' ముస్లిమ్ నిర్మాణం ఉధృతరూపం తీసుకున్నది. అందుకే, ముస్లిమ్ మైనారిటీ అస్తిత్వం ఒక గత సామరస్య కాలాన్ని నెమరువేసుకుంటుంది, ఆ సామరస్యకాలం నిజంగా సామరస్యపూరితమేనా, ఊహాత్మకమా అన్న ప్రశ్న కూడా న్యాయమే. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వం కాల్పనికత మిళితమైన ఒకానొక గతవైభవాన్ని తలచుకుని వర్తమాన శైథిల్యానికి చింతించినట్టే, మైనారిటీ అస్తిత్వం కూడా మంచిరోజులు మించిపోవడం గురించి బాధపడుతుంది.

గతకాలపు సానుకూల స్మరణ అన్నది నేరుగా ఉండనక్కరలేదు. వర్తమానంలోని ఘర్షణాత్మకతను పెద్దగా ప్రస్తావించని కథలు ముస్లిమ్ రచయితల సాహిత్యంలో అనేకం ఉన్నాయి. కవిత్వంలో ఉద్వేగాంశ వచనం కంటె ముందు తీవ్ర వ్యక్తీకరణలకు ఆస్కారం ఇస్తుంది కాబట్టి వాతావరణంలో మార్పునకు ముందుగా స్పందించగలుగుతుంది. ముస్లిమ్ మైనారిటీల స్టీరియో టైపింగ్‌ను, వారి నిమ్నీకరణను కవిత్వ వ్యక్తీకరణలో ముందుగానే గమనించవచ్చు. అయితే, అన్ని అస్తిత్వాలలో వలెనే మైనారిటీ అస్తిత్వాల వేదన కూడా మొదట దైన్యాన్ని, నిష్ఠూరాన్ని వ్యక్తీకరించడంతో మొదలయింది. వచనంలో అభిప్రాయ వ్యక్తీకరణో, ప్రకటనో మాత్రమే చేయలేము. జీవితం నుంచి మాట్లాడాలి కాబట్టి, సాధారణ ప్రజాజీవనంలో వైరుధ్యాలు తీవ్రతరం అయ్యే క్రమం వెనువెంటనే వ్యక్తం కాదు. అందుకే, ముస్లిం కథ మొదట తమ జీవన ప్రత్యేకతలను, యావత్ సమాజంలో తమ సమ్మిశ్రతను చెప్పడానికి ప్రయత్నించింది. ముస్లిముల జీవితాన్ని పరిచయం చేసే కథలు, వారి సాంస్కృతిక విశేషాలను తెలియజెప్పే కథలు, సాంఘిక జీవితంలో తమ ప్రమేయం అధికంగా ఉన్న రోజుల కథలు- ఇవన్నీ ఐక్యతను ప్రధానంగా, ఘర్షణాత్మకతను అప్రధానంగా చెప్పిన కథలే. ముస్లిమ్ మైనారిటీల ఇతరీకరణం పెరుగుతున్న కొద్దీ, సమాజంలోని ఘర్షణాత్మక వాతావరణం కథాసాహిత్యంలోనూ క్రమానుగతమైన మోతాదులో వ్యక్తం కాసాగింది.

భారతీయ సమాజంలోని మితవాద శక్తులు, వారితో ప్రత్యక్షంగా పరోక్షంగా పెనవేసుకున్న శ్రేణులు, రాజ్యయంత్రాంగంతో సహా మతతత్వీకరణ చెందిన పాలకవర్గాలు- ముస్లిమ్ అస్తిత్వాన్ని 'ఇతరం'గా, 'హీనంగా', 'ప్రమాదకరం'గా నిర్మిస్తున్న క్రమం వేగం పుంజుకునే కాలంలో అఫ్సర్ కలవరపాటు కూడా తీవ్రం అయింది. దాన్ని జీర్ణించుకుని స్థిమిత పడితే కానీ కథారచయితగా తన వేదనను వ్యక్తం చేయలేదు. అందుకే కాబోలు, బాబ్రీమసీదు విధ్వంసం తరువాత దశాబ్దానికి కానీ, ఆ పరిణామాలకు ఒక గ్రామీణ సూక్ష్మరూప కథనంగా 'గోరీమా' రాయలేదు. గుజరాత్ దేశం మీద పరిచిన చీకటి, అమెరికా జంట టవర్ల ధ్వంసం ప్రపంచ పటం మీద గీసిన కొత్త సరిహద్దులు అతని మీద 'ఇతరత్వ' దాడిని పెంచాయి. అమెరికన్ ఇమ్మిగ్రేషన్ యంత్రాంగం అతన్ని పదే పదే ప్రత్యేకంగా నఖశిఖపర్యంతం లేజర్ కళ్లతో జల్లెడపట్టినపుడు, తనగురించి తనకు మరింత స్పష్టంగా అర్థమయింది.

కవిత్వ వ్యాసంగంతోనే కథారచన ప్రారంభించి, అడపాదడపా కథలు రాస్తున్నా, తన అసలైన కథాక్రమాన్ని గోరీమాతోనే అఫ్సర్ ప్రారంభించాడు. కవిత్వ రచనలో భావంలో వ్యక్తీకరణలో రకరకాల చాయలను చూపించిన అఫ్సర్, ఈ కథాసంకలనాన్ని ఒకే స్థూల ఇతివృత్తం పరిధిలో రాసిన రచనలతో అందిస్తున్నాడు. కవిగా, వ్యక్తిగా, సామూహిక వ్యక్తిగా, ఏకాంతిగా- పరాయీకరణను తాత్వికంగా అనేకచోట్ల రాసిన అఫ్సర్, పరమ భౌతిక వాస్తవమయిన పరాయితనం అనుభవానికి వచ్చి చేసిన రచనలు కావడం వల్లనే ఈ పుస్తకం ప్రత్యేకం అవుతోంది.

అస్తిత్వం వేదనను, ఒక సమూహానికి బలంగా చెందిన భావనను రెంటినీ ఇస్తుంది. ఆ వేదనకానీ, భావనకానీ, ఒక సమూహంగా సంఘటిత పడడానికి, తగిన కార్యాచరణ చేయడానికి కూడా దారితీస్తుంది. తక్కిన అస్తిత్వాలకు, ముస్లిమ్ మైనారిటీ అస్తిత్వానికి ఉన్న మరో తేడా, వేదన పలికినంతగా సంఘటితత్వం పలకకపోవడం. ముస్లిమ్ మైనారిటీలు ఒక అస్తిత్వ సమూహంగా నిలబడగలగడం గురించి బాలగోపాల్ ఇరవయ్యేళ్ల కిందట ప్రశ్నించుకుని సమాధానం చెప్పారు. మతానికి సంబంధించిన ఛాందసత్వానికి దూరంగా, ముస్లిములు తమ వేదన, ఆకాంక్షల ఆధారంగా సంఘటితం కావడం సాధ్యమూ అవసరమూ అని కూడా ఆయన చెప్పారు. ఆయనతో ఏకీభవించే ముస్లిమ్‌వాదులు ఉన్నారు కానీ, దురదృష్టవశాత్తూ, ఆ వాదం ఒక అస్తిత్వ శక్తిగా బలపడలేకపోయింది.



మతపరమైన అస్తిత్వ ప్రకటనకు తెలుగు ప్రగతిశీల సమాజంలో ఉన్న విముఖత రీత్యా కూడా అనేకమంది ముస్లిమ్ మైనారిటీ రచయితలు అస్తిత్వవాద స్థాయిలో తమ ఆలోచనలను తీసుకువెళ్లలేదనిపిస్తుంది. తెలుగు ముస్లిమ్ రచయితల్లో వేర్వేరు వాదాలున్నాయి. సైద్ధాంతిక చర్చలూ జరిగాయి. మరి కొందరు దళిత బహుజనులతో ఐక్యసంఘటన అనే వ్యూహాన్నే సిద్ధాంతంగా భావిస్తూ, అంచెలంచెల కుల వ్యవస్థ విమర్శనే మతతత్వ విమర్శగా భావించారు. హిందూ ముస్లిమ్ సమ్మిశ్రిత జీవన విధానం అనే విలువను కాపాడుకోవడం, బాలగోపాల్ చెప్పినట్టు భారత దేశంలో వైవిధ్యాన్ని, భిన్నత్వాన్ని సహించడం కాక సమ్మతించడం అనే విలువను పెంపొందించుకునే ప్రయత్నం చేయడం- నిజంగానే లౌకికత్వాన్ని, మతపరమైన సమ్మిశ్రిత జీవనాకాంక్షను పెంపొందిస్తాయి. ఈ విషయంలో తెలుగు సాహిత్యకారుల్లోని ముస్లిమ్ మైనారిటీవాదులు ఒంటరి పోరాటం చేస్తున్నారని చెప్పాలి. వారి ఆశయాలతో దగ్గరగా ఉండే రాజకీయపక్షం లేదు. ఒక దేశవ్యాప్త సైద్ధాంతిక నాయకత్వం లేదు. అయినా, వారికి తోచిన ప్రత్యామ్నాయ ఆలోచనలను వ్యాపింపజేస్తున్నారు.

ఏదో ఒక వాదంతో నేరుగా తమను జోడించుకోని ఇతర ముస్లిమ్ రచయితలు కొందరు సహజీవన, సమ్మతి విలువల కోసం రచనలు చేశారు. అఫ్సర్ కూడా తన కథల్లో అధికభాగం ఆ విలువలనే పదే పదే బలంగా చెప్పారు. అదే తన సిద్ధాంతం అన్నట్టు నిబద్ధతతో తపనతో చెప్పారు. ఒక కథలో ఉత్తమపురుష పాత్ర చెప్పినట్టు, "ఇప్పటికీ నాకు మసీదు పతనం కంటే, మున్నాతో ఆడుకునేవాళ్లు ఎవరూ లేరన్నదే పెద్ద సమస్య". మసీదు పతనానికి ఆ సమస్యకు సంబంధం ఉన్నది కానీ అఫ్సర్ మున్నా కోణం నుంచే కథ చెబుతాడు.

ఈ పుస్తకంలోని పదకొండు కథలూ ఒక అస్తిత్వ బాధను సన్నగా పదునుగా మనలోకి దించుతాయి. కవి రాసిన కథలివి అని మనమెక్కడా మరచిపోలేము. ఉదాత్తమయిన, మార్మికమయిన, భావుకులయిన పాత్రలు ఈ కథల్లో మనల్ని పలకరిస్తాయి. అక్కడక్కడా సంభాషణల మధ్య తితిలీలు ఎగురుతూ కనిపిస్తాయి. మామూలు జీవిత సన్నివేశాలు, అతి సాధారణ ఉద్వేగాలు, చిన్నచిన్నదుఃఖాలు మన అశ్రుగ్రంథుల్ని సున్నితంగా పరామర్శిస్తాయి. వీటిని చదువుతుంటే, అనేక కథల్లో నిస్సహాయ ప్రేక్షక వ్యాఖ్యాతగా కనిపించే ఉత్తమ పురుష కథకుడిలాగే, ఈ సమాజం అంతా రణరంగ రచనను చేష్టలుడిగి చూస్తున్నదేమో అని భయం వేస్తుంది. ఏమన్నా చేయలేమా, అన్న ప్రశ్న కూడా తారసపడుతుంది.

■ కె. శ్రీనివాస్

(అఫ్సర్ కథా సంపుటి 'సాహిల్ వస్తాడు'కు కె.శ్రీనివాస్ రాసిన ముందుమాటలోంచి కొంత భాగం ఇది. 'సాహిల్ వస్తాడు' పుస్తకావిష్కరణ జనవరి 26 సా.5.30గం.లకు దోమలగూడ, హైదరాబాద్‌లోని హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరుగుతుంది.)

జ్ఞాపకాలన్నీ మధురం కావు

నేను నడిచొచ్చిన బాట నా ఆత్మకతను అచ్చు వేస్తుంది.
బురదలో పుట్టి బురదలో తెల్లారిన బతుకు
బురద కాళ్ళ ముద్రల్నే నా జ్ఞాపకంగా లోకానికిస్తుంది.
పసుపూ పారాణిల ముచ్చట్లు అన్ని పాదాలనూ ముద్దాడవు మిత్రమా!

నువు చెప్పే వెన్నెల రాత్రులూ
వేసవి విరహాలూ
గాజుల గలగలలూ
ఏడు వారాల నగల మెరమెరలూ
తొలి రాత్రుల పెదవంచుల కాగే తమకాలూ
నా అంటరాని దేహానికి పరిచయమౌతాయా చెప్పు?

మొద్దు బారిన నా పెదాల చర్మం
పగుళ్ళు దేరిన పాదాలూ
గరుకైన చేతులూ బిరుసెక్కిన వెంట్రుకలూ
చేలో పుట్టిన మీ అన్నల, అయ్యల కుతి చల్లార్చుకోడానికి తప్ప,
కరీదైన మీ శుభలేఖల్లో పెళ్ళి కూతురిగా పనికి రాలేదు కదా!

పొయిలో మండి పొయిలోనే బుగ్గయ్యే కొరకంచిలా
మీ కామందుల కోరికల బీడీ ముట్టించుకోడానికి నాలాంటి
పచ్చి పేళ్ళెన్ని బుగ్గయ్యాయో ఎండుకట్టెలెన్ని బలయ్యాయో
మీ చేనుల్లోని నాగటి చాళ్ళనడిగి చూడు బుజ్జమ్మా.


మీ ఇలాకాల మగకళ్ళన్నీ మా చిరుగు బొంతల సీరల కోసం
సాటూ మదుగూ లేక మేమడ్డెట్టుకునే తాటాకు దొడ్ల కంతల కోసం
మాటేసిన తోడేళ్ళల్లా కబళిద్దామని చూస్తుంటే..
మా అన్నల బీదకళ్ళేమో
మీ దొరసానుల సున్నటి సోయగాలు ఓ పాలైనా సూసే అదృష్టం కోసం
మీ లోగిళ్ళ సెంపలట్టుకు తిరగబట్టె.

కౌలు పైసలన్నీ కామందు వడ్డీకే జమేసుకుంటే
తాలుకోలేక అయ్య ఆగమైతే,
మా అన్నేమో మీ రాజేస్వరిని ప్రేమించిన పాపానికి
మిట్ట మద్దేన్నమేల మీ వరి పొలానికి ఎరువై పాయె.

అందుకే సెప్తున్నా బుజ్జమ్మా..!
"పొద్దు గూకులూ పేదరుపులేనా" అని ఈసడించమాకు.
నే నడిచొచ్చిన బాట నా జీవిత కధకు సాక్ష్యం చెప్తుంది.
పల్లేరు ముళ్ళతో, చీదర గొలిపే కంపలతో నిండిన మా బతుకు బాట
నెత్తుటి చారికల్నే మా గడపలపై స్రవిస్తుంది.
అర్ధాంతరంగా బలైన మా పదహారేళ్ళ యవ్వనాల్నీ
ఛిద్రం చేయబడ్డ మా ముక్కుపచ్చలారని మానాల్నీ
మా ఆత్మకథలుగా లిఖిస్తుంది.

■ అరుణ గోగులమండ

(బాపట్లలో ఆధిపత్య కులపు అబ్బాయిని ప్రేమించిన పాపానికి హత్యగావించబడ్డ బెజ్జం స్రవంతి వేదనలో)



'వెన్నెల కౌగిళ్ళు'

వెన్నెల రాసిన 'వెన్నెల కౌగిళ్ళు' ఆవిష్కరణ సభ నవ్యాంధ్ర రచయిత సంఘం ఆధ్వర్యంలో జనవరి 23 సా.6గం.లకు విజయవాడ గాంధీనగర్ హోటల్ ఐలాపురం ఏసీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. టి. రజని, బిక్కి కృష్ణ, కొలకలూరి ఇనాక్, తుర్లపాటి కుటుంబరావు, ఎ. విజయ్ కుమార్, శ్రీరామ కవచం సాగర్ తదితరులు పాల్గొంటారు.

కలిమిశ్రీ

వరవరరావు కవిత్వంతో ఒక రోజు

విప్లవ కవి వరవరరావు కవిత్వంతో ఒక రోజు- సాహిత్య సభ ఫిబ్రవరి 3 ఉ.10గం.ల నుంచి రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్, మహబూబ్ నగర్ (తెలంగాణ చౌరస్తా - బోయపల్లి గేట్ దారిలో) జరుగుతుంది. బి. సుదర్శన్ రెడ్డి, జి. హరగోపాల్, కె. శివారెడ్డి, ఖాదర్, పాణి, నందిని సిధారెడ్డి, జి.లక్ష్మినరసయ్య, దేవిప్రియ, యాకూబ్, ఎ.కె. ప్రభాకర్, కోయి కోటేశ్వర్ రావు, కొండేపూడి నిర్మల తదితరులు పాల్గొంటారు.

ఎం. రాఘవాచారి

లక్ష్మీనారాయణ జైనీ పురస్కారం

లక్ష్మీ నారాయణ జైనీ జాతీయ సాహితీ పురస్కారం 2019ను ఎ.ఎన్. జగన్నాథ శర్మ 'మొదటి పేజీ కథలు' కథా సంపుటికి గాను స్వీకరిస్తారు. పురస్కార ప్రదాన సభ జనవరి 29 సా.6గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. నందిని సిధారెడ్డి, సుధామ తదితరులు పాల్గొంటారు.

ప్రభాకర్ జైనీ

'ప్రైడ్ ఓవర్ ప్రెజుడీస్'

'ప్రైడ్ ఓవర్ ప్రెజుడీస్' శీర్షికతో జాతి గౌరవాన్ని పెంచిన రచనలపై నెలకొకసారి కృష్ణమ్మ అలలపై సాగే సాహిత్య నౌకా విహారంలో, సాహిత్య చర్చా కార్యక్రమంలో భాగంగా జనవరి 26 మధ్యాహ్నం 5గం.లకు ఏపిటిడిసి బోట్ జెట్టీ, బెర్మ్ పార్క్, విజయవాడలో 'కొల్లాయి గట్టితేనేమి' నవల పై చర్చ ఉంటుంది. అలాగే ఈ నెల గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'సాహిత్యంలో జాతీయతా భావాలు' అంశంపై రామతీర్థ విశ్లేషిస్తారు. వివరాలకు: 98450 34442.

సాయి పాపినేని

"ఇక రచయితలమే ప్రజల వద్దకు వెళ్లాలి"



వాడ్రేవు వీరలక్ష్మీదేవి

పలకరింపు

'సాహితీ పద యాత్ర' పేరుతో ఇటీవల (2018 డిసెంబరు 8-10తేదీల్లో) మీరు మరికొందరు సాహిత్యకారులు, సాహిత్యాభిమానులతో కలిసి కొన్ని ఊళ్ళలో పాదయాత్ర చేశారు. ఈ ఆలోచన ఎలా వచ్చింది?

2018 సెప్టెంబర్‌లో కేంద్రసాహిత్య అకాడమీ కాకినాడలో యాత్రాసాహిత్యం మీద క్రియ స్వచ్ఛంద సంస్థతో కలిసి ఒక సభ జరిపింది. క్రియ సంస్థ ప్రభుత్వ పాఠశాలలలో చదివే పిల్లలలోని సృజన శక్తులు వెలికి తీయడానికి చాలా కార్యక్రమాలు చేస్తుంది. మేమంతా అందులో పనిచేస్తాం. అలా యాత్రాసాహితి సభ ముందురోజే అతిథులందరినీ రమ్మని ఊరి బయట మామిడితోటలో సమావేశపరిచాం. అందరి చేతా వారి యాత్రానుభవాలు చెప్పించాం. చివరగా చినవీర భద్రుడు గత కాలం నుంచీ పలువురు చేసిన పాదయాత్రల గురించి చెప్తూ భాషాసాహిత్యాల కోసం ఇంతవరకూ ఎవరూ నడవలేదని మరికొంతకాలం తర్వాత తాను చేపట్టబోతున్నానని ఆసక్తిగలవారు పాల్గోవచ్చని సుదీర్ఘమైన ప్రసంగం చేశాడు. మేం అందరం ఉత్తేజితులం అయాం. ఇంతకాలం మనం కవులం, రచయితలం, సాహిత్యాభిమానులం చాలా పనులు చేశాం. కానీ కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు మనకూ మధ్య దూరం పెరిగిపోయింది. ప్రజలు మనదగ్గరకు రారు, వచ్చేవాతావరణం పోయింది. ఇక మనమే వారి వద్దకు వెళ్లాలి. దీనికి కాలినడకన ప్రయాణించడం ఒక మేలైన పద్ధతి. పాదయాత్రలో ఎందరు ఎన్ని ప్రయోజనాలు పొందేరో చరిత్ర చెప్తోంది. కాబట్టి ఇప్పటి పరిస్థితుల్లో కవులు రచయితలూ ప్రజలకు దగ్గరయి తెలుగు భాష గురించీ తద్వారా సాహిత్యపఠనం గురించీ వారిని కదిలించడం ఉద్దేశం.

మీ పాదయాత్ర సాగిన దారి ఏమిటి?

మేం నడవాలి అనుకోగానే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గుర్తొచ్చారు. వారి ఊరు తూగోజిల్లాలో పొలమూరు. కథకి వారు పెన్నిధి. ఇక కవిత్వం అనగానే దేవులపల్లి కృష్ణ శాస్త్రి. వారి ఊరు చంద్రంపాలెం. ఈ రెండు ఊళ్లమధ్య దూరాన్ని చూసుకున్నాం. 45 కిలోమీటర్లు. మరో రెండుదార్లు ఉన్నాయి. కానీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఈ దారి వెంటే నడుచుకుంటూ పిఠాపురం వచ్చేవారని తన అనుభవాలూ జ్ఞాపకాలలో రాశారు. అందుకే ఈ దారి ఎంచుకున్నాం. పొలమూరు నుంచి రాయవరం మీదుగా బలభద్రపురం, బిక్కవోలు, పెదబ్రహ్మ దేవం, మేడపాడు, వేట్లపాలెం, సామర్లకోట, ఉండూరు, చంద్రంపాలెం- ఇదీ మేం ఎంచుకుని నడిచిన దారి. ఇంచుమించు ప్రతీ 5 లేక 6 కిలోమీటర్ల తర్వాత ఆగేలా ప్లాన్ చేశాం. ఒకటిరెండు చోట్ల 8 కిలోమీటర్లు కూడా వచ్చింది. రాయవరం లోనే మొదట ప్రింటింగ్ ప్రెస్ చూసి అందులో ప్రూఫ్ రీడింగ్ పని నేర్చుకున్నారట శ్రీపాదవారు. ఆనాటి ప్రబుద్ధాంధ్ర పత్రిక అక్కడనుంచే వచ్చేది

యాత్రలో ఎదురైన సానుకూలతలూ, ప్రతికూలతలు?

ఆలోచన ఐతే ఉంది గానీ ఎవరికీ పూర్తి ధైర్యం లేదు. రెండుసార్లు రెకీ చేశాం. మొదటిసారి వెళ్లినప్పుడు అనపర్తి మండలం తాసీల్దార్ కొరుప్రోలు గౌరీ నాయుడు చాలా భరోసా ఇచ్చారు. ఆయన మంచి సాహితీవేత్త. మొదటి రెకీలో దారంతా చూసుకుంటూ అల్పాహారానికీ, మధ్యాహ్న భోజనానికి ఆగడానికి కుదిరే దూరాలలో ఉన్న ఊళ్ల గుర్తుపెట్టుకుంటూ, రాత్రి పూట ఉండవలసిన ఊళ్ల చోట్లు చూసుకుంటూ వెళ్లేం. అప్పటికి ఒక అంచనా కొంత ధైర్యమూ వచ్చేసాయి. ఈ రెండూ రెకీలూ అయి అటు పొలమూరులోనూ ఇటు చంద్రంపాలెంలోనూ ఊరి పెద్దల ప్రోత్సాహం లభించాక పూర్తి నమ్మకం వచ్చి అప్పుడు సోషల్ మీడియాలో ప్రకటించాం. మొదలుపెట్టింది క్రియా సంస్థే కానీ తూర్పుగోదావరి జిల్లాలో సాహితీ సంస్థలన్నింటికీ తెలియజేసి అందరం కలిసిచేద్దామన్నాం. కొందరు కలిశారు. కొందరు ప్రోత్సహించారు రెండురాష్ట్రాలనుంచీ ఎవరైనా సరే రావచ్చని ఆహ్వానించాం. దాదాపు 50మందికి సరిపడా రాత్రి బసలకు ఏర్పాటు చేశాం. పోలవరంలోని బుద్ధవరపు ఛారిటబుల్‌ట్రస్ట్ ఇప్పటికి పదేళ్లుగా శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి పురస్కారం ఇస్తూ ఉంది. ఆ ట్రస్ట్ మా పదయాత్రకు గొప్ప ప్రోత్సాహమిచ్చింది.

ప్రజల నుంచి ఊహించనంత ప్రోత్సాహం లభించడం చాలా ఆశ్చర్యం కలిగింది. ఇంత కన్న గొప్ప అనుకూలత అవసరం లేదనిపించింది. ఎందుకంటే మేం అన్ని ఇబ్బందులకీ సిద్ధపడ్డాం. కానీ మరీ అనామకంగా తిరగాలేమో అని భయపడ్డాం. ఇలాంటి కష్టమైన పనులకి ప్రభుత్వం వేపు నుంచి ఏ కొంచెం సహాయమూ సహకారమూ ఉన్నా పూర్తిగా నెగ్గుకు రాగలం. అది కూడా దొరికింది. ఇక ప్రతికూలతలు ఏమీ లేవు. ఎక్కువ మంది అంటే 100 మంది పగలు నడుస్తారని 50 మందేనా రాత్రి ఆగుతారని అనుకున్న మాకు మొత్తం 50 మందితో పూర్తి కావడం కాస్త నిరాశ పరచకపోలేదు. వృద్ధులు నడవలేక యువకులు ఉత్సాహంలేక వెనకాడారు. దూరాల నుంచి వస్తామని ఉత్సాహపడినవారు మళ్లీ పలకలేదు. ఎంత మందికి భోజనాలూ వసతులూ ఏర్పాటు చెయ్యాలో చివరి దాకా తెలియక కాస్త ఇబ్బందిపడ్డాం కానీ పదిమంది దాకా దూరంనుంచి వచ్చి మాతో నడిచారు. అదెంత ఉత్సాహాన్నిచ్చిందో చెప్పలేను. మా టీం లో ఉద్యోగులుండడం వల్ల యాత్ర సెలవు రోజుల్లో పెట్టవలసివచ్చింది. అయినా రెండు రోజులు సెలవు పెట్టారు. అంచేత పాఠశాలలను ఆ రెండు రోజులూ కవర్ చెయ్యలేకపోయాం. ఇది 5 రోజులకు సాగదీస్తే మరింతగా ఊళ్లలో తిరిగే అవకాశం ఉండేదనిపించింది. తక్కినవన్నీ అనుకూలతలే.

ఈ ప్రయాణంలో మరచిపోలేని అనుభవాలు?

మొత్తం ప్రయాణం దానికదే అద్భుతమైన అనుభవం. ప్రతీ ఒక్కరికీ. ఇప్పటికీ కాదు ఎప్పటికీ మరువలేమనిపించింది. కారణం మేం సునాయాసంగా నడవగలగడం ఒకటైతే ఊహించని దానికన్న పదిరెట్లు స్పందన అన్ని వేపులనుంచీ రావడం మరొకటి.





మేం అయిదారు పాఠశాలలకు వెళ్లాం. ఒక ప్రాథమిక పాఠశాల పిల్లలు కొంతదూరం మా వెంటవచ్చి వెనక్కి వెళ్ళడానికి ఇష్టపడలేదు. మా చేతులుపట్టుకుని నడిచేసారు. మాతో పాటు 'నడుద్దాం నడుద్దాం.. భాష కోసం నడుద్దాం' అని నినాదాలిచ్చారు. ఆ లేతచేతులిచ్చిన భరోసా మరువలేనిది. రోడ్లమీద రెండుచక్రాల వాహనాలమీద వెళ్లేవాళ్లంతా ఆగి అడిగివెళ్లేవారు. బస్‌వాళ్ళు కూడా ఆసక్తిగా చూడక పోలేదు. ఇక ప్లకార్డులు నినాదాలూ ఎలాగూ ఉన్నాయి.

మరిచిపోలేని అనుభవాలు చాలానే ఉన్నాయి. అందులో వేట్లపాలెంలో రామకృష్ణ సేవాసమితి వారిచ్చిన స్వాగతం. అప్పటికి ముందురోజుతోకలిపి 30 కిలోమీటర్లు నడిచి ఉన్నాం. సేవాసమితి వారి ఆశ్రమంలోనే రాత్రి బస. నెమ్మదిగా నినాదాలు చెప్తూ ఊరి పొలిమేరలలో ప్రవేశించిన మాకు విద్యార్థుల గుంపు బేండ్ లాంటి డ్రమ్స్‌తో ఎదురయింది. ఆ గుంపు మమ్మల్ని స్వాగతిస్తూ ప్రతీ వీధిలోనూ విద్యార్థులను కలుపుకుంటూ ఊరంతా తిప్పేరు. ఎంత ఉత్సాహపరచేరంటే మరో 30 కిలోమీటర్లు అవలీలగా నడిచెయ్యగలం అనిపించింది. పొలమూరులో ఆరంభసభ, చంద్రంపాలెంలో ముగింపు సభ గురించి మేం పెద్దగా అనుకోలేదు. కానీ రెండు ట్రస్ట్‌లూ పూనుకుని జరిపేరు. చంద్రంపాలెం సభలో విద్యార్థులు పాల్గొని మాట్లాడేరు. ఒక 7వ తరగతి పిల్లవాడు కవిత రాసి చదివి కృష్ణశాస్త్రి పేరు నిలబెడతానన్నాడు. చివరిగా ఇది ఆరంభం మాత్రమే అనీ దీన్ని అన్ని ప్రాంతాలవారూ అందుకోవాలని మా కోరిక. ఈ నడక ప్రజలను తప్పకుండా ఎంతో కొంత కదిలిస్తుందన్నది మాకు అర్థమైంది. మేం వెళ్లిన ప్రతీ పాఠశాలలోని విద్యార్థులకు మంచి జ్ఞాపకం అవుతుందనిపించింది. ఇది అంత కష్టం కాదని ఆశ్చర్యకరంగా గొప్ప అనుభవంగా మారిందనీ నడిచిన వాళ్లమందరమూ చెప్తున్నాం.

✆ 98480 16442

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్ట దైవాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు యాత్రాజనులు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. యాదాద్రీశుడికి ఆదివారం నిత్య పూజలు ఆగమశాస్త్రరీతిలో వైభవంగా జరిగాయి. సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొల్పిన అర్చకులు బాలాలయ కవచమూర్తులను ఆరాధించారు. ఉత్సవమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో సహస్రనామార్చనలు జరిపారు. అనంతరం సుదర్శన హోమం నిత్యకల్యాణ వేడుకలను చేపట్టారు. - యాదాద్రి టౌన్



జనసంద్రమైన కొమురవెల్లి

కొమురవెల్లి భక్తజన సంద్రమైంది. శివసత్తుల శివాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లతో హోరెత్తింది. కొండసారికెల్లో వెలిసిన మల్లన్నతో పాటు ఎల్లమ్మతల్లికి కొమురవెల్లి బోనమెత్తింది. కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన పట్నంవారాన్ని ఆదివారం అత్యంత భక్తిప్రపత్తులతో ఘనంగా జరుపుకున్నారు. భక్తులు కోనేరులో పుణ్య స్నానమాచరించారు. తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తిప్రపత్తులతో బోనాలు తయారు చేసి నైవేద్యాన్ని నివేదించారు. బస చేసిన ప్రాంతంలో, ఆలయ గంగరేగు చెట్టు వద్ద, ముఖమండపంలో మల్లన్నకు చిలుక పట్నం, నజరు, ముఖమండప పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని చీర, సారెలతో ఒడిబియ్యాలు పోశారు. మల్లన్న సహోదరి ఎల్లమ్మ తల్లికి బోనం నివేదించారు. కాగా, సోమవారం పెద్దపట్నం అగ్నిగుండాలు నిర్వహించనున్నారు. - చేర్యాల



ఓటు కోసం కాదు..



భోజనం కోసం బారులుదీరిన సిబ్బంది

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో సోమవారం గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. రెండు మండలాలకు చెందిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కమాన్‌పూర్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ సిబ్బంది భోజన కూపన్‌లతో క్యూలైనులో బారులుదీరారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులుదీరినట్లుగా భోజనం స్లిప్‌లతో క్యూకట్టారు.



ప్రచారం నిర్వహిస్తున్న చిన్నారులు

రోజుకు రూ.20.. ఓ కూల్‌డ్రింక్!

చిన్నారులతో ఎన్నికల ప్రచారం

కారేపల్లి, జనవరి 20: పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం అభ్యర్థులు ప్రచారంలో సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గుంపెళ్లగూడెంలో ఓ అభ్యర్థి తన ఎన్నికల ప్రచారానికి పాఠశాల విద్యార్థులను వినియోగించుకున్నాడు. ఆదివారం చిన్నారులు ఇంటివద్దే ఉండడంతో వారిని పిలిపించి అందరికీ కూల్‌డ్రింక్ తాగించాడు. ఆ తర్వాత తన గుర్తు ఉన్న నమూనా బ్యాలెట్ పత్రాలను ఇచ్చి గ్రామంలో ప్రచారం నిర్వహించాలని సూచించాడు. సాయంత్రం వరకు ఈ పని చేసిన తర్వాత అందరికీ తలా రూ.20 చొప్పున అందచేశాడు.

పంచాయతీ ప్రచారంలో అజహరుద్దీన్

పెద్దేముల్: పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న తన బంధువు కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్ ఆదివారం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రేగొండికి వచ్చారు. సర్పంచ్ అభ్యర్థి హైదర్‌కు మద్దతు తెలుపుతూ కుటుంబీకులతో కలిసి ఇక్కడికి వచ్చిన అజహరుద్దీన్ బంధువులతో ముచ్చటించారు. అజహరుద్దీన్ తాతగారి ఊరు కూడా ఇదే. ఆయనకు ఇక్కడ పొలాలు, ఇల్లు కూడా ఉన్నాయి.



సర్పంచ్ అభ్యర్థితో అజహరుద్దీన్

'రామలింగేశ్వర' అభివృద్ధికి సీఎం హామీ: చిరుమర్తి



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. ఫిబ్రవరి 12న జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు సీఎం కేసీఆర్ హాజరవుతున్నారన్నారు. ఆలయం వద్ద సత్రాల నిర్మాణం, గుట్టపైన పార్కింగ్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేయగా.. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా రోడ్లు వెడల్పు చేయాలని వివరించామన్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టుతో రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సోమశిల ప్రాజెక్టు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీఎం కేసీఆర్‌ను కోరామని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంతో రాయలసీమకు లింకు ఏర్పడుతుందని అన్నారు.

100 పంచాయతీలను ఏకగ్రీవం చేయిస్తా

కోనేరు కోనప్ప

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల సందర్భంగా సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 50 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయని, ఆ సంఖ్యను మరింత పెంచుతానని స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చెప్పారు. రెండు, మూడు రోజుల్లోనే ఏకగ్రీవ పంచాయతీల సంఖ్యను 100కు చేర్చి సెంచరీ కొడతామని ఆయన తెలిపారు.

గ్రామానికి ఏమేం చేస్తారు ?

సర్పంచ్ అభ్యర్థులను ప్రశ్నించిన గ్రామస్థులు

సుల్తానాబాద్, జనవరి 20: 'గెలిస్తే గ్రామానికి మీరేం చేస్తారు? అభివృద్ధి కోసం ఏమేం పనులు చేస్తారో చెప్పండి. మీ ఐదుగురూ మాట్లాడుకుని ఒకరే బరిలో ఉండేట్టుగా నిర్ణయం తీసుకుని మాకు చెప్పండి' అని సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థులను ప్రజలంతా ప్రశ్నించారు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రాముని పల్లి గ్రామపంచాయతీలో ఆదివారం జరిగింది. గ్రామంలో ప్రజావేదికను ఏర్పాటు చేశారు. సర్పంచ్‌గా పోటీచేస్తున్న ఐదుగురు అభ్యర్థులను ఇక్కడికి పిలిపించారు. గెలిస్తే గ్రామాభివృద్ధికి ఏమేం పనులు చేస్తారో ప్రజలందరి ముందు స్పష్టం చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. అభ్యర్థులైన రాయమల్లు, శ్రీనివాస్, కనుకయ్య, లక్ష్మణ్, వెంకటాచారిలు తమ హామీలను అందరికీ వివరించారు. అభ్యర్థులు చెప్పిందంతా విన్న గ్రామస్థులు సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని నిర్ణయించి, ఎవరో ఒక్కరే రంగంలో ఉండేలా చూసుకోవాలని వారికి సూచించారు.



మాట్లాడుతున్న సర్పంచ్ అభ్యర్థులు

పల్లీ, మిర్చి రైతుకు ధరాఘాతం..!

మద్దతు ధర రాక దిక్కుతోచని స్థితిలో రైతులు.. తిత్లి తుఫాన్‌తో తీవ్రంగా దెబ్బతిన్న వేరుశనగ.. తెగుళ్లతో, సాగునీరు లేక ఎండిన మిర్చి

ఆంధ్రజ్యోతి, వనపర్తి: పంటలకు గిట్టుబాటు ధర లేక వేరుశనగ, మిర్చి రైతులు కుదేలవుతున్నారు. దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వనపర్తి జిల్లాలో రబీ సీజన్‌కు వేరుశనగ ప్రధాన పంట. అయితే, ఇక్కడి వేరుశనగ అఫ్లోటాక్సిన్ శిలీంధ్రం లేకుండా మంచి దిగుబడి వస్తుంటుంది. దీంతో ఇక్కడి పంటకు మార్కెట్ లో డిమాండ్ ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. నీరు లేక గతంలో సాగు తక్కువగా జరిగేది. అయితే కల్వకుర్తి, భీమా ఫేజ్-2 ఎత్తిపోతల పథకాలు పూర్తి కావడం ద్వారా ఏటికేడు సాగు రెట్టింపవుతోంది. గతేడాది వేరుశనగ ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో వనపర్తి జిల్లా నిలిచింది. నాణ్యమైన వేరుశనగ ఉత్పత్తి కావడంతో మద్దతు ధర కూడా అధికంగా లభించేది. ఈ ఏడాది రబీ సీజన్ లో లక్ష ఎకరాలు వేరుశనగ పంట సాగయ్యింది. నెల రోజుల నుంచి మార్కెట్‌కు వేరుశనగ వస్తోంది. మొదట్లో రూ. 6 వేలకు పైనే పలికిన ధర ఇప్పుడు సగటు ధర రూ.4,459 మాత్రమే పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ మద్దతు రూ.4,890 కంటే తక్కువగా లభిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 1,600 ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. జూరాల ఎడమ ప్రధాన కాలువ కింద పెబ్బేరు, శ్రీరంగాపూర్, చిన్నంబావి మండలాలో మిర్చిని సాగుచేస్తారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఎడమ ప్రధాన కాలువకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. గత రబీ సీజన్లలో వారాబందీ ప్రకారం నీటిని విడుదల చేసినా పంటలు పండించుకునే వెసులుబాటు ఉండేది. కాని, ఈసారి పూర్తిగా నిలిపివేయడంతో పంటలు దెబ్బతిన్నాయి. వచ్చిన పంటకు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వేరుశనగ గింజలు తయారయ్యే దశలో తిత్లి తుఫాన్ రావడంతో ఆ ప్రభావం గింజ నాణ్యతపై పడింది. ఫలితంగా పంట దిగుబడులు సరిగా రాలేదు. సీజన్ ఆరంభమై నెల రోజులవుతోంది. ఇప్పటి వరకు లక్ష బస్తాలకు పైగానే కొనుగోళ్లు జరిగాయి. సీజన్ ఆరంభంలో రూ.6 వేలకు పైగానే ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే గింజలు గట్టిగా లేవని, వ్యాపారులు పెదవి విరుస్తుండటంతో ధర తగ్గుతూ వస్తోంది. నాణ్యతగా లేని వేరుశనగను కొనుగోలు చేయడానికి వ్యాపారులు టెండర్లు వేయడం లేదు. కొనుగోళ్లకు వ్యాపారుల మధ్య పోటీ ఉంటేనే ధర ఎక్కువగా పలుకుతుంది. కానీ గడిచిన 15 రోజుల నుంచి వ్యాపారులు విముఖత ప్రదర్శిస్తున్నారు. దీంతో అతితక్కువ ధరకే రైతులు పంట విక్రయించాల్సి వస్తోంది. వనపర్తి మార్కెట్‌లో శనివారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 5082 రాగా.. అతి తక్కువగా రూ. 3,700 వచ్చింది. ప్రభుత్వ ఎంఎస్‌పీ కంటే దాదాపు రూ. 431 ధర తక్కువగా వస్తోంది. ఈ ఏడాది జూరాల ప్రాజెక్టులో ఉన్న నీటిని మిషన్ భగీరథ కింద తాగునీటి అవసరాల కోసం నిల్వ ఉంచడంతో.. రైతాంగానికి క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో ఆ నీరు ఆధారంగా సాగయ్యే మిర్చి పంట ఎండిపోయింది. దీనికితోడు ఈ ఏడు తెగుళ్ల సోకడంతో పంట దిగుబడులు సరిగా రాలేదు. ఐదేళ్ల క్రితం మిర్చి పంటకు అత్యధికంగా ధర రావడంతో రైతులు ఎకరాకు రూ. 20నుంచి రూ. 30వేల వరకు భూములను కౌలుకు తీసుకుని పంట సాగుచేస్తున్నారు. సాగునీరు లేక, తెగుళ్ల బారిన పంటలు పడుతుండటంతో మిర్చి రైతులకు కష్టాలే మిగులుతున్నాయి. మిర్చి ధర గతంలో క్వింటాల్‌కు రూ. 12 వేలు ఉండగా ప్రస్తుతం రూ.7 వేలకు మించి పలకడం లేదు.



వనపర్తి మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ

గింజలు గట్టిపడలేదు..



వనపర్తి జిల్లాలో వేరుశనగ పంట బాగుంటుందని ప్రతీ ఏటా ఇక్కడి వచ్చి కొనుగోలు చేస్తుంటాం. అయితే ఈ ఏడాది తిత్లి తుఫాన్ కారణంగా పల్లీ గట్టిపడలేదు. మార్కెట్ వచ్చిన పంటలో నాణ్యంగా ఉన్న కుప్పలకే టెండర్లు వేస్తున్నాం. - శివయ్య, వ్యాపారి, చీరాల, ఏపీ

తుఫాన్ ప్రభావం వల్లే...



మాది పాన్‌గల్ మండలం చింతకుంట. రెండున్నర ఎకరాల్లో వేరుశనగ సాగుచేస్తే 70 బస్తాలే దిగుబడి వచ్చింది. తుఫాన్ కారణంగా గింజలు గట్టిపడక దిగుబడి రాలేదు. మద్దతు ధర రూ. 4890 ఉండగా నా పంటకు రూ. 4250 ధర మాత్రమే దక్కింది. - కురుమూర్తి, రైతు, చింతకుంట

ఏటికేడు ధర పడిపోతోంది..



ఐదేళ్ల క్రితం 20 ఎకరాల్లో మిర్చి పంట సాగుచేశాను. మంచి ధర రావడంతో లాభాలు వచ్చాయి. తర్వాత ఏటికేడు నష్టపాలవుతున్న మిర్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. -ఈశ్వరయ్య, రైతు, సూగురు

కుప్టి ప్రాజెక్టు చేపట్టండి

ప్రాణహిత డ్యాం నిర్మాణానికి సర్వే.. సీఎం కేసీఆర్ ఆదేశం

హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటిని అందించేందుకు కుప్టి ప్రాజెక్టును వెంటనే చేపట్టాల్సిందిగా సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీనికి టెండర్లను ఆహ్వానించాలని సూచించినట్లు సమాచారం. దీంతో ప్రాజెక్టు నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవడానికి ఇంజనీర్లు సిద్ధమవుతున్నారు. సుమారు 5.32 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు రూ.744కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని కడెం నది నీటిని ఉపయోగించుకునేందుకు వీలుగా గతంలో కడెం ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు కోసం 13.42 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయి. అయితే, సుమారు 7.2 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఏడాది 4 టీఎంసీల కంటే ఎక్కువ నీటిని వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. దీంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీటిని అందివ్వలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని 40వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఇదే నదిపై కుప్టి ప్రాజెక్టును నిర్మించాలని గతంలో నిర్ణయించారు. కానీ పలు కారణాలతో నిర్మాణ ప్రక్రియ నిలిపివేశారు. మరోవైపు, ప్రాణహిత డ్యాం రీడిజైన్‌కు సంబంధించి సమగ్ర సర్వేను నిర్వహించాలని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించినట్లు సమాచారం. మొదట నిర్ణయించిన డ్యాం డిజైన్‌లో మార్పు చేయాలా? వార్ధా నదిపై కూడా డ్యాం ను నిర్మించడం ద్వారా సాగునీటిని అందించే అవకాశం ఉందా? అనే విషయంపై కూడా జర్వే జరపాలని సూచించినట్లు తెలిసింది.

రేంజర్‌పై సస్పెన్షన్ వేటు

ఎల్లారెడ్డి టౌన్, జనవరి 20 : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో శనివారం రాత్రి మద్యం తాగుతూ మీడియా అడ్డంగా దొరికిన డిప్యూటీ రేంజ్ అధికారి బాల కృష్ణంరాజును సస్పెండ్ చేస్తూ జిల్లా అటవీశాఖ అధికారిణి వసంత ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, శనివారం రాత్రి కార్యాలయంలో సిబ్బందితో కలిసి బాలకృష్ణం రాజు దర్జాగా మద్యం తాగుతూ ఉండగా, ఈ వ్యవహారాన్ని స్థానిక విలేకరులు వీడియోలు, ఫొటోల్లో చిత్రీకరించారు. ప్రభుత్వ కార్యాలయంలో మద్యం తాగడం ఎంతవరకు సబబని కోరగా తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన బాలకృష్ణం రాజు ఓ దశలో విలేకరులపై దురుసుగా ప్రవర్తించారు. ప్రభుత్వ అధికారిగా ఉండి తన కింది స్థాయి సిబ్బందితో దర్జాగా కార్యాలయంలో మద్యం తాగడంతో విచారణను చేపట్టి అతనిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారిణి వసంత తెలిపారు. అటవీశాఖలో పనిచేస్తున్న వారు తమ విధుల్లో క్రమశిక్షణను ఉల్లంఘిస్తే క్షమించేది లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం చేస్తే ఎంతటి వానినైనా సరే ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు.

గాఢమైన కవిత్వం పరిణతితోనే సాధ్యం: నందిని

కరీంనగర్ కల్చరల్, జనవరి 20: కవులు తమ కవిత్వంలోకి తమను తాము చూసుకుంటూ రాస్తే మెళకువలు తెలుస్తాయని, గాఢమైన కవిత్వం పరిణతితోనే సాధ్యమని రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ కళావేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో ఆదివారం సిరిపురం వాణిశ్రీ రచించిన 'పడిలేచిన కెరటం', సంగీతం శ్రీలేఖ రచించిన 'అంకురం' పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం సిధారెడ్డి మాట్లాడుతూ కవులకు ప్రతిభ, అభ్యాసం, కొత్త ఊపిరినిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకతను చాటుకోవడానికి కవులు పదునుగా, బలంగా రాయాల్సిన అవసరం ఉందన్నారు. పడిలేచిన కెరటం పుస్తకాన్ని డాక్టర్ అడువాల సుజాత, అంకురం పుస్తకాన్ని చిందం సునీత సమీక్షించారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏం ప్రయోజనం?

ఎంపీ సీతారాంనాయక్



దుమ్ముగూడెం జనవరి 20 : 'రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి ఎలా జరుగుతుంది. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే గెలిచినా ఏం ప్రయోజనం ఉంటుంది. వారిది అవినీతి చరిత్ర. ఇప్పుడు అభివృద్ధి చేస్తామంటున్నారు.. నిధులు ఎక్కడ నుంచి వస్తాయి.. రాష్ట్ర ప్రభుత్వం నుంచే రావాలి' అని మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్ణశాలలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పనులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'అభివృద్ధి చేద్దామంటే ఇక్కడ వేరే పార్టీ వాళ్లను గెలిపిస్తున్నారు. ఖమ్మం జిల్లా ప్రజలతో చాలా జాగ్రత్తగా ఉండాలి.. పనులు మేం చేయిస్తాం...ఓట్లు మాత్రం వేరే వాళ్లకు వేయండి' అని వ్యంగ్యంగా అన్నారు. పోడు భూములకు త్వరలోనే పట్టాలను అందజేస్తామని, ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు జూన్ నెల వరకు పోడుభూముల్లోకి వెళ్లొద్దని అటవీశాఖ అధికారులను కోరారు.

ఉద్యోగ విరమణ వయస్సు 65కు పెంచాలి

టీజీసీటీఏ రాష్ట్ర నేత డాక్టర్ విజయపాల్‌రెడ్డి

కేయూ క్యాంపస్, జనవరి 20 : ఏడవ వేతన సవరణ కమిషన్ చేసిన సిఫార్సులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం యూజీసీ అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 65ఏళ్ళకు పెంచాలని టీజీసీటీఏ రాష్ట్ర నేత డాక్టర్ బి.విజయపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హన్మకొండలో జరిగిన తెలంగాణ ప్రభుత్వ కళాశాల టీచర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐ పిక్సేషన్ 2.57 కాకుండా 3.6కు పెంచాలన్నారు. కేంద్రం పీఆర్‌సీ 10 ఏళ్ళకు ఒక్కసారి ఉంటుందని, దీంతో ఐ పిక్సేషన్‌తో ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని అన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, జోనల్ సెక్రెటరీ డాక్టర్ మార్త రాంబాబు, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సన్నీశరాన్‌లు హాజరయ్యారు.

నత్తనడకన మూలవాగు బ్రిడ్జిల పనులు

మహా శివరాత్రి జాతరకు అందివచ్చేనా?

వేములవాడ, జనవరి 20: రాజన్న దర్శనం కోసం వస్తున్న యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వేములవాడ మూలవాగుపై చేపట్టిన వంతెనల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో అత్యంత ప్రధానమైన మహాశివరాత్రి జాతర నాటికైనా వంతెనల నిర్మాణం పూర్తవుతుందా? లేదా? అన్నది అనుమానాస్పదంగా మారింది. తెలంగాణలోనే అతిపెద్దదైన వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి భవిష్యత్తులో భక్తుల రద్దీ మరింతగా పెరిగే అవకాశం ఉందన్న అంచనాతో ప్రస్తుతం ఉన్న వంతెనకు ఇరువైపులా ఒక్కొక్కటి 12 మీటర్ల వెడల్పుతో 190 మీటర్ల పొడవుతో రెండు బ్రిడ్జిల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.28 కోట్లు కేటాయించింది. ఇందులో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి రూ.12కోట్లు కేటాయించగా, మిగతా మొత్తాన్ని సుందరీకరణ కోసం ఉపయోగించనున్నారు. ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ల బృందం ఖరారు చేసిన బోస్టన్ టైప్ ఆర్చిలతో కూడిన డిజైన్‌తో బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి లభించగా, 2016 డిసెంబర్‌లో పనులు ప్రారంభించారు.

రెండేళ్లుగా అదే తీరు..

రూ.12 కోట్ల వ్యయంతో చేపట్టిన రెండు బ్రిడ్జిల పనులు చాలా ఆలస్యంగా సాగుతున్నాయి. సాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ సంస్థ పనులు దక్కించుకోగా, కాంట్రాక్టరు పట్టించుకోకపోవడంతో పనుల్లో వేగం మందగించింది. 2017 జూన్-జూలై నాటికి రెండు బ్రిడ్జిలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ఇంకా ఒకవైపు బ్రిడ్జి పనులు కూడా పూర్తికాలేదు. మార్చి 3, 4, 5వ తేదీల్లో వేములవాడలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు లక్షలాది మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జాతర నాటికైనా మొదటి బ్రిడ్జి అందుబాటులోకి వచ్చేనా? అన్నది అనుమానాస్పదంగా ఉంది. రెండు బ్రిడ్జిల నిర్మాణం పనులు జాతర నాటికి పూర్తి కావాలని ఇటీవల కలెక్టర్ వెంకట్రామిరెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ పూర్తి కాగానే రెండో బ్రిడ్జి పనులు కూడా పూర్తి స్థాయిలో ప్రారంభించి, సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.



కొనసాగుతున్న పనులు

శివరాత్రికి అందుబాటులోకి తెస్తాం..

బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగవంతం చేశాం. మొదటి బ్రిడ్జి పనులు దాదాపు పూర్తయ్యాయి. నెల రోజులలో బ్రిడ్జి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాం. ఎట్టి పరిస్థితులలోనూ మహాశివరాత్రి జాతరకు ముందే బ్రిడ్జి పనులు పూర్తవుతాయి. భూసేకరణ పూర్తి కాగానే రెండో బ్రిడ్జి పనులు కూడా ప్రారంభిస్తాం. - సురేశ్‌బాబు, డీఈ, ఆర్‌అండ్‌బీ

యాదాద్రి ఆలయానికి మరో పది పోస్టులు

యాదాద్రి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలన వ్యవహారాల నిర్వహణకు అవసరమైన పోస్టుల సంఖ్య (క్యాడర్ స్ట్రెంత్)ను పెంచుతూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదనంగా 10 పోస్టులను మంజూరు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ హోదా గల సహాయ కార్యనిర్వహణాధికారి పోస్టుల సంఖ్యను మూడు నుంచి ఐదుకు పెంచారు. కొత్తగా మంజూరైన ఈ పోస్టుల్లో సూపరింటెండెంట్లు జూశెట్టి కృష్ణ, మేడి శివకుమార్‌కు పదోన్నతి కల్పించారు. డిప్యూటీ ఇంజనీరింగ్ పోస్టులు ప్రస్తుతం ఒకటి ఉండగా.. మరో పోస్టును మంజూరు చేశారు. సహాయ స్తపతి పోస్టును డిప్యూటీ స్తపతిగా అప్‌గ్రేడ్ చేశారు. కొత్తగా కొండపై గల పర్వత వర్ధనీ రామలింగేశ్వర ఆలయంలో ముఖ్య అర్చకులు, ఆలయ వైద్యశాలలో మేల్ నర్సింగ్ అధికారి, ఆపరేటర్ పోస్టులను మంజూరు చేశారు.

27, 28 తేదీల్లో హిస్టరీ కాంగ్రెస్ సదస్సు

కేయూ క్యాంపస్, జనవరి 20: ఈనెల 27, 28 తేదీల్లో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 4వ వార్షిక సదస్సులు కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్నారు. ఔత్సాహిక చరిత్ర, సాంస్కృతిక అంశాలపై ఆసక్తి కలిగిన పరిశోధకులు, ప్రొఫెసర్లు సదస్సుకు హాజరు కానున్నట్లు తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొ.వెంకట్రాజం, వీరేందర్, లోకల్ ఏరియా కార్యదర్శి ప్రొ. కె. విజయబాబు తెలిపారు.

రోడ్డుపై చెత్త వేస్తే 500 ఫైన్!

ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే 1000.. గ్రామపంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే 2000: సీఎం

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చెత్త, వ్యర్థ పదార్థాలను నిర్దేశిత ప్రదేశంలో కాకుండా.. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పడవేస్తే ఇకపై జరిమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. చెత్తను ఇలా పడవేసిన వారికి రూ.500 జరిమానా విధించనున్నారు. సింక్ నుంచి, మురుగు నీటిని రోడ్డుపైకి వదిలినా, మంచినీటిని కలుషితం చేసినా రూ.500 జరిమానా పడుతుంది. బహిరంగ ప్రదేశాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే రూ.1000, గ్రామ పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే రూ.2000 జరిమానాకు గురవుతారు. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం-2018లో కఠిన నిబంధనలు విధించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు ముగిశాక కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని పక్కాగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం అసెంబ్లీలో ప్రకటించారు. ప్రస్తుతం పంచాయతీలన్నీ మురికి కూపాల్లా ఉన్నాయని, వీటిని మార్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నియమితులైన 9500 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిబంధనల్ని పక్కాగా అమలు చేయాలని అన్నారు. లేదంటే మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను రెన్యువల్ చేయబోమన్నారు. అవసరమైతే పంచాయత్‌రాజ్ శాఖను తన వద్దే పెట్టుకుంటానని సీఎం చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేలు కూడా చట్టం అమలుపై దృష్టి సారించాలన్నారు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారెవరిపైనైనా చర్యలు తీసుకునేందుకు పంచాయతీరాజ్ చట్టంలో వెసులుబాటు ఉందని, పంచాయతీ సర్పంచ్, కార్యదర్శితోపాటు ప్రజలు కూడా చట్టానికి అనుగుణంగానే నడుచుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. లేదంటే సర్పంచ్ పదవికే ఎసరు వస్తుందని హెచ్చరించారు. చట్టంలో నిర్దేశిత లక్ష్యాల గురించి కూడా ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా హరితహారంలో మొక్కల పెంపకం, వాటిని కాపాడటం, పన్నుల వసూళ్ల వంటి లక్ష్యాలు ఇందులో ఉన్నాయి. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనల్ని విస్మరిస్తే విధించే జరిమానాల్లో కొన్ని..



అంశం	జరిమానా(రూ.లలో)
ఇంట్లోని సింక్, మురుగు నీటిని బయటకు వదలడం, మంచినీటిని కలుషితం చేయడం	500
మంచినీటికి కేటాయించిన ప్రదేశాల్లో స్నానాలు చేయడం, దుస్తులు ఉతకడం	500
రహదారులపై గుంతలు చేయడం లేదా అస్తవ్యస్తం చేయడం	500
గ్రామ పంచాయతీ ఆస్తుల (స్థలాలు)ను ఆక్రమించడం	2000
అనుమతి లేకుండా పార్కింగ్‌ల నిర్వహణ	2000
రోడ్లు, మార్కెట్‌లు తదితర ప్రదేశాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడం	1000
స్లాటర్‌హౌజ్‌ల బయట జంతువులను వధించడం	2000
పలు అంశాలకు సంబంధించి లైసెన్సు ఉండి... అధికారి అడిగినప్పుడు చూపకపోవడం	50
లైసెన్సు లేకుండా మార్కెట్‌ల వంటివి ప్రారంభించడం	1000
నోటీసు ఇచ్చాక కూడా పనులు పూర్తి చేయకపోతే...	500
రహదారికి సమీపంలో లైసెన్సు లేకుండా క్వారీ పనులు చేపట్టడం	500
రహదారిని అక్రమించి గోడ, కంచె నిర్మించడం	1000
మురికి నీటి ప్రవాహానికి అడ్డు తగిలేలా నిర్మాణాలు చేపట్టడం	2000
ప్రభుత్వ, పంచాయతీ స్థలాల్లో అనుమతి లేకుండా మొక్కలు నాటడం	2000



విపక్షాలది ధనశక్తి.. మనది జన శక్తి!

- మహాకూటమి కాదు.. అవినీతి కూటమి
- బీజేపీ కార్యకర్తలతో భేటీలో మోదీ

పనాజి, జనవరి 20: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటమికి మహాకూటమి ఇప్పట్నుంచే సాకులు వెతుక్కోవడం ప్రారంభించిందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. అందుకే విపక్ష నేతలు ఈవీఎంలపై నెపం మోపుతున్నారని ఆరోపించారు. శనివారం కోల్‌కతాలో 23 పార్టీల నేతలు కలిసి ఏర్పాటు చేసిన విపక్షాల ఐక్యతా ర్యాలీలో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సహా పలువురు నేతలు ఈవీఎంలను 'చోర్ మిషన్లు'గా ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మోదీ స్పందించారు. ప్రతిపక్షాలు తమ ఓటమిని ముందే ఊహించాయని, అందుకే కారణాలు వెతుక్కోవడం ప్రారంభించి.. ఈవీఎంలను విలన్లుగా చూపుతున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలది ధన శక్తి అయితే తమది జన శక్తి అని చెప్పారు. విపక్ష పార్టీలు ఒకరితో మరొకరు పొత్తు పెట్టుకుంటే.. బీజేపీ మాత్రం 125 కోట్ల మంది ప్రజలతో జత కడుతోందని తెలిపారు. ఆదివారం ఆయన గోవా, మహారాష్ట్ర బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. వంశపారంపర్యం, అవినీతి, ప్రతికూల, అస్థిరమైన భావాలున్న నేతలంతా కలిసి కూటమి కట్టారని.. అది అవినీతి కూటమి అని ధ్వజమెత్తారు. కోల్‌కతాలో టీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీపై స్పందిస్తూ.. "కోల్‌కతాలో వేదికను పంచుకున్న విపక్ష నేతల్లో చాలా మంది ప్రముఖులు తమ వారసులు, పిల్లలను పైకి తీసుకురావాలని పరితపిస్తున్నవారే" అని మోదీ విమర్శించారు.

ఐదేళ్లలో 835 ప్రైవేటు కాలేజీల మూత

- ఈ జాబితాలో అన్ని రకాల కళాశాలలు
- మరోవైపు 1.28 లక్షల సీట్లు పెరుగుదల
- నాణ్యతా ప్రమాణాలపై ప్రభుత్వం దృష్టి



హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి 2018 వరకు రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ నుంచి పీజీ వరకు 835 ప్రైవేటు కాలేజీలు మూతపడ్డాయి. వీటిలో 228 డిగ్రీ, 149 ఇంజనీరింగ్, 176 ఎంటెక్ కాలేజీలు ఉన్నాయి. 117 ఎంబీఏ, 60 బీఈడీ కాలేజీలు ఉన్నాయి. 2014-15 విద్యా సంవత్సరంలో తెలంగాణలో 3,351 ప్రైవేటు కాలేజీలు ఉండగా 2018-19లో వాటి సంఖ్య 2,516కు తగ్గడం గమనార్హం. అయితే ఒకవైపు భారీ సంఖ్యలో కాలేజీలు మూతపడినా మరోవైపు సీట్ల సంఖ్య పెరిగింది. 2014-15లో 5,23,291 సీట్లు ఉండగా 2018-19లో 6,52,178 సీట్లకు పెరగడం గమనార్హం. అంటే 1,28,887 సీట్లు పెరిగాయి. అడ్మిషన్ల సంఖ్య కూడా పెరిగింది. 2104-15లో 3,77,344 సీట్లు భర్తీ కాగా 2018-19లో 397225 సీట్లు భర్తీ అయ్యాయి. అదనంగా 19,881 సీట్లు భర్తీ అయినట్టు! తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాటి నుంచి ప్రభుత్వం ప్రైవేటు కాలేజీలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉన్నత విద్యలో ప్రమాణాలు పెంచేందుకు విస్తృత తనిఖీలు నిర్వహించింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కాలేజీలకు అనుమతి నిరాకరించింది. సీట్లు భర్తీ కాకపోవడంతో పలు యాజమాన్యాలు స్వచ్ఛందంగానే కాలేజీలు మూసివేశాయి.

	2014-15		2017-18		2018-19	
	కాలేజీలు	సీట్లు	కాలేజీలు	సీట్లు	కాలేజీలు	సీట్లు
డిగ్రీ	1151	246176	916	421947	923	443269
పీజీ	444	25285	444	25285	446	25415
ఇంజనీరింగ్	337	96228	198	97961	188	96518
బీ-ఫార్మసీ	164	16320	128	10283	124	9792
ఫార్మా-డీ	51	1410	56	1645	55	1600
ఎంసీఏ	73	5846	29	2736	29	2786
ఎంబీఏ	410	55034	283	32710	293	34650
బీఎడ్	268	29044	209	18930	208	19050
లా	14	2670	18	4710	18	5466
ఎంటెక్	262	31250	74	5996	86	7743
ఎంఫార్మసీ	147	12568	91	2790	108	3889
ఫార్మా-డీ(పీబీ)	20	200	24	240	24	240
బీపీఎడ్	10	1260	14	1760	14	1760
మొత్తం	3,351	5,23,291	2,484	6,26,993	2,516	6,52,178



తొలి విడత 'పంచాయతీ' నేడే

*ఉదయం ఉత్సాహం... మధ్యాహ్నం ఉత్కంఠ.. సాయంత్రానికి విజయోత్సాహమో? విచార వదనమో?.. ఇదీ సోమవారంనాడు రాష్ట్రంలోని కొన్ని గ్రామాల్లో కనిపించనున్న సన్నివేశం. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. దాదాపు **45** లక్షల మంది ఓటర్లు తీర్పునివ్వనున్న ఈ ఎన్నికల్లో గెలిచేదెవరో? ఓడేదెవరో అన్నది సోమవారం సాయంత్రానికి తేలిపోనుంది. తొలి విడత ఎన్నికలు జరగబోయే **3,701** గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకుగాను **12,202** మంది పోటీలో ఉండగా.. **28,976** వార్డు సభ్యుల పదవులకుగాను **70,097** మంది బరిలో నిలిచారు. ఉదయం **7** గంటల నుంచి మధ్యాహ్నం **1** గంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం **2** గంటలకు లెక్కింపు ప్రారంభిస్తారు. తొలుత వార్డులు సభ్యుల అభ్యర్థులకు, తర్వాత సర్పంచ్ అభ్యర్థులకు వచ్చిన ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.*

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్



ఏరులై పారుతున్న మద్యం

- పంచాయతీ పోరుతో ఊగుతున్న ఊర్లు
- చీప్ లిక్కర్, క్వార్టర్ బాటిళ్లకు తీవ్ర కొరత
- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పెరిగిన అమ్మకాలు
- జనవరిలో 25-30 శాతం అధికంగా విక్రయం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఆబ్కారీ, పోలీసులు

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని.. ఊర్లన్నీ మద్యం మత్తులో ఊగుతున్నాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రధానంగా మద్యాన్నే నమ్ముకుంటున్నారు. ఎన్నికలు హోరాహోరీగా జరుగుతుండటంతో కులాల వారీగా, సంఘాల వారీగా మద్యాన్ని పంపిణీ చేస్తున్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి.. ప్రతి రోజూ 'సీసా' చేతిలో పెడుతున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఫలితంగా రాష్ట్రంలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ సోమవారం జరగబోతోంది. ఈ నెల 25న రెండో విడత, 30న మూడో విడత జరగనున్నాయి. దీంతో సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నవారితోపాటు వార్డు సభ్యుల పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లకు ప్రధానంగా మద్యంతోనే ఎర వేస్తున్నారు. వార్డుల వారీగా, కులసంఘాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ.. చీకటి పడగానే తలో సీసా చేతిలో పెడుతున్నారు. ఓటర్లు చేజారకుండా ప్రతిరోజూ మద్యం పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడిగా దావత్‌లు చేసుకుంటే ఫుల్ బాటిళ్లు, హాఫ్ బాటిళ్లు, ఒక్కొక్కరికైతే క్వార్టర్లు, 90 ఎం.ఎల్. సీసాలు చేతికిస్తున్నారు. దీంతో 90 ఎం.ఎల్. బాటిళ్లు, క్వార్టర్ బాటిళ్ల (నిబ్‌ల) వినియోగం గణనీయంగా పెరిగింది. దీంతో క్షేత్ర స్థాయిలో 'నిబ్బుల' కొరత ఏర్పడింది. వాస్తవానికి మద్యం అమ్మకాలపై సాధారణ రోజుల్లో కంటే ఎన్నికల సమయంలో అధికారుల నిఘా మరింత ఎక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి క్షేత్రస్థాయిలో తనిఖీలు పెద్దగా జరిగినట్లు కనిపించడం లేదు. నామమాత్రంగా బెల్టుషాపుల నిర్వాహకులను పిలిపించి బైండోవర్ చేసి వదిలేశారు. వారు అంతకుముందే డంపులు చేసిన మద్యాన్ని బహిరంగంగా పంపిణీ చేస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి 20 రోజుల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం రూ.15 లక్షల విలువైన మద్యాన్ని మాత్రమే సీజ్ చేయడమే ఇందుకు నిదర్శనం. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. పంచాయతీ ఎన్నికల్లోనే మద్యం పంపిణీ ఎక్కువగా జరుగుతుంది. ఆబ్కారీ లెక్కల ప్రకారం... గత డిసెంబరు నెలాఖరు వరకు సాధారణ రోజులతో పోలిస్తే 10 నుంచి 15 శాతం మద్యం విక్రయాలు పెరిగాయి. జనవరిలో మాత్రం హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లో 25 నుంచి 30 శాతం వరకు లిక్కర్ విక్రయాలు పెరిగే అవకాశాలున్నట్లు ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. కానీ, సీజ్ చేస్తున్న మద్యం మాత్రం ఆ స్థాయిలో ఉండటంలేదు.

51 ఓట్లొస్తే సర్పంచే!

అతిచిన్న గ్రామపంచాయతీ చిన్నకొల్వాయి.. ఎన్నిక రసవత్తరం

జగిత్యాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వందల ఓట్లు కూడగట్టాల్సిన పని లేదు.. కేవలం 51 ఓట్లు వస్తే సర్పంచ్‌గిరి. 9 ఓట్లు వస్తే వార్డు సభ్యత్వం. వినడానికి విచిత్రంగా ఉన్నా ఇది అక్షరాలా నిజం! జగిత్యాల జిల్లాలో అతి చిన్న గ్రామ పంచాయతీ చిన్నకొల్వాయి. బీర్‌పూర్ మండలంలోని ఈ ఊరి జనాభా 162. మొత్తం ఓటర్ల సంఖ్య 106, వీరిలో మహిళలు 56 మంది, పురుషులు 50 మంది. ఇందులోనూ ఆరుగురు ఓటర్లు విదేశాల్లో ఉంటున్నారు. అంటే.. ఎవరికి 51 ఓట్లొచ్చినా సర్పంచ్‌గిరి వరిస్తుంది. ఈ సర్పంచ్ స్థానం ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ కాగా, చిత్రం బుచ్చి రాములు, చిత్రం రవీందర్ పోటీ పడుతున్నారు. నేడు ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వీరిద్దరు ఇప్పటికే ఐదారుమార్లు ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. గ్రామంలో నాలుగు వార్డు స్థానాలు ఉన్నాయి. నాలుగో వార్డులో కేవలం 16 ఓట్లు ఉన్నాయి. ఈ లెక్కన 9 ఓట్లు పొందినవారు వార్డు సభ్యుడు అవుతారు.

రక్తశుద్ధిపై కొరవడిన చిత్తశుద్ధి!

- సమస్యల నిలయంగా డయాలసిస్ కేంద్రాలు
- వైద్యులు, సిబ్బంది కొరత, సౌకర్యాల లేమి
- కేంద్రాల్లో తగినన్ని పడకలు లేక రోగుల ఇబ్బందులు



భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో రక్తశుద్ధి కేంద్రంలో సేవలు పొందుతున్న రోగులు

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రక్తశుద్ధి కేంద్రాలు సమస్యల నిలయాలుగా మారాయి. కొన్ని చోట్ల వైద్యుల కొరత, మరికొన్ని చోట్ల వైద్య సిబ్బంది కొరత, ఇంకొన్ని చోట్ల సౌకర్యాల కొరత వేధిస్తున్నాయి. వీటిని వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటం, ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకోవాలంటే పెద్దమొత్తంలో ఖర్చవుతుండడంతో.. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వమే డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నిమ్స్ పరిధిలో 16, గాంధీ పరిధిలో 13, ఉస్మానియా పరిధిలో 10 డయాలసిస్ కేంద్రాలను జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, అనుబంధ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేశారు. వీటికితోడు మరో మూడు చోట్ల కలిపి మొత్తం 42 కేంద్రాల్లో రక్తశుద్ధి సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటి ద్వారా 4800 మంది, ప్రైవేటు ఆస్పత్రుల్లోని డయాలసిస్ కేంద్రాల్లో మరో 3500 మంది రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని డయాలసిస్ కేంద్రాల్లో చాలా చోట్ల సరైన సౌకర్యాలు లేవు. అన్ని కేంద్రాలు 3-5 పడకలవే కావడం, రోగులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భద్రాచలం, కొత్తగూడెం, మంచిర్యాల వంటి చోట్ల డయాలసిస్ కేంద్రాల్లో పడకల సంఖ్య సరిపోవడంలేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒక్కసారి డయాలసిస్‌కే రూ.2500-3000 అవుతుండటంతో రోగులు ప్రభుత్వ కేంద్రాలకే వస్తున్నారు.

చాలా చోట్ల రక్తశుద్ధి కేంద్రాలకు జనరేటర్లు లేవు. సాంకేతిక సమస్యల వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగితే డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరంగల్ ఎంజీఎంలోని డయాలసిస్ కేంద్రంలో నెఫ్రాలజిస్టు లేరు. నల్లగొండలో వైద్యుల కొరత, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి కేంద్రాల్లో సాంకేతిక సిబ్బంది కొరత ఉంది. గోదావరిఖనిలో డయాలసిస్ కేంద్రం రెండో అంతస్తులో ఉంది. ఈ నెల 14న ఓ రోగి మరుగుదొడ్డికి వెళ్లేందుకు రెండో అంతస్తు నుంచి కిందకు దిగుతుండగా జారిపడి మరణించాడు.

గాంధీ ఆస్పత్రిలో 26 డయాలసిస్ యంత్రాలున్నాయి. నెలకు 3వేలకు పైగా డయాలసిస్ చేస్తున్నారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉండటంతో గంటల తరబడి ఎదురు చూడాల్సివస్తోంది. కొందరికి మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నారు. ఉస్మానియాలో మొత్తం 19 యంత్రాలు పనిచేస్తున్నాయి. ఇటీవలే 2 యంత్రాలు మరమ్మతుకు వచ్చాయి. కొంతమందికి వారానికి మూడుసార్లు డయాలసిస్ అవసరం ఉండటంతో వారు ధర్మసత్రంలో ఉంటూ రక్తశుద్ధి చేయించుకుంటున్నారు.

కిడ్నీ రోగులకు పింఛన్ ఇవ్వాలి

మూత్ర పిండాల ఫెయిల్యూర్ వల్ల ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నాం. గతంలో ఆర్టీసీ బస్సుల్లో సగం చార్జీయే తీసుకునేవారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతినెలా పింఛన్ ఇస్తే డయాలసిస్‌కు వచ్చి వెళ్లేందుకు పనికివస్తాయి.

- అస్గర్, ముథోల్, నిర్మల్ జిల్లా


10న బీజేపీ మహిళా మోర్చా జాతీయ సదస్సు



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు విజయ రహత్కర్

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల 10న హైదరాబాద్‌లో జాతీయ మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు విజయ రహత్కర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంద సంస్థల మహిళా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని చెప్పారు. పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆకుల విజయతో కలిసి ఆదివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. ఫిబ్రవరి 26 నుంచి 'కమల్ జ్యోతి సంకల్ప్' కార్యక్రమం చేపడతామని వెల్లడించారు.

● మోదీ ఇచ్చినన్ని నిధులు ఎవరూ ఇవ్వలేదు: లక్ష్మణ్



రాజకీయాల కోసం కేంద్రంపై నిందలు వేస్తారా? అంటూ సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. నరేంద్రమోదీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చినన్ని నిధులు, గతంలో ఏ ప్రభుత్వమైనా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. ఈ విషయమై తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. నీతి ఆయోగ్ సిఫారసు చేసిన విభాగాలకు కూడా కేంద్రం నిధులివ్వడం లేదని సీఎం కేసీఆర్ ఆదివారం శాసనసభలో చేసిన వ్యాఖ్యలకు లక్ష్మణ్ పైవిధంగా స్పందించారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదు? ఈబీసీలకు 10% రిజర్వేషన్ల అమలుకు ఎందుకు ఉత్తర్వులు జారీచేయలేదు? అంటూ కేసీఆర్‌పై లక్ష్మణ్ ప్రశ్నలు సంధించారు. లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడంలో భాగంగా వచ్చేనెల 1 నుంచి క్లస్టర్ వారీగా సమావేశాలు నిర్వహించనున్నట్లు లక్ష్మణ్ తెలిపారు.

ఆంధ్రా ఇంజనీర్లు వెళ్లిపోవాలి

- తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్

హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, విద్యుత్ సంస్థలు విడిపోయినా ఆంధ్రా ఇంజనీర్లు ఇక్కడే ఉంటున్నారని తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల విభజన జరగకుండా చూస్తోందని, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హైదరాబాద్ మింట్‌కాంపౌండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యోగులకు న్యాయం జరగాలంటే, ఇక్కడున్న 1,157 మంది ఆంధ్రా ఇంజనీర్లు వారి స్వరాష్ట్రానికి వెళ్లిపోవాలని విజ్ఞప్తిచేశారు. ఏపీకి వెళ్లేందుకు చాలా మంది అంగీకరించినా ఏపీ సీఎం స్పందించడంలేదని ఆరోపించారు.



అర్చక సమాఖ్య డైరీని ఆవిష్కరిస్తున్న ఉపేంద్రశర్మ

రిటైర్డ్ అర్చకులకు 20వేల పెన్షన్ ఇవ్వాలి

- తెలంగాణ అర్చక సమాఖ్య డిమాండ్

బర్కత్‌పుర/హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన అర్చక ఉద్యోగులకు రూ.10 లక్షల గ్రాట్యుటీ, ప్రతినెలా రూ.20 వేల పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బర్కత్‌పురలోని అర్చక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్చకులకు ప్రస్తుతం రూ.6 వేల వేతనం ఇస్తున్నారని, దానిని రూ.10వేలకు పెంచాలని కోరారు. అర్చకుల ఆధీనంలో ఉన్న భూములకు వారి పేరుతో పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. తమకు ఆరోగ్య బీమా కార్డులు అందించాలని కోరారు. త్వరలో హైదరాబాద్‌లో అర్చకులు, బ్రాహ్మణులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానిస్తామని చెప్పారు. ఈసందర్భంగా అర్చక సమాఖ్య 2019 డైరీని ఉపేంద్ర శర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిన్నమోహన నాయకులు, భాస్కరభట్ల రామశర్మ, నవీన్, ఎ.ఆంజనేయచారి, వేణుగోపాల్‌శర్మ, వీరభద్రశర్మ, రాజేశ్వర్‌శర్మ, శ్రీధరాచార్యులు, నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

● 23న గురుకుల టీచర్ల ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక మండలి (టీఆర్ఈఐఆర్‌బీ) ఆధ్వర్యంలో పీజీటీ సాంఘిక శాస్త్ర అభ్యర్థుల ఎంపిక వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ నెల 23 నుంచి ఎంపికైన వారి ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని టీఆర్ఈఐఆర్‌బీ చైర్మన్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

● జూనియర్ లెక్చరర్ల నేతకు ఓడీ రద్దు చేయండి

జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకుడిగా ఉన్న పి.మధుసూధన్ రెడ్డికి ఓడీ వసతి పునరుద్ధరించకూడదని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం కోరింది. ప్రభుత్వం ఇచ్చిన ఓడీ వసతిని ఆయన దుర్వినియోగం చేశారని ఇప్పటికే కమిషనర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని సంఘం అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి చిత్రం యాదగిరి ఆరోపించారు.

● ధాన్యానికి బోనస్ ప్రకటించాలి: పొన్నం

ధాన్యానికి కనీస మద్దతు ధర విషయంలో సీఎం కేసీఆర్ సభను తప్పుదోవ పట్టించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లో క్వింటాలు ధాన్యానికి రూ.300 బోనస్ ప్రకటించారని, అక్కడి రైతులకు క్వింటా ధాన్యానికి 2050 చేతికొస్తున్నాయని తెలిపారు.

ఈ-'నామ్'కే వాస్తే!

- ఖమ్మం మార్కెట్లో మాయ.. ఆన్‌లైన్ విధానానికి చెల్లుచీటీ
- వ్యాపారుల ఇష్టారాజ్యం బస్తాకు రూ.60 చొప్పున చేతివాటం

హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'ఊరందరిది ఓ దారైతే... ఉలిపికట్టెది మరో దారి!' అన్నట్లు తయారైంది ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారుల వైఖరి. దేశవ్యాప్తంగా 'ఈ- నామ్' ద్వారా కొనుగోళ్లు జరుగుతుంటే... ఖమ్మం మార్కెట్‌లో మాత్రం ఆన్‌లైన్ విధానాన్ని కాదని.. నేరుగా కొనుగోళ్లు జరుపుతున్నారు. బస్తాల తూకం, చిల్లర ఖర్చుల పేరుతో రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని(ఈ-నామ్) 2016 ఏప్రిల్ 14 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న విషయం విదితమే. ఇందులోభాగంగా మార్కెట్‌కు సరుకు వచ్చింది మొదలు.. ఎంట్రీ చేయటం, తూకం వేయటం, ధర నిర్ణయం, చెల్లింపుల వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరగాలి. రాష్ట్రవ్యాప్తంగా 44 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో 'ఈ-నామ్' అమలవుతుండగా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌లో 458 మంది కమీషన్ ఏజెంట్లు, 516 మంది ట్రేడర్లు ఉండగా, కొనుగోళ్లలో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

తూకంలో కోత.. ఆపై వసూళ్లు!

ఒక మిర్చి బస్తా 50 కిలోల 900 గ్రాములు ఉందనుకుంటే ఆన్‌లైన్ విధానంలో గ్రాములతో సహా పక్కా తూకం, రశీదు వస్తాయి. ప్రస్తుతంనేరుగా కొనుగోలు చేస్తుండడంతో ఆ 900 గ్రాములు తీసేసి.. 50 కిలోలు లెక్క రాసేస్తున్నారు. ఇలా 100 గ్రాములు, 200 గ్రాములు, 500 గ్రాముల బరువును పరిగణనలోకి తీసుకోవడం లేదు. వ్యాపారుల కనుసన్నల్లో దడువాయిలు, గుమాస్తాలు కాకి లెక్కలు చూపుతున్నారు. 20 బస్తాలు తూకానికి వస్తే.. 10 నుంచి 15 కిలోలు వ్యాపారులకు లాభం దక్కుతుండగా, రైతు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. అదే ఆన్‌లైన్ సిస్టమ్‌లో ఇలాంటి మోసాలకు అవకాశం ఉండదు. అసలు మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాంటాలు కనిపిస్తేనే వ్యాపారులు 'అగ్గిమీద గుగ్గిలం' అవుతున్నారు. మార్కెట్ ప్రాంగణంలో కాకుండా బయటే లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ.. ఆ భారాన్ని రైతులపై వేస్తున్నారు. ఇతర మార్కెట్లలో బస్తాకు సదరు భారం రూ.30 వరకు ఉండగా, ఖమ్మం మార్కెట్లో బస్తాకు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ పరిస్థితిని చూసి సీసీఐ, మార్క్‌ఫెడ్ లాంటి ప్రభుత్వరంగ సంస్థలు ఖమ్మం మార్కెట్‌లో కాంటా పెట్టే సాహసం చేయటం లేదు. ఇప్పటికైనా వ్యాపారుల దోపిడీ నుంచి రక్షించాలని, ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ జరపాలని రైతులు, రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

ఎగుమతిదారుల ఇబ్బందులు తీర్చండి..

కేంద్రం, ఆర్‌బీఐని కోరిన ఎఫ్ఐఈఓ



న్యూఢిల్లీ: ఎగుమతిదారుల సమస్యలను పరిష్కరించాలని కేంద్రం, ఆర్‌బీఐని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈఓ) కోరింది. ఇరాన్‌తో వాణిజ్యం, రుణ లభ్యత విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు తక్షణమే కలుగజేసుకోవాలని అభ్యర్థించింది. ఇరాన్‌కు ఎగుమతి చేసే ఉత్పత్తుల్లో రుపీ ట్రేడ్ మెకానిజం వేటికి వర్తిస్తుందనే విషయంపై స్పష్టత అవసరమని ఎఫ్ఐఈఓ ప్రెసిడెంట్ గణేష్ కుమార్ గుప్తా అన్నారు. అలాగే, బ్యాంకుల నుంచి రుణ లభ్యత తగ్గడంతో చిన్న ఎగుమతిదారుల వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని గుప్తా ఆవేదన వ్యక్తం చేశారు.

నెలాఖరుకల్లా కియా రెడీ

అనంతపురం ప్లాంట్‌లో ప్రయోగాత్మక ఉత్పత్తికి శ్రీకారం.. త్వరలో మార్కెట్లోకి తొలి మోడల్



న్యూఢిల్లీ : ఈ నెలాఖరుకల్లా దేశంలోని కార్ల ఉత్పత్తి రాష్ట్రాల జాబితాలోకి ఆంధ్రప్రదేశ్ కూడా చేరనుంది. అనంతపురం జిల్లా పెనుగొండ మండలం ఎర్రమంచి గ్రామం దగ్గర దక్షిణ కొరియా కార్ల దిగ్గజం 'కియా మోటార్స్ ఇండియా' కంపెనీ ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఈ నెలాఖరుకల్లా ఈ ప్లాంట్‌లో ప్రయోగాత్మక ఉత్పత్తి ప్రారంభిస్తామని కియా మోటార్స్ ఇండియా సేల్స్, మార్కెటింగ్ హెడ్ మనోహర్ భట్ చెప్పారు. తొలుత ఈ ప్లాంట్‌లో 'ఎస్‌పీ 2ఐ' కాన్సెప్ట్ ఎస్‌యూవీ వాహనాలు ఉత్పత్తి చేయాలని ఈ దక్షిణ కొరియా కార్ల దిగ్గజం భావిస్తోంది. గత ఏడాది జరిగిన ఆటో ఎక్స్‌పోలో కంపెనీ ఈ మోడల్‌ను ప్రదర్శించింది. ఈ ఏడాది జూన్, జూలై నాటికి ఎస్‌పీ 2ఐ' కాన్సెప్ట్ ఎస్‌యూవీ భారత మార్కెట్లో ఉంటుందని భట్ చెప్పారు. ఆ తర్వాత ప్రతి ఆరు నెలలకు ఒక కొత్త మోడల్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేస్తామన్నారు. 'ఏటా మూడు లక్షలకుపైగా కార్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్‌లో ఈ నెలాఖరుకల్లా ప్రయోగాత్మక ఉత్పత్తి ప్రారంభిస్తామనే నమ్మకంతో ఉన్నాం. ముందుగా ఇక్కడ 'ఎస్‌పీ 2ఐ' కార్ల ఉత్పత్తి చేపడతాం' అని భట్ చెప్పారు. ప్రస్తుతం కంపెనీ ఈ కారు భారత మార్కెట్‌కు అనుగుణంగా ఉందా? లేదా? అనే విషయాన్నీ పరిశీలిస్తోంది. అంతర్జాతీయంగా కియా మోటార్స్‌కు ఇది 15వ ప్లాంట్. భారత్‌లో మాత్రం తొలి ప్లాంట్.



నెట్‌వర్క్

తమ కార్లను కొనుగోలుదారులకు వీలైనంత చేరువలో ఉంచాలని కియా మోటార్స్ భావిస్తోంది. ఇందుకోసం ప్రధాన నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లోనూ డీలర్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు భట్ చెప్పారు. కొన్ని చోట్ల ప్రత్యేక షోరూమ్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు కొత్తగా మార్కెట్లో ప్రవేశించిన మరే కార్ల కంపెనీ ఏర్పాటు చేయనంత పెద్ద స్థాయిలో తమ డీలర్ల నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని కియా భావిస్తోంది. దీనికితోడు ఖాతాదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశంలోని నాలుగు ప్రధాన ప్రాంతాల్లో ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

బ్రాండ్ అంబాసిడర్

భారత మార్కెట్లో తన కార్లను కొనుగోలుదారులకు మరింత చేరువ చేసేందుకు సరైన ప్రచారకర్త (బ్రాండ్ అంబాసిడర్)ని నియమించాలని కూడా కియా మోటార్స్ ఇండియా భావిస్తోంది. ప్రస్తుత అంతర్జాతీయ మార్కెట్ కియా మోటార్స్ కార్లకు టెన్నిస్ స్టార్ రఫెల్ నడాల్ ప్రచారకర్తగా ఉన్నారు. భారత మార్కెట్ కోసం కూడా ప్రత్యేకంగా ప్రచారకర్తను నియమిస్తామని భట్ చెప్పారు. అయితే ప్రచారకర్తగా ఎవరిని నియమించాలనే విషయం ఇంకా నిర్ణయించలేదన్నారు.

ఖర్చులు తగ్గించడంపై దృష్టి

స్థానికంగా ఉత్పత్తి అయ్యే వీలైనన్ని విడి భాగాలను వినియోగించడం ద్వారా కార్ల ఉత్పత్తి ఖర్చుల్ని తగ్గించుకోవాలని కియా మోటార్స్ భావిస్తోంది. ఇందుకోసం ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న ఎర్రమంచి గ్రామంతో పాటు సమీపంలోని గుడిపల్లి గ్రామం దగ్గర 250 ఎకరాల్లో ఆటోమొబైల్ విడి భాగాలు తయారు చేసే అనుబంధ కంపెనీలు ఏర్పాటవుతున్నాయి.

పెట్టుబడి

కంపెనీ 200 కోట్ల డాలర్ల (సుమారు రూ.14,200 కోట్లు) పెట్టుబడితో రెండు దశల్లో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందులో మొదటి దశ కోసం 110 కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేస్తోంది. 2021 నాటికి మరో 80 కోట్ల డాలర్ల పెట్టుబడితో అనంతపురం ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించాలని భావిస్తోంది. రెండో దశ విస్తరణతో ప్రత్యక్ష ఉద్యోగుల సంఖ్య 10,000కు చేరుతుందని అంచనా.



ప్లాంట్ ప్రత్యేకతలు

- 535.50 ఎకరాల్లో ప్రధాన ప్లాంట్ ఏర్పాటు
- 36 ఎకరాల్లో ఉద్యోగుల కోసం టౌన్‌షిప్
- ఉద్యోగుల శిక్షణ కోసం 11.2 ఎకరాల్లో శిక్షణా కేంద్రం
- తొలి దశలో ప్రత్యక్షంగా 4,000 మందికి, పరోక్షంగా 7,000 మందికి ఉపాధి.
- విడిభాగాల ఉత్పత్తి కోసం సమీపంలోనే 40 అనుబంధ కంపెనీలు
- 100 ఎకరాల్లో రైల్వే సైడింగ్, 48.47 ఎకరాల్లో ట్రక్ టెర్మినల్ ఏర్పాటు

6 నెలలు జీఎస్‌టీ రిటర్న్స్ ఫైల్ చేయకుంటే

ఈ-వే బిల్లు ఇవ్వరు

న్యూఢిల్లీ: వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) రిటర్నులను ఫైల్ చేయని వ్యాపారుల పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా వరుసగా ఆరు నెలల పాటు జీఎస్‌టీ రిటర్నులను ఫైల్ చేయకపోతే సరుకులను రవాణా చేయడానికి అవసరమైన ఈ-వే బిల్లులు పొందే అవకాశం ఉండదు. త్వరలోనే ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. ఇందుకు సంబంధించి వస్తుసేవల పన్ను టాక్స్ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) ఐటీ వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. ఇది వరుసగా ఆరు నెలలపాటు రిటర్నులను (రెండు వరుస రిటర్న్ ఫైలింగ్ సైకిల్) ఫైలింగ్ చేయకపోతే ఈ-వే బిల్లు జనరేట్ కాకుండా చూస్తుందన్నారు. కొత్త ఐటీ వ్యవస్థ సిద్ధం కాగానే కొత్త నిబంధనలను నోటిఫై చేయనున్నట్టు ఆయన చెప్పారు. ఈ విధానం ద్వారా జీఎస్‌టీ ఎగవేతలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు మధ్యకాలంలో 3,626 జీఎస్‌టీ ఎగవేత కేసులను గుర్తించారు. వీటి మొత్తం రూ.15,278.18 కోట్లు. జీఎస్‌టీ ఎగవేతలను అడ్డుకునేందుకు 2018 ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు వ్యవసనుఉ అమల్లోకి తెచ్చారు. విలువపరంగా రూ.50,000 దాటిన వస్తువులు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి రవాణా అయినప్పుడు ఈ-వే బిల్లు తప్పనిసరి చేశారు. ఏప్రిల్ 15 నుంచి రాష్ట్రీయ రవాణాకు కూడా అమలు చేశారు.

ఇద్దరు పీఎన్‌బీ ఈడీలపై వేటు

న్యూఢిల్లీ : వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కుంభకోణానికి సంబంధించి ఇద్దరు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) డైరెక్టర్లపై ప్రభుత్వం వేటు వేసింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కే వీర బ్రహ్మాజీరావు, సంజీవ్ శరణ్‌లను ఉద్యోగం వెంటనే నుంచి తొలగిస్తున్నట్టు పేర్కొంది. అయితే ఏ కారణంతో వీరిని తొలగించిందీ పేర్కొనలేదు. ఈ కుంభకోణం బయట పడిన ఏడాది తర్వాత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. నీరవ్ మోదీ, అతడి మేనమామ మెహుల్ చోక్సీ ఏళ్ల తరబడి అక్రమంగా లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎల్ఓయు) పత్రాల ద్వారా బ్యాంకును మోసం చేస్తున్నా, వీరు గుర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని సీబీఐ ఇప్పటికే పేర్కొంది. ఈ కేసులో డైరెక్టర్ స్థాయి పీఎన్‌బీ ఉన్నతాధికారులపై వేటు పడడం ఇదే మొదటిసారి.

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో

భారత్ @ 5

బ్రిటన్‌ను వెనక్కినెట్టనున్న ఇండియా, ఫ్రాన్స్: పీడబ్ల్యూసీ

"జీఎస్‌టీ అమలు ప్రయోజనాలతో పాటు ఈ ఏడాది కేంద్రంలో ఏర్పడనున్న కొత్త ప్రభుత్వం విధానాలు దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడనున్నాయి.

- రానెన్ బెనర్జీ, పీడబ్ల్యూసీ ఇండియా ప్రతినిధి

భారత్‌లోని అపార జనాభాతో తలసరి జీడీపీ గణనీయంగా పెరిగేందుకు అవకాశాలున్నాయి.

- మైక్ జాక్‌మన్, పీడబ్ల్యూసీ సీనియర్ ఆర్థికవేత్త



ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు

దేశం	జీడీపీ *	ర్యాంకింగ్
అమెరికా	19.39	1
చైనా	12.23	2
జపాన్	4.87	3
జర్మనీ	3.67	4
బ్రిటన్	2.62	5
భారత్	2.59	6
ఫ్రాన్స్	2.58	7

(2017 డేటా ప్రకారం) * (లక్షల కోట్ల డాలర్లలో)


న్యూఢిల్లీ: ఈ ఏడాది అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో బ్రిటన్‌ను వెనక్కి నెట్టేసి భారత్ ఐదో స్థానానికి ఎగబాకవచ్చని పీడబ్ల్యూసీ (ప్రైజ్ వాటర్‌హౌజ్ కూపర్) నివేదిక పేర్కొంది. ఒకే స్థాయి అభివృద్ధి, జనాభా ఉన్న బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఈ జాబితాలో ఒక దేశ స్థానాన్ని మరొక దేశం తరచుగా భర్తీ చేస్తుంటాయి. కానీ ఈసారి భారత్ మాత్రం బ్రిటన్ స్థానాన్ని భర్తీ చేయడంతోపాటు ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకోవచ్చని పీడబ్ల్యూసీ అభిప్రాయపడింది. 2019లో బ్రిటన్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 1.6 శాతం, ఫ్రాన్స్ జీడీపీ 1.7 శాతంగా నమోదు కావచ్చని పీడబ్ల్యూసీ గ్లోబల్ ఎకానమీ వాచ్ రిపోర్ట్ అంచనా వేసింది. వాణిజ్య యుద్ధం, చమురు ధరల సెగ వంటి అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం పెద్దగా లేకపోయినట్లయితే వచ్చే ఆర్థిక సంవత్సరం(2019-20)లో భారత్ వృద్ధి రేటు 7.6 శాతానికి చేరుకోవచ్చని అంటోంది.

ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల ర్యాంకింగ్స్‌లో ఈ ఏడాది భారత్‌తోపాటు ఫ్రాన్స్ కూడా బ్రిటన్‌ను అధిగమించవచ్చని, దాంతో బ్రిటన్ ఐదో స్థానం నుంచి ఏడో స్థానానికి జారుకోవచ్చని పీడబ్ల్యూసీ పేర్కొంది. ప్రపంచ బ్యాంక్ డేటా ప్రకారం.. 2017లో భారత్ ఫ్రాన్స్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.

నేటి నుంచి దావోస్‌లో

అంతర్జాతీయ ఆర్థిక సదస్సు

భారత్ నుంచి ముకేశ్‌తో సహా 100 మంది సీఈఓల హాజరు



దావోస్: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఏటా జరిగే 'ప్రపంచ ఆర్థిక వేదిక' (డబ్ల్యుఈఎఫ్) సదస్సు సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 30 దేశాల అధినేతలు, మైక్రోసాఫ్ట్ కంపెనీ సీఈఓ సత్య నాదెళ్లతో సహా పలు అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల సీఈఓలు పాల్గొంటున్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ కూడా ఈ సదస్సుకు హాజరవుతున్నారు. భారత్ నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతమ్ ఆదానీ, ఆనంద్ మహీంద్రా, సునీల్ మిట్టల్, అజీమ్ ప్రేమ్‌జీతో సహా వంద కంపెనీల సీఈఓలు హాజరవుతున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మాత్రం.. భార్య నీతా అంబానీ, కొడుకు ఆకాశ్, కూతురు ఇషాతో సహా హాజరవుతున్నారు. జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూతో సహా 30 దేశాల ప్రధానులు లేదా అధ్యక్షులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. భారత్ నుంచి మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్ నాథ్, కేంద్ర మంత్రులు సురేశ్ ప్రభు, ఆంధ్ర ప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పంజాబ్ మంత్రి మన్‌ప్రీత్ బాదల్ హాజరవుతున్నారు. తమ దేశాల్లో నెలకొన్న కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్, బ్రిటిష్ ప్రధాని థెరిసా మే ఈ సదస్సుకు హాజరు కావడం లేదు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మళ్లీ సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని హెచ్చరికలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ సదస్సు జరుగుతోంది. 'నాలుగో పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ నిర్మాణం' అనే అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చ జరగనుంది. 'ఇండియా అండ్ ది వరల్డ్' అనే అంశంపైనా ఈ సదస్సు సందర్భంగా ప్రత్యేక చర్చ జరగనుంది.

ఫిలిప్పీన్స్‌లో ఓయో!

న్యూఢిల్లీ: హాస్పిటాలిటీ చెయిన్ ఓయో విదేశీ మార్కెట్లలో వేగవంతంగా విస్తరిస్తోంది. ఇప్పటికే చైనా, యూకే, ఇండోనేషియా, మలేషియా, యూఏఈ, నేపాల్ వంటి దేశాల్లో కార్యకలాపాలు ప్రారంభించిన ఓయో.. ఫిలిప్పీన్స్‌లోనూ తన సేవలను ప్రారంభించే సన్నాహాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. ఫిలిప్పీన్స్ మార్కెట్లో 500 కోట్ల డాలర్ల వ్యాపార అవకాశాలున్నట్టు అంచనా. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఓయో భావిస్తోంది. 2016 సంవత్సరం నుంచి ఓయో విదేశీ మార్కెట్ల బాట పట్టింది.

11000 పైన బుల్లిష్

(జనవరి 21-25 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

గత వారం నిఫ్టీ : 10907 (+112)

నిఫ్టీ గత వారం 10931-10692 పాయింట్ల మధ్యన కదలాడి 112 పాయింట్ల లాభంతో 10907 వద్ద పాజిటివ్‌గా ముగిసింది. గత రెండు వారాల్లో కుంభ-మీన రాశుల సంచార సమయంలో ఏర్పడిన పరిధి 10692-10870. మంగళవారంనాడు ఇందులో గరిష్ఠ స్థాయిని దాటి 10931 వరకు వెళ్లి బుల్లిష్ అయింది. రెండో టార్గెట్ 11050 ఇంకా చేరాల్సి ఉంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10807, 10749, 10825, 10822 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ ఇప్పుడు అన్ని డీఎంఏల కన్నా పైకివచ్చింది. 50 డీఎం ఏ 200 డీఎంఏ కన్నా దిగువకు (డెత్ క్రాస్) రావడం దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్ అయిందనేందుకు సంకేతం.
- స్వల్పకాలిక, మధ్యకాలిక ట్రెండ్ బుల్లిష్‌గాను, దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్‌గాను ఉన్నాయి. ఈ వారాంతంలో 10750 దిగువన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బేరిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 10950

బ్రేక్‌డౌన్ స్థాయి : 10600

నిరోధ స్థాయిలు: 11050, 11125(10980 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 10750, 10675(10720 కింద బేరిష్)

గ్రహగతులివే...

- కర్కాటకంలోని పుష్యమి పాదం 1 - కన్యలోని ఉత్తర పాదం 4 మధ్యలో చంద్ర సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 4 నుంచి కర్కాటకంలోని శ్రవణం పాదం 1 మధ్యలో రవి సంచారం
- మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2 - 4 మధ్యలో బుధ సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 2 - 4 మధ్యలో శుక్ర సంచారం
- మీనంలోని రేవతి పాదం 1 - 2 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2 - 3 మధ్యలో కన్య/తుల నవాంశలో శని సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 2లో మకర నవాంశలో బృహస్పతి సంచారం
- కర్కాటకంలోని పునర్వసు పాదం 4లో రాహువు, మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2లో కేతువు సంచారం

ఇన్వెస్టర్లకు సూచన...

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు. ప్రారంభ సెషన్ మెరుగు (సోమవారానికి)

తిథి: పుష్య శుక్ల పౌర్ణమి **నక్షత్రం :** పుష్యమి, భరణి, పుబ్బ,పూర్వాషాఢ నక్షత్రజాతకులు,సింహ ధనుస్సు రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 10.38

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ మెరుగ్గా ప్రారంభమై 10.35 నుంచి 12.15 మధ్యలో నిలకడగా ట్రేడవుతూ 12.30 నుంచి చివరి వరకు మరోసారి నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 10.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10945, 10980

మద్దతు స్థాయిలు : 10865, 10830

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.


గమనిక :

ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

యూఎస్‌లో స్థానికులకు 7,600 ఉద్యోగాలు: ఇన్ఫోసిస్

న్యూఢిల్లీ: అమెరికాలో ఇప్పటి వరకు 7,600 మందికి పైగా ఉద్యోగులను నియమించుకున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. అమెరికాలోని క్యాంపస్‌ల్లో 10,000 మంది అమెరికన్లను నియమించుకోవాలన్న ఆలోచనకు అనుగుణంగా ఈ నియామకాలను చేపట్టినట్లు తెలిపింది. ఇన్ఫోసిస్‌కు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉందని, ఇప్పటి వరకు ఇక్కడ 7,600 మందికి పైగా ఉద్యోగులను నియమించుకున్నట్లు సంస్థ ప్రెసిడెంట్, డిప్యూటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రవి కుమార్ తెలిపారు. యూఎస్‌లో ఇప్పటికే ఐదు హబ్‌లు ప్రారంభించగా, తాజాగా ఆరో హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఐదు హబ్‌ల కోసం రెండు వేలకు పైగా స్కూల్ గ్రేడ్-క్యాంపస్ నియామకాలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. స్థానికతకు ప్రాధాన్యమిచ్చే విధంగా ఈ నియామకాలను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి గాను ఇన్ఫోసిస్ రాబడుల్లో అమెరికా వాటా 60.4 శాతంగా ఉండగా యూరోప్ వాటా 24.2 శాతం, భారత్ వాటా 2.6 శాతం, మిగిలిన దేశాల వాటా 12.8 శాతంగా ఉంది.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.65 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	405	చిత్తూరు	433
వరంగల్	407	చెన్నై	440
విజయవాడ	425	నమక్కల్	425
గోదావరి	425	బెంగళూరు	425
విశాఖపట్నం	425	ముంబై	460

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	77	విజయవాడ	81
కరీంనగర్	78	గుంటూరు	82
వరంగల్	77	ఒంగోలు	83
మహబూబ్‌నగర్	77	చిత్తూరు	87
కర్నూలు	77	నెల్లూరు	91
విశాఖపట్నం	75	అనంతపురం	86
గోదావరి	76		

11000 కీలకం, బ్రేకౌట్ ఆస్కారం..?





వి సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత సోమవారం తొలుత రియాక్షన్‌లో పడినా ప్రధాన మద్దతు స్థాయి 10700 వద్ద కోలుకుని వారం గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. ట్రెండ్‌లో బలానికి ఇది సంకేతం. వీక్లీ చార్టుల్లో కూడా పాజిటివ్‌గా ముగియడం మరింత ర్యాలీ ఉండవచ్చునన్న ఆశలను రేకెత్తిస్తోంది. గత నెల రోజులుగా ఇండెక్స్ ప్రధాన అవరోధ స్థాయిలను నాలుగు సందర్భాల్లో తాకి, ఆ తర్వాత ఏర్పడిన రియాక్షన్లలో కూడా బలంగానే నిలదొక్కుకుంది. ఇది కూడా ట్రెండ్‌లో సానుకూల ధోరణిని సూచిస్తోంది. ఈ సారి ధోరణులు మధ్యకాలిక ట్రెండ్‌ను నిర్ణయించే 11000 వద్ద బ్రేకౌట్‌కు ఆస్కారం ఉన్నదని సూచిస్తున్నాయి. ఎన్నో సార్లు ఏర్పడిన ఎగుడుదిగుడుల్లో కూడా 11000 వద్ద ఏర్పడిన టాప్ చెక్కు చెదరక పోవడం కూడా సానుకూల సంకేతం. ప్రస్తుతం కీలక దశలో ఉన్న మార్కెట్ టెక్నికల్‌గా కొత్త దిశ తీసుకోవాల్సి ఉంది.

బుల్లిష్ స్థాయిలు : ప్రధాన నిరోధం 11000. ఇదే డిసెంబరు నెలలో ఏర్పడిన టాప్. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే కనీసం రెండు రోజుల పాటు ఆ స్థాయి కన్నా పైన ముగియాలి. అప్పుడే మరింత గరిష్ఠ స్థాయిలకు చేరే ఆస్కారం ఉంటుంది. తదుపరి ప్రధాన టార్గెట్ 2018 సెప్టెంబరు 21న ఏర్పడిన టాప్ 11350. ఆ పైన నిలదొక్కుకుంటే కొత్త శిఖరాలకు నిచ్చెన వేస్తుంది.

బేరిష్ స్థాయిలు : కరెక్షన్‌లో పడి గత వారం బాటమ్ 10850 కన్నా దిగజారితే మైనర్ బలహీనత ప్రదర్శిస్తుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 10700.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ గత వారం నిరోధ స్థాయి 27500 వద్ద నిలకడగా ముగిసింది. ప్రధాన నిరోధం 27750. ఇదే గత వారం గరిష్ఠ స్థాయి. ఆ పై టార్గెట్ 28000. కరెక్షన్‌లో పడితే మద్దతు స్థాయి 27500. అంత కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతను ప్రదర్శిస్తుంది.

స్వల్పకాలిక వ్యూహం : స్వల్పకాలిక ఇన్వెస్టర్లు మద్దతు స్థాయి 10700 కన్నా దిగువన స్టాప్ లాస్‌తో స్వల్పకాలిక బై పొజిషన్లు కొనసాగించుకోవచ్చు.

పాటర్న్ : మార్కెట్ "ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా స్వల్పంగా పైన క్లోజ్ కావడం పాజిటివ్ ట్రెండ్‌ను సూచిస్తోంది. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే 11000 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్ : ఈ సూచి ప్రకారం తదుపరి రివర్సల్ బుధవారం ఉంది. వీక్లీ చార్టుల్లో కూడా బాటమ్ ఏర్పడినట్టు కనిపిస్తోంది.

బ్యాంక్ నిఫ్టీ కూడా 27200 వద్ద మైనర్ రికవరీ సాధించినా బలంగా నిలదొక్కుకోలేకపోయింది.

సోమవారం స్థాయిలివే...

నిరోధం : 10960, 11000

మద్దతు : 10900, 10850

టీసీఎస్ (రూ.1902)- కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.1900 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం 1950	రెండో నిరోధం 2010
రూ.1870 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు 1830	రెండో మద్దతు 1790

వాసిరాజు సుందర్ రాజా

www.sundartrends.in

బజాజ్ అలియాంజ్ 'ఎం-కేర్' పాలసీ


బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 'ఎం-కేర్' పేరుతో ఆరోగ్య బీమా పాలసీ ప్రారంభించింది. దోమలు, ఈగలు, ఇతర క్రిమికీటకాల ద్వారా వ్యాపించే డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా, కాలా అజర్, మెదడు వాపు వ్యాధి, బోదకాలు, జికా వైరస్ వంటి ఏడు రకాల ఆరోగ్య సమస్యలకు ఈ పాలసీ కింద బీమా రక్షణ లభిస్తుంది.

- రూ.160 నుంచి రూ.3,000 ప్రీమియంతో రూ.10,000 నుంచి రూ.లక్ష వరకు కవరేజీ పొందవచ్చు.
- అమెరికా, సింగపూర్, మలేషియా, జపాన్ సహా ప్రపంచంలోని 37 ప్రధాన దేశాల్లో ఎక్కడ ఈ వ్యాధులు సోకినా బీమా రక్షణ లభిస్తుంది.
- కుటుంబ సభ్యులతో కలిపి తీసుకుంటే ఆరుగురు వరకు మాత్రమే అనుమతిస్తారు.
- ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, పాతికేళ్లకు మించని పిల్లలను అనుమతిస్తారు.

పరిష్కారం... ఉమ్మడి పూల్

కుటుంబ వ్యయాల విషయంలో భార్యా భర్తల మధ్య విభేదాలు తలెత్తడం సహజం. నష్టపోతున్న కంపెనీ షేర్లను వదిలించుకోకుండా వాటిపై వ్యామోహంతో ఆ పెట్టుబడిని భర్త కొనసాగించడం తప్పుగా భార్య భావిస్తే... విలాసాలు, ఆర్భాటం కోసం ఆమె చేసే వ్యయాన్ని భర్త వ్యతిరేకించడం వంటి సంఘటనలు కుటుంబాల్లో తరచుగా చోటుచేసుకుంటూ ఉంటాయి. భార్యాభర్తలిద్దరి వాటా సొమ్ముతో ఉమ్మడి పూల్ ఒకటి సిద్ధం చేసుకోవడమే ఈ సమస్యకు చక్కని పరిష్కారం. నీ సొమ్ము, నా సొమ్ము అంటూ వేర్వేరుగా చూడకుండా నీ వాటా, నా వాటా...కలిపితే మన వాటా అనే భావం పెంపొందించుకుని అలాంటి నిధిని సమకూర్చుకోవడమే ఉమ్మడి పూల్‌గా పరిగణనలోకి వస్తుంది. ఏదో ఒకటి రెండు అసాధారణ సందర్భాల్లో తప్పితే ఇలాంటి పూల్ నుంచి సొమ్మును కుటుంబ ఉమ్మడి అవసరాల కోసం వినియోగించడానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదు. ఉభయులు పరస్పరం ఎలాంటి ప్రతిఘటన లేకుండా ఇలాంటి ఖాతాల నుంచి సొమ్మును ఉమ్మడి అవసరాల కోసం వినియోగించుకునే స్వేచ్ఛ లభిస్తుంది. ఒకరి ఖర్చులను మరొకరు వృధావ్యయంగా భావించినప్పుడే విభేదాలకు బీజం పడుతుంది. అందుకే ఇద్దరికీ అంగీకార యోగ్యమైన సిద్ధాంతాలు, బడ్జెట్‌తోనే ఈ కామన్ పూల్ ఏర్పాటు చేసుకోవాలి.

జీవితానికి కీలకంగా భావించే ప్రతి అంశంలోనూ భార్యాభర్తలిద్దరి మధ్య ఒక అంగీకారం ఉండాలి. అలాంటి అంగీకారం సాధ్యం కాని పక్షంలో కనీసం గట్టి ప్రతిఘటన లేకుండా ముందుకు సాగాలనే కట్టుబాటుకు ఇద్దరూ రాక తప్పదు. అందుకే ఎదుటి వారి అసమ్మతిని కూడా గౌరవించే అలవాటు చేసుకుంటే సమస్యలు చాలా వరకు దూరం అవుతాయని పెద్దలు చెబుతూ ఉంటారు. ఇది ఏ సమస్యకైనా వర్తిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో ఇది మరింత ప్రధానం.



మదుపు ప్రధాన సమస్యే..

భవిష్యత్ కోసం చేసే పొదుపు, మదుపు విషయంలో కూడా కుటుంబాల్లో వాదోపవాదాలు జరుగుతూ ఉంటాయి. ఎంత రిస్క్ భరించవచ్చు అనే అంశంపై ఒక్కొక్కరి అభిప్రాయం ఒకటిగా ఉంటుంది. కుటుంబం ఉమ్మడి ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఒక మోస్తరు రిస్క్‌తో సరిపోయే పెట్టుబడి ఉపకరణాలు ఎంచుకోవడం సమస్య పరిష్కారానికి చక్కని బాటలు వేస్తుంది. పెట్టుబడులకు ప్రతి ఒక్క సాధనం అత్యంత కీలకమే. అందుకే పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోలో భూమి, ఇల్లు, బంగారం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఈక్విటీ పెట్టుబడులు... ప్రతి ఒక్కటీ పోర్ట్‌ఫోలియోలో భాగం చేసుకోవాలి. దీని వల్ల ఒక దాంట్లో నష్టం వచ్చినా మరొకటి ఆ నష్టాన్ని భర్తీ చేసి పోర్ట్‌ఫోలియోలో సమతూకం తెస్తుంది.

అంగీకారానికి రావడం ఎలా?

భార్యాభర్తలు, సంతానం, వయోవృద్ధులైన తల్లిదండ్రులు సాధారణంగా ఎక్కువ కుటుంబాల్లో ఉంటారు. పెద్ద వారిపై భారీ మొత్తంలో చేసే వ్యయాలు వృధా అని, ఆ సొమ్మును పిల్లల విద్య కోసం ఉపయోగించుకుంటే వారి భవిష్యత్తు తీర్చి దిద్దగలుగుతామని భార్య భావించవచ్చు. ఆభరణాలు, ఖరీదైన దుస్తులపై భార్య చేసే వ్యయం వృధా అని భర్త భావించవచ్చు. ఒకరికి ఆకర్షణీయంగా ఉండే ప్రాంతంలో మరింత విశాలమైన ఇల్లు ఉండాలని ఒకరనుకుంటే చిన్న ఇంటిలోనే కొనసాగి మిగులు సొమ్మును పెట్టుబడి అవసరాలకు ఉపయోగించుకోవాలని మరొకరు భావించవచ్చు. రిటైర్మెంట్ నిధి రూ.50 లక్షలుంటే సరిపోతుందని ఒకరు వాదిస్తే రెండు కోట్లయినా ఈ రోజుల్లో నెల కొన్న పరిస్థితుల్లో చాలదని మరొకరు వాదించవచ్చు. ఇవన్నీ ఎక్కువ శాతం కుటుంబాల్లో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చే అంశాలే. ఇలాంటి అంశాలతో ఒక జాబితా సిద్ధం చేసుకుని ప్రతీ ఒక్కదానికి ఒక స్పష్టమైన విభజన రేఖ గీసుకుని ఆ రేఖ పరిధిలోనే ఉండడం ఉభయుల మధ్య అంగీకారానికి మూలం కావాలి. ఇలాంటి సమస్మాత్మక ప్రదేశాలేమిటి అన్న అవగాహనకు వచ్చి వాటిపై ఉమ్మడి అంగీకారం సాధించడమే ఇందులో తొలి మెట్టు.

చర్చ ప్రధానం

తన మాటే చెల్లుబాటు కావాలనే పట్టుదల, అహంభావం సాధారణంగా భార్యాభర్తల మధ్య పలు అంశాల్లో చర్చలకు అవరోధంగా నిలిచే అంశాలు. పురుషాధిక్య స్వభావం కూడా ఇందుకు కారణం కావచ్చు. అలాగే పిల్లలకేం తెలుసనే భావంతో వారు వెలిబుచ్చే అభిప్రాయాలను కుటుంబ యజమాని వీటో చేయడం కూడా మరో కారణం. అందరూ సామరస్యపూర్వక, సుహృద్భావ వాతావరణంలో కూచుని చర్చించుకోవడమే ఇలాంటి సమస్యలకు చక్కని పరిష్కార మార్గం. ప్రతీ ఒక్కరి అవసరాలు ఏమిటో అందరి ముందు ఉంచి వాటిలో ప్రధానం అనుకున్న వాటికి ఉమ్మడి పూల్ నుంచి కేటాయింపులు చేసుకుంటే సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుంది. అంతే తప్ప ఏకాభిప్రాయానికి రావాలనే తాపత్రయంతో ఎడతెగని చర్చలు జరుపుతూ పోవడం వల్ల పీటముడి మరింత బిగుసుకుంటుందే తప్పితే సమస్య తీరదు. ధనం అత్యంత పరిమిత వనరు అని ప్రతీ ఒక్కరూ గుర్తించాలి. పిల్లలకు కూడా ధనం ప్రాధాన్యత వివరిస్తూ వారి ముఖ్య అవసరాలకు నిధులు కేటాయించాలి.

జీఎస్‌టీ మండలి నిర్ణయాలు-విశ్లేషణ



రాంబాబు గొండాల

పన్ను చెల్లింపుదారుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని జీఎస్‌టీ కౌన్సిల్ గత రెండు సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలను ప్రకటించింది. 2.8 శాతంలో ఉన్న చాలా వస్తువుల మీద పన్ను రేటును తగ్గించటంతో పాటుగా రిటర్న్ ఫైలింగ్‌కు సంబంధించి గడువు పొడిగించటం, వార్షిక రిటర్నుల్లో పొందుపరచవలసిన కీలక అంశాలను మార్చటం, పన్నుకు సంబంధించి గందరగోళం ఉన్న విషయాల మీద కొంత వివరణ ఇచ్చారు. ఇవన్నీ వ్యాపారస్తులకు ఏ మేరకు ఉపయోగపడతాయో.. అలాగే వాళ్లు పాటించాల్సిన జాగ్రత్తలు ఏమిటో తెలుసుకుందాం.

ఫ్రిజ్‌లు, 32 అంగుళాల లోపు టీవీలపై పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. అలాగే కొన్ని వస్తువుల మీద 18 శాతం నుంచి 12 శాతానికి, మరి కొన్నింటిని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. సినిమా టికెట్ల మీద కూడా పన్నును తగ్గించటం జరిగింది. ఇవన్నీ వ్యాపారస్తులు, వినియోగదారులకు మేలు కలిగించే నిర్ణయాలే. అయితే ఇక్కడ వ్యాపారస్తులు తెలుసుకోవాల్సిన విషయాల్లో కొన్ని ముఖ్యమైనవి ఉన్నాయి. అవి ఏమిటంటే వీరు ఇప్పటికే ఆయా వస్తువులను పాత పన్ను రేటులో కొనుగోలు చేసి ఉండవచ్చు. ఆయా వస్తువుల మీద ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకుని ఉండవచ్చు. పన్ను శాతం తగ్గినప్పుడు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను ఆ మేరకు తగ్గించుకోవాలా? అని కొంతమందికి సందేహం వస్తుంది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తగ్గించుకోవాల్సిన అవసరం ఏమీ లేదు. కానీ ఆయా వస్తువులను విక్రయించినప్పుడు మాత్రం పన్ను తగ్గింపు లాభాన్ని కచ్చితంగా వినియోగదారునికి పంచాలి. అంటే ఆ మేరకు వస్తువు ధరను తగ్గించాలి. పాత పన్ను రేటులో కొనుగోలు చేశాం కదా అని అదే ధరకు విక్రయించకూడదు.



అలాగే సెక్యూరిటీ సర్వీసులు ఇక నుంచి రివర్స్ చార్జ్ కిందకు రానున్నాయి. అంటే ఎవరైనా ఈ సేవలను జీఎస్‌టీ కింద నమోదైన వ్యక్తికి అందిస్తే ఆ సేవల మీద ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సిన బాధ్యత సదరు సేవా గ్రహీతదే. అయితే కొన్ని నియమాలకు లోబడి ప్రభుత్వ సంస్థలకు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను తీసుకున్న ఇన్వాయిస్‌ల మీద ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకోవటానికి గడువు 2018 అక్టోబరు 25తో ముగిసింది. అయితే ఇప్పుడు దీనిని 2019 ఏప్రిల్ 20 వరకు పొడిగించారు. అంటే ఎవరైనా గడచిన అక్టోబరు 25వ తేదీ లోపు క్రెడిట్ తీసుకోవటం మరిచిపోతే లేదా వీలు కాకుంటే ఇప్పుడు తీసుకోవచ్చు. అయితే క్రెడిట్ వివరాలు వారివారి జీఎస్‌టీ ఆర్ 2ఎ రిటర్న్‌లో కనిపించాలి. అంటే సరఫరాదారుడు ఆయా ఇన్వాయిస్‌లకు సంబంధించి జీఎస్‌టీఆర్-1 రిటర్న్ ఫైల్ చేసి ఉండాలి. అలాలేకుంటే కనీసం ఇప్పుడైనా ఆయా సరఫరాదారులను సంప్రదించి రిటర్న్ ఫైల్ చేసేటట్లు చేయాలి.

మరొక ముఖ్య నిర్ణయం ఏమిటంటే జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ తీసుకోవటానికి ఇప్పటి వరకు ఉన్న రూ.20 లక్షల పరిమితిని రూ.40 లక్షలకు పెంచటంతోపాటు కాంపోజిషన్ స్కీమ్‌ను కొన్ని పరిమితులకు లోబడి సర్వీస్ సెక్టార్‌కు విస్తరించింది. ఇదే సమయంలో కాంపోజిషన్ స్కీమ్ పరిమితిని రూ.కోటి యాభై లక్షలకు పెంచటంతో పాటు త్రైమాసిక రిటర్నులకు బదులు వార్షిక రిటర్నుల సౌలభ్యాన్ని కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు రిటర్నుల సరళీకరణతోపాటు పన్నుల హేతుబద్ధీకరణ చేస్తున్నప్పటికీ వ్యాపారస్తులు వాటికి సంబంధించిన నియమాలను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

ఎంత ఓర్పు ఉంటే అంత లాభం



మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు గురవుతున్న గత ఏడాది కాలంలో ఎస్‌ఐపీలపై వస్తున్న ప్రతికూల రాబడులు ఇన్వెస్టర్లను భయపెడుతున్నాయి. ఆ పెట్టుబడులు కొనసాగించడమా, వద్దా అనే పునరాలోచనలో వారు పడ్డారు. అంత పునరాలోచన అవసరమా అన్న కోణం నుంచి ఎస్‌ఐపీల ధోరణిపై ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసి మేనేజింగ్ డైరెక్టర్ నిమేష్ షా విశ్లేషణ...

మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (ఎస్‌ఐపీ) అల్పాదాయ, మధ్యాదాయ వర్గాలకు చెందిన ఇన్వెస్టర్లకు అత్యంత అనుకూలమైనది. ఇది నేరుగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం లేకుండానే స్టాక్‌మార్కెట్‌లో ఏర్పడే వృద్ధికి దీటుగా రాబడులు అందిస్తుంది. అయితే గత ఏడాది కాలంలో మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లలో నడుస్తుండడం వారిని భయపెడుతోంది. ఎవరికైనా ప్రతికూల రాబడులంటే భయం ఉండి తీరుతుంది. ఇలాంటి పరిస్థితిలోనే ఆ పెట్టుబడిని కొనసాగించాలా? నిలిపివేయాలా అనే ఆలోచన సాగిస్తారు. మ్యూచువల్ ఫండ్‌ల పనితీరుపై అధ్యయనం చేసే వేల్యూ రీసెర్చ్ సంస్థ ఇటీవల సాగించిన విశ్లేషణ ఎస్‌ఐపీ ఇన్వెస్టర్లకు ఎంతో ఉపయోగకారిగా ఉంటుంది.

వాల్యూ రీసెర్చ్ సంస్థ 1992 నుంచి 2017 సంవత్సరాల మధ్యకాలంలో మార్కెట్ల తీరుతెన్నులు, ఎస్‌ఐపీ రాబడులపై విశ్లేషణ నిర్వహించింది. ఈ 25 ఏళ్ల కాల వ్యవధిలో రెండు ప్రధాన బేర్ మార్కెట్లు, బహుళ సంఖ్యలో బుల్ మార్కెట్లు వచ్చాయి. 2001 సంవత్సరంలో డాట్‌కామ్ సంక్షోభం సమయంలోను, 2008లో అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం సమయంలోను రెండు పెద్ద బేర్ మార్కెట్లు ఏర్పడగా 1999-2000, 2004-07, 2014-16 సంవత్సరాల మధ్యకాలంలో బుల్ మార్కెట్లు ఏర్పడ్డాయి. అంటే నిలకడగా దీర్ఘకాలం పెట్టుబడులు కొనసాగించాలనేందుకు మార్కెట్లలో ఈ ధోరణే అద్దం పడుతోంది.

ఓర్పు ప్రధానం

మ్యూచువల్ ఫండ్లపై ఎప్పుడు చర్చ జరిగినా నిపుణులు సూచించేది - దీర్ఘకాలం ఇన్వెస్ట్ చేయడం, ఓర్పు వహించడం - అనే సూత్రమే. పై విశ్లేషణ ప్రకారం చూస్తే దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసిన వారు సానుకూల రాబడులతోనే బయటపడగలుగుతారు. ఎస్‌ఐపీల విషయంలో కనీస కాలపరిమితి నాలుగేళ్లుండాలని మార్కెట్ పండితులు సలహా ఇస్తూ ఉంటారు. అలా నాలుగేళ్లు, ఆ పైబడిన కాలానికి ఇన్వెస్ట్ చేసిన వారికి సానుకూల రాబడులు వచ్చే అవకాశం 90 శాతం వరకు ఉంటుంది. ఏ పెట్టుబడిపై అయినా రెండంకెల రాబడి వస్తే బాగుటుందనే ఇన్వెస్టర్లు ఆశపడతారు. నాలుగేళ్లు, ఆ పైబడిన కాలం పాటు కొనసాగించిన ఎస్‌ఐపీలపై 62 శాతం మందికి రెండంకెల్లోనే రాబడి వచ్చిందని పై విశ్లేషణ తేల్చింది. 10 సంవత్సరాలు, పైబడిన కాలానికి పెట్టుబడులపై 77 శాతం మందికి 10 శాతంకన్నా పైబడే రాబడి వచ్చింది. ఇది సగటు లెక్క మాత్రమే. ఓర్పు పాటించిన వ్యక్తిగత ఇన్వెస్టర్లను తీసుకుంటే రాబడులు 15 నుంచి 19 శాతం వరకు కూడా ఉన్నాయి.

సమయం కీలకమే

మార్కెట్‌తో పరుగు పెట్టడంకాకుండా సరైన సమయం ఎంచుకుని ఇన్వెస్ట్ చేయాలన్నది మరో ముఖ్య సూత్రం. మార్కెట్లు పతాక స్థాయిల్లో ఉన్నప్పుడు ఇన్వెస్ట్ చేయాలనుకుంటే దీర్ఘకాలిక దృక్పథం తప్పనిసరి. ఒకటి లేదా రెండేళ్ల కాలానికి పెట్టుబడి పరిమితం చేయాలనుకునే వారికి మాత్రం డెట్ ఫండ్‌లు చక్కని ప్రత్యామ్నాయం. పై విశ్లేషణ ఆధారంగా పరిశీలిస్తే 2007 సంవత్సరంలో మార్కెట్ పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఇన్వెస్ట్ చేసిన వారు రెండేళ్ల కాలపరిమితి అనంతరం భారీగా నష్టపోయారు. అదే పెట్టుబడిని 2011 వరకు కొనసాగించిన వారిలో 99 శాతం మంది మంచి లాభంతో బయటపడ్డారు.



సలహా తీసుకోండి

రిటైల్ ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాలకు దీటైన పెట్టుబడి సాధనాన్ని ఎంచుకోవడం కూడా ప్రధానమే. నిర్దిష్ట సమయంలో ఏ సాధనంపై ఎంత రాబడి వచ్చింది స్వయంగా విశ్లేషించుకోలేని వారు మంచి ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహా తీసుకోవడం మంచిది. కష్టమర్ల ఆర్థిక లక్ష్యాలు, ఆర్థిక స్థితిగతులు అన్నీ వివరంగా అడిగి తెలుసుకుని సరైన పెట్టుబడి సాధనాన్ని వారు సూచించగలుగుతారు. దీనికితోడు తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను నిర్దిష్ట కాలపరిమితిలో సమీక్షించుకోవడం కూడా చాలా అవసరం. అలా చేయడం వల్ల తమకు ఏ పెట్టుబడిపై ఎంత రాబడి వచ్చింది అన్న అవగాహన వారికి ఏర్పడుతుంది. రాబడులపై భరోసా కూడా వస్తుంది. అయితే ఏ ఒక్క సాధనాన్ని వేరుగా చూడకుండా పోర్ట్‌ఫోలియో మొత్తం మీద వచ్చే రాబడిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం అవసరం. మార్కెట్ ఆటుపోట్లకు భయపడకుండా ఓర్పుతో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసే వ్యూహం సత్ఫలితాలనిస్తుందని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. చిన్నచిన్న చినుకులే ఒక చెరువు నిండేందుకు దోహదపడతాయి. అదేవిధంగా ఎస్‌ఐపీలతో కాంపౌండింగ్ ప్రయోజనం పొంది దీర్ఘకాలంలో లాభాలు పొందగలుగుతారన్న విషయం గుర్తుంచుకోవాలి.

అరవైలోనూ రుణం

రిటైర్మెంట్‌నాటికి ఒక్క పైసా కూడా అప్పులేకుండా ఉండాలనే అందరూ కోరుకుంటారు. కానీ కొంత మందికి వయోభారం మీదపడినా నిర్వహించాల్సిన బాధ్యతలుంటాయి. అలాంటి వారు రిటైర్మెంట్ తర్వాత కూడా అప్పుల కోసం పరుగులుతీయక తప్పదు. మరి అలాంటి వారికి రుణం పొందే మార్గాలేమిటో వివరిస్తున్నారు బ్యాంక్ బజార్ సీఈఓ అదిల్ షెట్టి.



రిటైర్మెంట్ అనంతరం లేదా ఆరుపదుల వయసు పైబడిన అనంతరం సైతం బాధ్యతల భారంతో రుణాలు తీసుకోవాలని కొందరు ప్రయత్నిస్తుంటారు. కాని అలాంటి వారికి ఆర్థిక వనరులు పరిమితంగానే ఉంటాయి గనుక వారు రుణం తిరిగి చెల్లించలేరన్న భావంతో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణం ఇవ్వడానికి విముఖత చూపుతాయి. అయినంత మాత్రాన వారికి మార్గాలన్నీ మూసుకుపోయినట్టు మాత్రం కాదు. వారు కూడా రుణం పొందేందుకు గల మార్గాలివే...

1 పింఛనుపై..

రిటైరైన వారికి నెలవారీ పింఛను బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతూ ఉంటుంది. అలాంటి వారికి ఆయా బ్యాంకులు పింఛను ఖాతా ఆధారంగా రుణాలందిస్తూ ఉంటాయి. కేంద్ర రాష్ట్రప్రభుత్వాల నుంచి, రక్షణ శాఖ నుంచి పింఛన్లు అందుకుంటున్న వారు, కుటుంబ పింఛన్లు అందుకుంటున్న వారు (పింఛనుదారుని మరణం తర్వాత కూడా పింఛను అందుకునే అర్హత గల వారు) ఈ రుణం పొందేందుకు అర్హులు. సాధారణంగా ఇలాంటి రుణాల కాలపరిమితి 84 నెలలుంటుంది అంటే గరిష్ఠంగా ఏడు సంవత్సరాలన్న మాట. ఈ గడువు బ్యాంకును బట్టి మారుతూ ఉంటుంది. నెలవారీ పింఛను మొత్తం, రుణగ్రహీత వయసు, గడువు ఆధారంగా ఏ వ్యక్తి అయినా ఎంత రుణానికి అర్హుడనేది నిర్ణయిస్తారు. సాధారణంగా పింఛను రుణాలపై వడ్డీ 10 నుంచి 15 శాతం మధ్య ఉంటుంది.

2 సెక్యూరిటీ తనఖాపై..

కొంత మంది పింఛనుదారులకు పింఛనుతో పాటు కొన్ని పెట్టుబడులు కూడా ఉండవచ్చు. అలాంటి వారు తమ చేతిలో ఉన్న పెట్టుబడి సాధనాలు తనఖా పెట్టి రుణం పొందవచ్చు. అయితే దానికి సమానమైన మొత్తంలో హామీ కూడా అందించాల్సి ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎంఎఫ్ పెట్టుబడులు, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, కిసాన్ వికాస్ పత్రాలు, జీవితబీమా పాలసీలు (మనీబ్యాక్, ఎండోమెంట్) రుణం ఇవ్వడానికి అనువైన పెట్టుబడి ఉపకరణాలు. సాధారణంగా బ్యాంకులు ఈక్విటీ సాధనాలపై 50 శాతం, ఎఫ్‌డీలు, జీవిత బీమా పాలసీలపై వాటి విలువ మీద 90 శాతం మేరకు రుణం ఇస్తాయి. ఉదాహరణకి మార్కెట్‌లో అప్పటి విలువ ఆధారంగా రెండు లక్షల ధర పలికే ఈక్విటీ సాధనాలపై రూ.లక్ష రుణం వస్తుంది. అదే విలువ గల ఎఫ్‌డీలు, బీమా పాలసీలు అయితే రూ.1.80 లక్షల వరకు రుణం వస్తుంది. ఎఫ్‌డీలపై బ్యాంకు లేదా ఆర్థిక సంస్థ చెల్లిస్తున్న వడ్డీకన్నా 1-1.5 శాతం అదనంగా వడ్డీ శాతం నిర్ణయిస్తాయి. ఉదాహరణకు ఎఫ్‌డీపై 8 శాతం వడ్డీ చెల్లిస్తుంటే రుణంపై వడ్డీ 9-9.5 శాతం మధ్యన ఉంటుంది. ఇలాంటి రుణాలు తీసుకున్నప్పుడు వాటిని తనఖాగా మార్చేందుకు అయ్యే ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు, ఏఎంసీ చార్జీలు రుణగ్రహీత భరించాల్సి ఉంటుంది.



3 స్థిరాస్తిపై..

సొంత ఇల్లున్న వారు దాన్ని తనఖా పెట్టి రుణం పొందవచ్చు. ఆదాయం పరిమితంగా ఉండి మంచి విలువ గల స్థిరాస్తి ఉన్న వారికి ఇది చక్కని సాధనం. ఈ రుణానికి 70 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితి ఉంటుంది. బ్యాంకును బట్టి ఈ గరిష్ఠ వయోపరిమితిలో వ్యత్యాసాలుండవచ్చు. ఆ వయోపరిమితిలోపు ఇఎంఐల చెల్లింపు పూర్తి కావలసి ఉంటుంది. కానీ దీన్ని పరిమిత అవకాశంగానే ఉపయోగించుకోవడం మంచిది. చిన్న మొత్తంలో రుణం కోసం చేతిలో ఉన్న స్థిరాస్తిని తనఖా పెట్టి రుణం పొందడాన్ని ఫైనాన్షియల్ అడ్వైజర్లు అంతగా సిఫారసు చేయరు. ఆస్తి విలువకు సమానంగా రుణం పొందితే ఇఎంఐలు భారంగా మారతాయి.



4 రివర్స్ మార్గేజ్‌పై..

సీనియర్ సిటిజన్లకు అందుబాటులో ఉన్న మరో సాధనం రివర్స్ మార్గేజ్ రుణం (ఆర్‌ఎంఎల్). ఇందుకు కనీస వయసు 60 ఏళ్లు. భార్యతో కలిసి జాయింట్‌గా రుణం తీసుకోవాలనుకుంటే 55 సంవత్సరాల కనీస వయస్సు 55 ఏళ్లు. ఈ రుణాన్ని ఏకమొత్తంలోను లేదా యాన్యువిటీ అవకాశం ఉన్న ఆర్‌ఎంఎల్‌గాను (ఆర్‌ఎంఎల్‌ఈఏ) పొందవచ్చు. ఆర్‌ఎంఎల్‌ఈఏలో అయితే యాన్యువిటీ మొత్తం ఆధారంగా రుణగ్రహీత నెలవారీ పింఛను పొందేందుకు అర్హుడు. ఈ రుణం రుణగ్రహీత జీవించి ఉన్న కాలంలో చెల్లించాల్సిన అవసరం ఉండదు. అన్ని మార్గాలు మూసుకుపోయిన సందర్భాల్లో అత్యంత అరుదుగా మాత్రమే ఈ తరహా రుణం తీసుకోవాలన్నది ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహా. సీనియర్ సిటిజన్లకు కూడా అత్యవసరాలకు పై నాలుగు రకాల రుణాలు అందుబాటులో ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ తప్పనిసరి అయితే తప్ప రుణానికి వెళ్లడం మంచిది కాదు. తప్పనిసరి అయి రుణం తీసుకున్నా అప్పటి తమ జీవనశైలి, ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం దెబ్బతినని విధంగా అవసరమైనంత మొత్తంలోనే రుణం పొందడం మంచిది. అర్హత ఉంది కదా అని అధిక మొత్తం తీసుకుంటే తలకు మించిన భారం అయి తీరుతుంది.



శాసనసభ 4 రోజులు.. మండలి 1 రోజు

» ముగిసిన సమావేశాలు

హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 17 నుంచి నాలుగు రోజుల పాటు 9.28 గంటలపాటు సభ పనిచేసింది. ఐదుగురు సభ్యులు మాట్లాడారు. కాగా, శాసనమండలి సమావేశాలు ఆదివారం ఒక రోజే జరిగాయి. మండలిలో 18 మంది సభ్యులకు మాట్లాడే అవకాశం వచ్చింది. మొత్తంగా 4.54 గంటలపాటు మండలి పనిచేసింది. ఉభయ సభల సమావేశాల వివరాలను అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు ఆదివారం విడుదల చేశారు.


పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం: కొప్పుల

» కేసీఆర్ చర్యలు భేష్: ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగం రాష్ట్రాభివృద్ధికి అద్దం పట్టిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ఆదివారం శాసనసభలో జరిగిన చర్చను ప్రారంభించిన ఈశ్వర్... కొత్త రాష్ట్రమైనప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఈపథకాన్ని అమలు చేసే దిశగా ఇతర రాష్ట్రాలు యోచిస్తున్నాయని వెల్లడించారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేద్దామన్నప్పుడు అందరం భయపడ్డామని, వద్దన్నామని, అయినా సీఎం కేసీఆర్ అలాగే ముందుకెళ్లారని పేర్కొన్నారు. ఇప్పటికి 90% రైతులకు ఊరట కలిగిందని చెప్పారు. సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కొనియాడారు.

● పూర్తి కేబినెట్‌ను ఏర్పాటు చేయండి: గండ్ర



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రివర్గాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. అసెంబ్లీ ముందస్తుగా రద్దు కావడం, ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్రంలో పాలన కుంటుపడిందన్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు, జెడ్పీ, స్థానిక ఎన్నికలతో మళ్లీ ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే అంశంపై మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల ప్రసంగంలా గవర్నర్ ప్రసంగం ఉందని గండ్ర విమర్శించారు. అనంతరం సీఎల్పీ ఆవరణలో మాట్లాడుతూ టీఆర్ఎస్‌ను అసెంబ్లీ లోపల, బయట ఎదుర్కొనే సత్తా సీఎల్పీకి ఉందని గండ్ర అన్నారు.

● 17 ఎంపీ సీట్లూ టీఆర్ఎస్-మజ్లిస్‌వే: బలాల



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలనూ టీఆర్ఎస్-ఎంఐఎం కైవసం చేసుకుంటాయని ఎంఐఎం శాసన సభ్యుడు అహ్మద్‌బలాల ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌తో కలిసి పనిచేస్తామన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగాయన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వచ్చినా ప్రభావం చూపలేకపోయారన్నారు. చార్మినార్ వద్ద రాహుల్‌గాంధీ నిర్వహించిన సభలో 1500 మంది కూడా పాల్గొనలేదన్నారు.

● సీఎంగా ఉన్న వారి కాళ్లు పట్టుకుంటారు

» మజ్లిస్‌ను ఉద్దేశించి రాజాసింగ్ వ్యాఖ్య



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే వాళ్ల కాళ్లు పట్టుకుని తిరిగేవారు కొందరు ఉన్నారని మజ్లిస్‌ను ఉద్దేశించి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై ఆయన మాట్లాడారు. 'ఎవరు సీఎంగా ఉంటే వాళ్ల కాళ్లు పట్టుకుని తిరిగిన వారు ఇక్కడున్నారు? వాళ్ల కాళ్లు గుంజే ప్రమాదం కూడా ఉంది. వారికి సమైక్యాంధ్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి గిఫ్ట్ కూడా ఇచ్చారు' అని వ్యాఖ్యానించారు.

● ఏపీలో బీసీలను ఏకం చేస్తా: తలసాని



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని బీసీలను తాను ఏకం చేస్తానని, దానికి అవసరమైన ఆయుధాలు తన వద్ద ఉన్నాయని మాజీ మంత్రి, టీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అసెంబ్లీ ఆవరణలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో పంపిణీ కోసం ఏపీ నుంచి గొర్రెలను కొనుగోలు చేయడం వల్ల అక్కడి యాదవులకు లాభం చేకూరిందని, చేపల పెంపకానికి అక్కడి నుంచే సీడ్‌ను దిగుమతి చేసుకున్నామని, ఇలాంటి విషయాలను బీసీల ఐక్యతకు ప్రయోగిస్తానని చెప్పారు. ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో కేసీఆర్ కలవడం వల్ల వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఏపీలో తన ప్రచారం రెండు, మూడు శాతమైనా ప్రభావం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

● విమర్శలు మాని సలహాలివ్వాలి: ముత్తిరెడ్డి



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్షాలు విమర్శలు మాని సలహాలు ఇవ్వాలని టీఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను అభివృద్ధి చేసి చేపల పరిశ్రమలకు ఊతమిచ్చామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ పెరిగిందని చెప్పారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, ఇవన్నీ పట్టించుకోకుండా ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరైంది కాదన్నారు.

● 13 ఏళ్ల తర్వాత మాట్లాడుకున్నాం

» ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు : జగ్గారెడ్డి



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్, తాను 13 ఏళ్ల తర్వాత మాట్లాడుకున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తాను తొలిసారి ఎమ్మెల్యే అయింది టీఆర్ఎస్ నుంచేనని తెలిపారు. సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటుపై అసెంబ్లీలో తాను అడగ్గానే సానుకూలంగా స్పందించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ఏర్పాటుపై జీవో రాగానే ముఖ్యమంత్రిని కలుస్తానని, పార్టీలకతీతంగా కేసీఆర్‌ను సంగారెడ్డికి ఆహ్వానించి ఘన స్వాగతం పలుకుతానని తెలిపారు. అనంతరం సీఎల్పీలో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర సీఎంగా చంద్రబాబు అవలంబించిన విజన్ 2020 వల్లే హైదరాబాద్ అభివృద్ధి జరిగిందన్నారు. ఏపీలో వచ్చే ఎన్నికల్లో ఆయన గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. మెదక్ నుంచి రాహుల్ పోటీ చేస్తే.. కేసీఆర్ నిలబడ్డా రాహులే బంపర్ మెజార్టీతో గెలుస్తారని అన్నారు.

● రైతు బంధుపై పరిమితి విధించాలి: కాంగ్రెస్

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు బంధు పథకంపై పరిమితి విధించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. 10 ఎకరాల లోపు, లేదంటే 20 ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న వారికే ఆ పథకం వర్తించేలా నిబంధన విధించాలన్నారు. ఆదివారం శాసనసభ వాయిదా పడిన అనంతరం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చాంబర్‌లో ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, హరిప్రియానాయక్, శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి విలేకరులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతు బంధు పథకం చర్చకు వచ్చింది. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో స్థిరపడిన వారికి కూడా రైతు బంధు పథకాన్ని వర్తింపచేస్తే ప్రయోజనం ఏముంటుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌలు రైతులకూ రైతు బంధు పథకం కింద లబ్ధిచేకూర్చాల్సిన అవసరం ఉందని పలువురు ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు.



శాసన సభలో ఆసీనులైన సీఎం కేసీఆర్

ఏప్రిల్ 1 విడుదల!

(మూడో పేజీ తరువాయి)

తిప్పికొట్టారు. గవర్నర్ తన ప్రసంగంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారని, దానిని కాంగ్రెస్ తప్పుబట్టడాన్ని చూసి జాలిపడుతున్నానని అన్నారు. గవర్నర్ కూడా ప్రభుత్వంలో భాగమేనని, ప్రసంగంలో ఆయన సొంత కవిత్వం ఉండదని, కేబినెట్ చెప్పిందే ఆయన చదువుతారని తెలిపారు. గవర్నర్‌ను 'మీ గవర్నర్' అని సంబోధించడం కూడా సరికాదని హితవు పలికారు. గవర్నర్ ప్రసంగం తర్వాత చాలామంది సభ్యులు సంతోషం వ్యక్తం చేసి హుందాగా ప్రవర్తించారని అన్నారు. పార్లమెంట్ మాదిరిగా అసెంబ్లీలో కూడా నిబంధనలు పాటిద్దామన్నారు. ఎన్ని రోజులైనా ప్రజా సమస్యలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వచ్చే ఐదేళ్లలో 10లక్షల కోట్ల సంపాదన, ఖర్చు

వచ్చే ఐదేళ్లలో 10 లక్షల కోట్లు సంపాదిస్తామని, అంతే మొత్తం ఖర్చు చేస్తామని, కేంద్రంలో అనుకూల ప్రభుత్వం ఉంటే మరో 2 లక్షల కోట్లు అదనంగా సమకూర్చుకుంటామని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇందులో రూ.2.40 లక్షల కోట్లు అప్పులు చెల్లించాల్సి ఉందని, దానిని చెల్లిస్తే తిరిగి రూ.1.30 లక్షల కోట్ల అప్పు లభిస్తుందని వివరించారు. "ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఇప్పటి వరకు 99 వేల కోట్లు ఖర్చు చేశాం. మార్చి చివరికి మరో 7 వేల కోట్లు ఖర్చు చేస్తాం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు వచ్చే ఐదేళ్లలో 1.17 లక్షల కోట్లు అవసరం. మొత్తంగా సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం రూ.2.25 లక్షల కోట్లు ఖర్చు చేసి 1.25 కోట్ల ఎకరాలకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకుంది" అని స్పష్టం చేశారు.

కేసీఆర్ కిట్‌లో కేంద్రం పైసల్లేవు

కేసీఆర్ కిట్ పథకంలో కేంద్ర ప్రభుత్వం డబ్బు ఏకానా కూడా లేదని సీఎం కేసీఆర్ అన్నారు. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ డబ్బులతోనే పథకం నడుస్తోందని రాజాసింగ్‌ను ఉద్దేశించి చెప్పారు. "ప్రధాని వద్దకు వెళ్లిన ప్రతిసారీ ఆయుష్మాన్ భారత్ పథకంలో తెలంగాణ చేరలేదనే అంశాన్ని ఆయన ప్రస్తావిస్తారు. మీ ఆయుష్మాన్ భారత్ కంటే మా ఆరోగ్యశ్రీ బాగుంది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆయనకు ఎవరు చెప్పారో గానీ అది చాలా బాగుంది. మేం కొత్తగా పెట్టింది కాదు అది. ఆరోగ్యశ్రీ ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతుంది. ఆయుష్మాన్ భారత్ కంటే ఎన్నో రెట్లు బాగుంది. దానికి మేం కాస్త మెరుగులు దిద్ది అమ్మఒడి లాంటి కార్యక్రమాన్ని అదనంగా చేర్చాం" అని ప్రధానికి వివరించినట్లు కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ కిట్లకు కేంద్రం నిధులు ఇస్తోందనే భ్రమల్లోంచి బీజేపీ సభ్యులు బయటకు రావాలన్నారు.

మంచి చేసినప్పుడు అభినందించాలి!

గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారీ.. 'ఆహో.. ఓహో' అని అధికారపక్షం.. చప్పగా ఉందని, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని ప్రతిపక్షాలు అంటూ వస్తున్నాయని, దీనిని అధిగమించాలని కేసీఆర్ వ్యాఖ్యానించారు. మంచి చేసినప్పుడు అభినందించాలని ప్రతిపక్షాలకు సూచించారు. కొత్త తరం నేతలు సభలోకి వచ్చినా పాత విధానాన్నే అవలంబించడం సరికాదని కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డిని ఉద్దేశించి హితవు పలికారు.

ధరణితో లంచాలకు తెర

గత ప్రభుత్వాలు భూ సంబంధ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని, టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం భూ రికార్డులను ప్రక్షాళన చేసిందని కేసీఆర్ తెలిపారు. ధరణి వెబ్‌సైట్‌లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే లంచాలకు తెరపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమపై నమ్మకంతో రెండోసారి అఖండ మెజారిటీతో టీఆర్ఎస్‌ను గెలిపించిన ప్రజలకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నానని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

వాగ్దానాలు 100 % అమలు చేస్తాం

"మా హామీలు చీకట్లో బాణాలు కాదు. మేం చీకట్లో బాణాలు వేయం. గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్న అంశాలు, మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు, ఎన్నికల సందర్భంగా బహిరంగ సభల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వంద శాతం అమలు చేస్తాం" అని సీఎం కేసీఆర్ అన్నారు. వాటి అమలుకు తమకు ఐదేళ్ల సమయం ఉందన్నారు. రానున్న అవసరాల మేరకు మరిన్ని కొత్త పథకాలు ఉంటాయని చెప్పారు.

జీఎస్టీ వసూళ్లలో నంబర్ వన్

ఆర్థిక సంఘం ఇచ్చే నివేదికను కొత్తగా కేంద్రంలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వం ఆమోదిస్తుందా? లేదా? అనే అంశంపై స్పష్టత లేదని, కేంద్రం కూడా ఓటాన్ అకౌంట్‌కు వెళుతోందని, అందుకే, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కే ఆమోదం తెలపనుందని చెప్పారు. ఫిబ్రవరి 15, 16 తేదీల్లో జరిగే ఆర్థిక సంఘం సమావేశానికి వెళతానన్నారు. గత నాలుగేళ్లలో స్థిరమైన ఆర్థిక వృద్ధిరేటును నమోదు చేశామని, జీఎస్టీ వసూళ్లలో కూడా నంబర్ వన్‌లో ఉన్నామని తెలిపారు. తమ పాలనలో ఒక్క కుంభకోణం జరగలేదని, అవినీతిని నిర్మూలించామని చెప్పారు.

డబుల్ ఇళ్లపై మరోసారి సర్వే

"రాష్ట్రంలో 2.70 లక్షల డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టాం. హైదరాబాద్‌లోని కొల్లూరులో 15,600 ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. మొత్తంగా 30 వేల ఇళ్లు నిర్మిస్తున్నాం" అని కేసీఆర్ చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా కట్టాల్సిన ఇళ్లు ఎన్ని ఉన్నాయనే అంశంపై మరోసారి సర్వే చేయిస్తామన్నారు. కాంగ్రెస్, టీడీపీ హయాంలో 70 నుంచి 80 లక్షల ఇళ్లు కట్టామని అంటున్నారని, అన్ని ఇళ్లు కడితే ఏమయ్యాయని ప్రశ్నించారు. సొంత స్థలం ఉన్న వారికి రూ.5-6 లక్షలు ఇవ్వాలని ఆలోచిస్తున్నామని, ఎంత మందికి ఇవ్వాలనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

సీఎం ప్రసంగంలోని మరికొన్ని ముఖ్యాంశాలు

- కలప దొంగల భరతం పడతాం. కలప స్మగ్లింగ్ చేసే వారిపై పీడీ యాక్టు ప్రయోగిస్తాం.
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా స్థానికంగా ప్రజా దర్బార్లు ఏర్పాటు చేసి సమస్యలను అక్కడికక్కడే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం.
- హైదరాబాద్ వంటి నగరాల్లో చెట్లు లేక ఆక్సిజన్ క్లబ్‌లు వెలిశాయి. ప్రజలు జీవించేందుకు అనువైన వాతావరణం ఉండాలి.
- ఛత్తీస్‌గఢ్ నుంచి గుత్తికోయలు వలస వస్తున్నారు. అడవిని నరికేస్తున్నారు. త్వరలోనే గిరిజన ఎమ్మెల్యేలంతా కలిసి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి సమస్య పరిష్కరించేలా చేస్తాం.
- ఎస్టీ తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయి. వాటిని కలుపుకొని మొత్తం 12,751 పంచాయతీలున్నాయి. పాత, కొత్త పంచాయతీలను కలుపుతూ బీటీ రోడ్లు నిర్మిస్తాం.
- రాష్ట్రంలో రెసిడెన్షియల్ విద్యా సంస్థలను ఇంకా పెంచుతాం. ఉన్నత విద్యలో ప్రైవేటు కాలేజీలను భాగస్వాములను చేస్తాం.
- ఇప్పటి వరకూ రాష్ట్రానికి 37 అవార్డులు వచ్చాయి. వైద్య రంగంలో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నాం. కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసి శాంతిభద్రతలతోపాటు విపత్తు నిర్వహణ కూడా చేపడతాం.
- రైతులకు, పరిశ్రమలకు విద్యుత్తు కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లు పూర్తయ్యే దశలో ఉన్నాయి.
- రైతు పంటకు మద్దతు ధర కల్పించే అంశంపై ప్రయత్నం చేస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటాం.
- సంగారెడ్డితోపాటు మరో ఐదారు జిల్లాలకు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని కేసీఆర్ చెప్పారు. ఈ మేరకు సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి వినతికి సీఎం స్పందించారు.

నియోజకవర్గానికో ప్రాసెసింగ్ యూనిట్

ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, రైతు ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పి.. వాటి నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగిస్తామని కేసీఆర్ చెప్పారు. నియోజకవర్గానికి కనీసంగా ఒకటి లేదా రెండు, వీలైతే మండలానికి ఒకటి వంతున స్థానికంగా పండే పంటల ఆధారంగా ఈ యూనిట్లు ఉంటాయన్నారు. పాలు, కారం, పసుపు ఇలా అన్ని వస్తువులూ కల్తీ అవుతున్నాయని, నాణ్యత ఉండేలా విజయా బ్రాండ్ మాదిరిగా ఈ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా వస్తువులను ఉత్పత్తి చేస్తామన్నారు.

ఎత్తిపొడుపులు వద్దు: భట్టి

సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో పలు సందర్భాల్లో కాంగ్రెస్ సభ్యులు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని పదే పదే పేర్కొనడంపై.. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అభ్యంతరం వ్యక్తం చేశారు. సభా నాయకుడిగా సీఎం హుందాగా సమాధానం ఇవ్వాలని, తరచూ ఎత్తి పొడుపులు చేయవద్దని సూచించారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భూమిని సర్వే చేశారా అని ప్రశ్నించారు.

కేసీఆర్ మళ్లీ తప్పు చేస్తారనుకోను

ప్రజలు టీఆర్ఎస్‌నే అసెంబ్లీకి పంపలేదు.. ప్రశ్నించేందుకు మమ్మల్ని కూడా పంపారు

» మా ఎమ్మెల్యేలెవరూ టీఆర్ఎస్‌లో చేరరు

» ప్రతిపక్షం లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదు

» మీడియాతో చిట్‌చాట్‌లో సీఎల్పీ నేత భట్టి



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీని హుందాగా నడుపుతామని శాసనసభ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించారని, గతంలో మాదిరిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకునే తప్పుడు పనిని మళ్లీ చేస్తాడనుకోవటం లేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలెవరూ టీఆర్ఎస్‌లో చేరబోరని స్పష్టం చేశారు. సభలో ప్రతిపక్షం అనేది లేకుండా చేయాలని చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కుంటుపడుతుందని అధికార పక్షాన్ని హెచ్చరించారు. టీఆర్ఎస్‌కు పట్టం గట్టిన ప్రజలే 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించి ప్రతిపక్షంగా అసెంబ్లీకి పంపారని చెప్పారు. ఒక్క అధికార పక్షమే ఉండాలని ప్రజలనుకుంటే 119 సీట్లలో టీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించి ఉండేవారని అన్నారు. ఆదివారం అసెంబ్లీ నిరవధిక వాయిదా అనంతరం సీఎల్పీలో విలేకరులతో భట్టి చిట్‌చాట్‌గా మాట్లాడారు. వచ్చే సెషన్ నుంచి సభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని చెప్పారు.

కలిసికట్టుగా సాగుతాం

కాంగ్రెస్ శాసనసభా పక్షం ఒక టీమ్‌గా ముందుకు సాగుతుందని భట్టి చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రతి విషయాన్ని ఆయనతో చర్చిస్తున్నానన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రతి నెలా సీఎల్పీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామన్నారు. త్వరలో జరగబోయే సీఎల్పీ భేటీలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి ఆశీర్వాదం తీసుకున్నానని, త్వరలోనే ఢిల్లీ వెళ్లి అధిష్ఠానానికి కృతజ్ఞతలు చెబుతానని పేర్కొన్నారు.

సీఎంకు టెక్నికల్ నాలెడ్జి ఉందా ?

సాగునీటి ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశానని సీఎం కేసీఆర్ చెప్పుకోవడాన్ని భట్టి తప్పుబట్టారు. రీడిజైనింగ్ చేయడానికి కేసీఆర్‌కు టెక్నికల్ నాలెడ్జి ఉందా అని ప్రశ్నించారు. రూ.2.25లక్షల కోట్లతో నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులపై సెకండ్, థర్డ్ పార్టీ ఇంజనీరింగ్ సంస్థలతో సర్వే చేయించాలని సూచించారు. ఇప్పటి వరకూ ప్రాజెక్టులపై లక్ష కోట్లు వెచ్చించినా.. అదనంగా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించిన దాఖలాలు లేవన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర చర్చ, అధ్యయనం జరగాల్సి ఉందని, థర్డ్ పార్టీ అభిప్రాయాన్ని ప్రభుత్వం తీసుకోకపోతే సీఎల్పీనే ఆ బాధ్యత తీసుకుంటుందని చెప్పారు.

నా బాధ్యత విజయవంతంగా నిర్వహిస్తా

» శాసనసభ పనితీరును ఆదర్శంగా చేస్తా

» సభ్యులంతా సహకరిస్తారని ఆశిస్తున్నా: పోచారం



హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): "నియమ నిబంధనలతో పనిచేసే వ్యక్తులకు ఏ పదవి అయినా బరువు కాదు. చేతకాదు అనుకుంటే ఏదైనా బరువే. స్పీకర్‌గా నా బాధ్యతను విజయవంతంగా నిర్వహిస్తా."అని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంత్రి పదవి, స్పీకర్‌గా బాధ్యతలు రెండింటిలో ఏది కష్టమన్న విలేకరుల ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. ఎమ్మెల్యేలు సొంత ఇష్టంతో పార్టీలు మారుతున్నారని, బలవంతంగా ఎవరినీ చేర్చుకోలేరన్నారు. పార్టీ ఫిరాయింపులపై న్యాయపరమైన సమస్యలుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాసనసభ నిరవధిక వాయిదా అనంతరం ఆదివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో అసెంబ్లీ సెక్రటరీ వి.నరసింహాచార్యులుతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో తాను వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేశానని, ఆ సమయంలో ప్రవేశపెట్టిన పథకాల వల్ల తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అదేవిధంగా స్పీకర్‌గా కూడా శాసనసభ పనితీరు ఆదర్శవంతంగా సాగేలా చేస్తానని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందని, శాసనసభ వ్యవహారాల విషయంలోనూ మొదటి స్థానంలో ఉండేలా సభ్యులంతా సహకరించాలని కోరారు. సభ్యులంతా తనకు సహకరిస్తారని, హుందాగా వ్యవహరిస్తారనే నమ్మకం ఉందన్నారు. ప్రభుత్వ పాలనకు అద్దం పట్టేలా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. కొత్త సభ్యులకు సభ నియమావళితోపాటు పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రజయోజనాలను దృష్టిలో పెట్టుకుని మాట్లాడే ప్రతి సభ్యుడికి కచ్చితంగా అవకాశం ఇస్తామని, గాడి తప్పి మాట్లాడితే మైక్ కట్ చేస్తామన్నారు. అసెంబ్లీ వెబ్‌సైట్‌ను మరింత అప్‌గ్రేడ్ చేస్తామని, యువజర్నలిస్టులకు సభావ్యవహారాలపై అవగాహన పెంచేందుకు సదస్సును నిర్వహిస్తామన్నారు.

● ప్రతిపక్ష నేతగా భట్టి

» ఎంఐఎం ఎల్పీ నేతగా అక్బరుద్దీన్: స్పీకర్ ప్రకటన

హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) నాయకునిగా ఎన్నికైన మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కను ప్రతిపక్ష నేతగా శాసనసభ స్పీకర్ పి. శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్‌ను ప్రధాన ప్రతిపక్షంగా గుర్తిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం శాసనసభ సమావేశం ప్రారంభం కాగానే స్పీకర్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. అంతకుముందే భట్టి సీటు వద్దకు వెళ్ళిన సీఎం కేసీఆర్.. ప్రతిపక్ష నేతగా ఎంపికైన ఆయనను అభినందించారు. కాగా ఎంఐఎం పక్షనేతగా ఆ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ వ్యవహరిస్తారని స్పీకర్ ప్రకటించారు.

కేసీఆర్‌తో సండ్ర ఏకాంత భేటీ

» త్వరలో గులాబీ గూటికి చేరే చాన్స్?

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నేత, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అధికార టీఆర్ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైందా! అంటే తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. పార్టీ మార్పు ఊహాగానాల నేపథ్యంలో తొలిసారిగా ఆదివారం సభకు హాజరైన సండ్ర.. ఆ వెంటనే సీఎం కేసీఆర్‌తో గంట పాటు ఏకాంతంగా భేటీ కావడం ప్రాధాన్యం సతరించుకుంది. సాధారణంగా సభకు తొలిసారిగా వచ్చే సందర్భాల్లో సండ్ర పసుపు రంగు చొక్కా ధరిస్తారు. కానీ, ఆదివారం తెల్ల చొక్కా ధరించి రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఉదయం 10 గంటలకు అసెంబ్లీకి చేరుకున్న సండ్ర.. స్పీకర్‌తో భేటీ అనంతరం నేరుగా సభలోకి వెళ్లి ప్రమాణం చేశారు. అయితే, తనతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా సీఎంను కలిశారని, మర్యాదపూర్వకంగా జరిగిన భేటీలో రహదారులకు భూసేకరణ అంశం చర్చకు వచ్చిందని సండ్ర 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. మరోవైపు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ తాను పార్టీ మారితే ప్రజలకు చెప్పే మారుతానని స్పష్టం చేశారు. ప్రగతిభవన్ వెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. పార్టీ మారడం, మారకపోవడం ముఖ్యం కాదు.. ప్రజల్లో ఉంటే గెలుస్తామని అభిప్రాయపడ్డారు. కాగా, సభ కొనసాగుతున్న సమయంలోనే సండ్ర వెళ్లిపోవడం, మరో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు రాకపోవడంతో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో టీడీపీ ప్రాతినిధ్యం కరువైంది.

కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి పెరిగిన పెన్షన్లు, నిరుద్యోగ భృతి

» శాసన మండలిలో హోంమంత్రి మహమూద్ అలీ

» కేసీఆర్ ప్రసంగాన్నే గవర్నర్ కాపీ కొట్టారు: షబ్బీర్ అలీ

» కొత్తదనమే లేదు: బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన పెన్షన్ల పెంపు, నిరుద్యోగ భృతిని కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ఇస్తామని హోంమంత్రి మహమూద్ అలీ ఆదివారం శాసన మండలిలో ప్రకటించారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే అంశంపై విపక్షాలు లేవనెత్తిన వివిధ అంశాలకు ముఖ్యమంత్రి తరఫున ఆయన సమాధానమిచ్చారు. అంతకుముందు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చను ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో అవినీతిరహిత పాలన, ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరించడం వల్లే ఆర్థిక వృద్ధిరేటు 17.17గా నమోదైందన్నారు. కాగా, కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రసంగాలనే గవర్నర్ మక్కీకి మక్కీ కాపీ కొట్టారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ విమర్శించారు. రాష్ట్రంలో మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమే లేదని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు అన్నారు.



లిబియా తీరంలో మునిగిపోయిన పడవ నుంచి వలసదారులను రక్షిస్తున్న నావికా సిబ్బంది

169 మంది జలసమాధి

మధ్యధరా సముద్రంలో వలసదారుల పడవలు మునక

రోమ్, జనవరి 20: పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం ఉత్తర ఆఫ్రికా నుంచి ఐరోపా బయలుదేరిన 169 మంది జలసమాధి అయ్యారు. లిబియా, మొరాకోలకు చెందిన వలసదారులతో బయలుదేరిన రెండు పడవలు మధ్యధరా సముద్రంలో మునిగిపోడంతో ఈ దారుణం చోటుచేసుకుంది. లిబియా తీరంలో శనివారం ఒక పడవ మునిగిపోయినట్లు ఇటలీ నావికాదళం వెల్లడించింది. దీనిలో దాదాపు 120 మంది ఉండగా, కేవలం ముగ్గురే ప్రాణాలతో బయటపడినట్లు గుర్తించింది. ఈ పడవ లిబియాలోని గారాబుల్లి రేవు నుంచి బయలుదేరిన 10 గంటల తర్వాత మునిగిపోయినట్లుగా తెలుస్తోంది. పడవ మునిగిపోతుండగా గుర్తించిన ఇటలీ సైనిక విమానం నుంచి తెప్పలను సముద్రజలాల్లోకి జారవిడిచింది. అయితే తగిన ఇంధనం లేకపోవడంతో విమానం అక్కడి నుంచి వెళ్లిపోయింది. సహాయక నౌకను సంఘటనా స్థలానికి పంపించేలోగా 117 మంది జలసమాధి అయ్యారు. మరో పడవ మొరాకో నుంచి బయలుదేరి పశ్చిమ మధ్యధరా సముద్రంలో మునిగిపోయింది. ఇందులో 53 మంది ఉండగా, ఒక్కరే బతికి బయటపడ్డారు. లిబియాలోని జువార తీరంలో మరో పడవ మునిగిన ఘటనలో 47 మందిని రక్షించినట్లు ఛారిటీ సీ-వాచ్ సంస్థ తెలిపింది.



ప్రపంచ వృద్ధుడు మాసాజో కన్నుమూత

టోక్యో, జనవరి 20: ప్రపంచ వృద్ధుడు మాసాజో నోనాక(113) ఆదివారం ఉదయం కన్నుమూశారు. జపాన్‌కు చెందిన ఆయన 1905 జూలై 25న జన్మించారు. గత ఏడాది ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడిగా గుర్తింపు పొందారు. ఉత్తర జపాన్‌లోని అశోరోలో ఆయన కుటుంబం నాలుగు తరాలుగా 'హాట్ స్రింగ్ ఇన్' హోటల్‌ను నిర్వహిస్తోంది. మాసోజా తన తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా ఆ హోటల్ బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పుడాయన మనవరాలు హోటల్ బాగోగులు చూసుకుంటోంది. అదే హోటల్‌లో ఆదివారం ఉదయం మాసాజో సహజ మరణం పొందారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

రిసార్టులో రచ్చ!

- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల బాహాబాహీ
- 'ఆపరేషన్ కమలం'పై తీవ్ర వాగ్వాదం
- మద్యం సీసాతో దాడి... గాయాలతో ఆనంద్‌సింగ్ ఆస్పత్రికి

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కన్నడనాట రాజకీయం రసకందాయంలో పడింది. ఈగల్టన్ రిసార్టులో జరిగిన దాడిలో గాయపడిన ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్ ఆస్పత్రిలో చేరడంతో కాంగ్రెస్, బీజేపీలు మరోసారి నోటికి పనిచెప్పాయి. శనివారం రాత్రి పొద్దుపోయాక రిసార్టులో తీవ్రమైన గొడవ చోటు చేసుకుంది. బళ్లారి జిల్లాకు చెందిన విజయనగర ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్‌పై కంప్లి శాసనసభ్యుడు గణేష్ మద్యం సీసాతో దాడి చేశారు. 'ఆపరేషన్ కమలం' అంశంలో ఇరువురి మధ్య మొదలైన వాగ్వాదం ఈ ఘటనకు కారణమైనట్లు తెలిసింది. మంత్రి తుకారాంతో పాటు భీమానాయక్ కూడా దీనిలో భాగస్వాములైనట్లు సమాచారం. గణేష్ మద్యం బాటిల్‌తో దాడి చేయడంతో ఆనంద్‌సింగ్ తల, కంటికి గాయాలయ్యాయి. దీంతో ఆయన్ను శేషాద్రిపురం అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే ఇద్దరు ఎమ్మెల్యేలు కొట్టుకున్నారన్న వార్తల్లో వాస్తవం లేదని కాంగ్రెస్ కొట్టిపారేసింది. ఛాతీ నొప్పితోనే ఆనంద్‌సింగ్ ఆస్పత్రిలో చేరారని మంత్రి డీకే శివకుమార్ మీడియాకు తెలిపారు. ఇక దాడి జరిపిన ఎమ్మెల్యే గణేష్ ఆదివారం సాయంత్రం వరకూ రిసార్టులోనే గడిపారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీలో పరిస్థితులు దిగజారాయనడానికి ఇంతకంటే రుజువేం కావాలని బీజేపీ ప్రశ్నించింది. అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకోవడానికి ఆపార్టీ బీజేపీపై ఆరోపణలు చేస్తోందని విమర్శించింది. ఈగల్టన్ రిసార్టు భూ ఆక్రమణల వ్యవహారంలో ప్రభుత్వానికి రూ.982కోట్లు జరిమానా చెల్లించాల్సి ఉందని, ఆ డబ్బు వసూలు చేసి రైతు రుణమాఫీకి ఉపయోగించాలని డిమాండ్ చేసింది. అంతర్గత కుమ్ములాటలతోనే కాంగ్రెస్-జేడీఎస్ సర్కారు కుప్పకూలుతుందని బీజేపీ నాయకుడు కేఎస్ ఈశ్వరప్ప వ్యాఖ్యానించారు.

సీఎంతో రాజీనామా చేయించాలి

ఈగల్టన్ రిసార్టులో శనివారం రాత్రి మాజీ సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిపిన సీఎల్పీ సమావేశంలో సీఎం కుమారస్వామితో రాజీనామా చేయించాలని ఏకంగా 20మంది ఎమ్మెల్యేలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయమై మరోసారి కలుద్దామంటూ సిద్దరామయ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. కాగా, సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన నలుగురు ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇదిలా ఉండగా, ఆపరేషన్ కమలంలో భాగంగా గురుగ్రాంలోని రిసార్టులో బసచేసిన బీజేపీ ఎమ్మెల్యేలు సొంత ప్రాంతాలకు చేరుకున్నారు. కాంగ్రెస్ తన ఎమ్మెల్యేలను రిసార్టులోనే ఉంచాలని తీర్మానించినట్లు సమాచారం. నెలాఖరులో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ఆలోచనలో ఉందన్న సమాచారంతోనే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. కాగా, సిద్దరామయ్యకు క్విడ్ ప్రోకోలో భాగంగా కాంగ్రెస్ శాసనసభ్యుడు బైరాటి సురేశ్ నుంచి రూ.1.8 కోట్ల బెంజ్ కారు బహుమతిగా ముట్టిందని బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది.

ఇక 'పాస్‌పోర్టు'లా ఆధార్‌కార్డు

- నేపాల్, భూటాన్ పర్యటనకు చెల్లుబాటు

న్యూఢిల్లీ, జనవరి 20: ఆధార్‌కార్డు పాస్‌పోర్టులా కూడా ఉపయోగపడనుంది. నేపాల్, భూటాన్ పర్యటనకు వెళ్లే 15 ఏళ్లలోపు చిన్నారులకు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు చెల్లుబాటయ్యే ట్రావెల్ డాక్యుమెంటులా ఆధార్‌కార్డు ఉపయోగపడుతుందని భారత హోంశాఖ తాజా ప్రకటన వెల్లడించింది. ఆ మేరకు నిబంధనలు సడలించినట్టు తెలిపింది. అయితే 15-65 మధ్య వయసున్న వారు మాత్రం ఆధార్‌కార్డును ఈ ప్రయోజనానికి వినియోగించుకోలేరని స్పష్టం చేసింది. ప్రస్తుతం చెల్లుబాటులో ఉన్న పాస్‌పోర్టు, లేదా ఓటరు గుర్తింపుకార్డు ఉన్న భారతీయులకు ఈ రెండు దేశాల పర్యటనకు వెళ్లేందుకు వీసా అవసరం లేదు. అయితే, 15 ఏళ్ల లోపు, 65 ఏళ్ల పైబడినవారు పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్‌కార్డు, సీజీహెచ్‌ఎస్(కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం)కార్డులలో ఏదో ఒకటి చూపిస్తే ఆ దేశాల్లోకి అనుమతించేవారు. ఇప్పుడు తాజాగా ఆ జాబితాలోకి ఆధార్‌కార్డును కూడా చేర్చినట్టు హోంశాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.

అయ్యప్ప ఆలయం మూసివేత

శబరిమల/తిరువనంతపురం, జనవరి 20: శబరిమల అయ్యప్ప ఆలయం మూతపడింది. అన్ని వయసుల మహిళలకు ఆలయ ప్రవేశంపై దాదాపు 2నెలలకు పైగా సాగిన అసాధారణమైన నిరసనల అనంతరం ఈ ప్రాంతంలో ప్రశాంతత నెలకొంది. ఆనవాయితీ ప్రకారం పందళం రాజకుటుంబీకులు రాఘవ వర్మ రాజా దర్శనం చేసుకున్న తర్వాత స్వామికి భస్మాభిషేకం నిర్వహించారు. 'హరివరాసనం' గీతాన్ని ఆలపిస్తూ ఉదయం 6.15గంటలకు ఆలయ ద్వారాలను మూసివేశారు. దీంతో 67రోజుల పాటు సాగిన వార్షిక తీర్థయాత్ర సీజన్ ముగిసింది. ఫిబ్రవరి 13న మాస పూజల కోసం తిరిగి ఆలయాన్ని తెరవనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా, అయ్యప్ప ఆలయం మూతపడటంతో గత 49రోజులుగా తిరువనంతపురంలో సచివాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే దీక్షలను బీజేపీ విరమించింది. సంఘ్ పరివార్ చేపట్టిన 'శబరిమల ఆందోళన' పూర్తిగా విఫలమైందని సీఎం పినరయి విజయన్ అన్నారు.

స్వల్పంగా పెరిగిన పెట్రోలు, డీజిల్ ధర

న్యూఢిల్లీ, జనవరి 20 : పెట్రోలు, డీజిల్ ధరలు ఆదివారం మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో లీటరు పెట్రోలు ధర 23 పైసలు, డీజిల్ 31 పైసల మేర పెరిగాయి. జనవరి 1 నుంచి ఇప్పటివరకు పెట్రోలు, డీజిల్ ధర రూ.2 చొప్పున ఎగబాకింది. దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర రూ.70.95కి చేరగా, డీజిల్ ధర రూ.65.45కు పెరిగింది.

కొత్త ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతుల్లేవ్

(మూడోపేజీ తరువాయి)

ప్రతీ రెండేళ్లకోసారి సమీక్ష నిర్వహించనుంది. ఇంజనీరింగ్ కళాశాలల ప్రక్షాళన, నాణ్యమైన సాంకేతిక విద్యపై ప్రముఖ ఐటీ సంస్థ సెయింట్ ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు, ఐఐటీ-హైదరాబాద్ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసుల మేరకు ఈ నిర్ణయాన్ని తీసుకుంది. కొత్త కాలేజీలకు అనుమతివ్వకుండా ఇప్పుడున్న కాలేజీల్లోనే నాణ్యమైన విద్యనందించేందుకు బోధన సామర్థ్యాన్ని పెంచాలని కమిటీ సిఫారసు చేసింది. కాలేజీల్లో కొత్త టెక్నాలజీ కోర్సులు పెట్టాలని సూచించింది. ఏఐ, బ్లాక్‌చైన్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా సైన్సెస్, సైబర్ సెక్యూరిటీ, 3డీ ప్రింటింగ్-డిజైన్ వంటి టెక్నాలజీలపై అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలోనే కోర్సులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేసింది. సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సుల కంటే కంప్యూటర్ సైన్స్, మెకట్రానిక్స్, ఎయిరోస్పేస్ కోర్సులకు డిమాండ్ ఎక్కువుందని, అందువల్ల సంప్రదాయ కోర్సుల్లో సీట్లును పెంచొద్దని సిఫారసు చేసింది. విద్యార్థులకు పరిశ్రమల్లో అప్రెంటిషిప్ చేయడం తప్పసరి చేయాలని, ప్రతీ విద్యాసంస్థ సలహా మండలిలో ఇద్దరు పారిశ్రామిక ప్రతినిధులు ఉండాలని స్పష్టం చేసింది. అటల్ ఇన్నోవేషన్ లాబొరేటరిస్ తరహాలో ప్రతీ కాలేజీలో థింకరింగ్ లాబొరేటరిస్‌ను ఏర్పాటు చేయాలని, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఇంక్యుబేషన్ సెంటర్లను, మానిటరింగ్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది.

నెలనెలా ఖాతాలో డబ్బు

సిక్కింలో సార్వత్రిక కనీస ఆదాయ పథకం... తరతమ భేదాలు లేకుండా పౌరులందరికీ లబ్ధి

ప్రకటించిన ఎస్‌డీఎఫ్ సర్కారు.. 2022కల్లా పథకం అమలు

ఏ రాష్ట్రంలో చూసినా వృద్ధాప్య పింఛన్లు, నిరుద్యోగ భృతి, దివ్యాంగుల, వితంతు పింఛన్లు అంటూ ప్రజలకు ఏదో రకంగా ప్రభుత్వాలు డబ్బులిస్తూనే ఉన్నాయి. అయినా రాష్ట్రంలోని కొంతమందికే ఇలాంటివి చేరుతున్నాయి. ఏదో రకంగా డబ్బులందుతున్నవారు సంతోషంగానే ఉన్నా.. అందని వారి పరిస్థితేంటి? సర్కారు మాపై కూడా కాస్త దయచూపితే బాగుండని ఒక్కసారైనా మనసులో అనుకుంటారు. ఇప్పుడు అలాంటి వారి గురించి కూడా ఆలోచిస్తోంది ఓ రాష్ట్రం! కులం- మతం, ఆడామగ, చిన్నా-పెద్దా అనే తారతమ్యాలు లేకుండా ప్రతిఒక్కరి ఖాతాలో ప్రతినెలా కొంత మొత్తాన్ని జమచేయాలని సంకల్పించింది. వినడానికి విడ్డూరంగా ఉన్నా ఇలాంటివి మనదేశంలో సాధ్యం కాదనిపిస్తోంది కదూ! కానీ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి.. పేదరికం, అసమానతలను రూపుమాపాలని చూస్తోంది. ఆ రాష్ట్రమే సిక్కిం!

ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా రాష్ట్రంలో ఉన్న ప్రతి పౌరుడికి సార్వత్రిక కనీస ఆదాయం (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం - యూబీఐ) అందిస్తామని సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డీఎఫ్) సర్కారు ప్రకటించింది. ఈ పథకం ప్రకారం రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి ప్రతినెలా కొంత మొత్తాన్ని అందించనుంది. ఆ మొత్తం ఎంత అనేది ఇంకా ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది. భారత ఆర్థిక సర్వే-2017లో ఈ పథకం గురించి ప్రస్తావించగా.. సిక్కిం ముఖ్యమంత్రి పవన్ చామ్లింగ్ అప్పటి నుంచే దీనిపై దృష్టి సారించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఆర్థిక వేత్తలతో చర్చలు జరుపుతున్నారు. ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని ప్రకటించారు. ఆర్థిక రంగంలో కాకలు తీరి.. అగ్రరాజ్యాలుగా పేరున్న దేశాలే ఇలాంటి పథకాన్ని అమలు చేయడంలో చతికిలపడిపోయాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచం దృష్టిని సిక్కిం ఆకర్షిస్తోంది. ప్రస్తుతానికి ఏదో ఒక ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి.. 2022కల్లా పూర్తిస్థాయిలో పథకం అమలుకు ముందడుగు వేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నామని వెల్లడించారు. ఈ పథకం అమల్లోకి రాగానే.. పౌరుల బ్యాంకు ఖాతాల్లో ప్రతినెలా ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం జమ కానుంది. రాష్ట్ర జనాభా 6,10,577 కాగా.. ప్రతి పౌరుడిని ఈ పథకం కిందకు తీసుకువచ్చి, లబ్ధి చేకూర్చనున్నారు. నిరుద్యోగులు, గృహిణులు, రైతు కూలీలు, కార్మిక, కర్షక వర్గాలకు ఇది ఓ వరం లాంటిదే.

ఏమిటీ పథకం

ఒక దేశంలో గానీ.. ఒక రాష్ట్రంలో గానీ.. లేదా మారుమూల ప్రాంతాల్లో నివసించే పౌరులందరికీ ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతినెలా అందించే ఆర్థిక సాయాన్ని సార్వత్రిక కనీస ఆదాయ పథకం (యూబీఐ) అంటారు. పేదరికం, అసమానతలను రూపుమాపడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.



అమలు సాధ్యమేనా?

సిక్కింలో అద్భుతమైన వనరులు ఉన్నా.. అభివృద్ధిలో సమర్థ నాయకత్వం లేకపోవడమే ప్రధాన లోపంగా ఆర్థికవేత్తలు చెబుతుంటారు. పౌరులందరికీ యూబీఐ పథకాన్ని అమలు చేయడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చని సిక్కిం ప్రభుత్వం భావిస్తోంది.

-సెంట్రల్ డెస్క్

విదేశాల్లో వైఫల్యాలే..!

సార్వత్రిక కనీస ఆదాయం పథకాన్ని పలు దేశాలు అమలు చేసినా వైఫల్యాలే ఎక్కువగా ఉన్నాయని చరిత్ర చెబుతోంది. కానీ, సిక్కిం విషయంలో తక్కువ జనాభా ఉండటం.. పథకాల అమల్లో సక్సెస్ రేటు కారణంగా ఆ పథకం పక్కాగా అమలవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- 2017 ఏప్రిల్‌లో కెనడాలోని ఒంటారియో రాష్ట్రం ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసింది. 4 వేల మంది పౌరులకు నెలకు 150 మిలియన్ డాలర్లను వెచ్చించింది. ఏడాది తిరక్కుండానే అమలులో సర్కారు చేతులెత్తేసింది.
- రెండేళ్ల క్రితం ఫిన్‌లాండ్ లో ఈ పథకాన్ని అమలు చేశారు. 2 వేల మంది నిరుద్యోగులకు నెలకు 630 డాలర్ల చొప్పున అందజేశారు. గత ఏడాది దాన్ని అర్థంతరంగా నిలిపివేశారు.
- అమెరికాలోని స్టాక్టన్, కాలిఫోర్నియాల్లో 100 కుటుంబాలకు నెలకు 500 డాలర్ల చొప్పున ఇచ్చారు. ఆ పథకం 18 నెలలకే పరిమితమైంది.
- సిలికాన్ వ్యాలీలో యువతను ప్రోత్సహించేందుకు ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకెర్‌బర్గ్, స్పేస్-ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌లు ప్రోత్సాహకాలను ప్రకటించి.. కొంతకాలమే అమలు చేయగలిగారు.
- ఈ తరహా పథకాలు స్టాక్టన్ వంటి నగరాల్లో ఆచరణలో సాధ్యం కాకపోవచ్చు కానీ.. సిక్కిం లాంటి రాష్ట్రాల్లో సుసాధ్యమేనని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రొఫెసర్, ఆర్థికవేత్త ప్రణబ్ బర్దన్ చెప్పారు.

సిక్కిం విజయాలివీ..



- 1998 నుంచి ప్లాస్టిక్ బ్యాగుల నిషేధాన్ని విజయవంతంగా అమలు చేస్తోంది.
- 98% అక్షరాస్యతను సాధించింది. దేశంలో పేదరికం 30% ఉండగా.. సిక్కింలో అది 8 శాతంగా ఉంది.
- దేశంలోనే.. రసాయన ఎరువులపై నిషేధాన్ని అమలు చేస్తూ ఆర్గానిక్ పంటలు పండిస్తున్న రాష్ట్రంగా గుర్తింపు పొందింది.
- ప్రతి పౌరుడిని గృహనిర్మాణ పథకం పరిధిలోకి తెచ్చి అందరికీ ఇళ్లను కట్టి ఇచ్చింది.
- ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత పథకాలను సమర్థంగా అమలు చేస్తోంది.
- విద్యుత్తు ప్రాజెక్టులు, పర్యాటకం సిక్కిం ప్రధాన ఆదాయ వనరులు. మిగులు విద్యుత్తులో అన్ని రాష్ట్రాలకంటే ముందుంది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే జల విద్యుత్తులో 90 శాతాన్ని ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తోంది. ఏటా 25 లక్షల మంది పర్యాటకులు ఈ రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారు.



మాఘ మాసం సందర్భంగా అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేసిన పుణ్యస్నాన కార్యక్రమంలో ఒకరిపై ఒకరు కుండలతో నీరు పోసుకుంటున్న విద్యార్థులు

జైలులోనూ శశి'కళే'

- ఆమెకు ఏ-క్లాస్ సదుపాయాలు... ఒక్కరికే 5 గదులు కేటాయింపు
- వంటకోసం ప్రత్యేక ఏర్పాట్లు.. గుంపులుగా సందర్శకులకు అనుమతి
- నిర్ధారించిన దర్యాప్తు కమిటీ... కర్ణాటక ప్రభుత్వానికి నివేదిక



చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళకు బెంగళూరు పరప్పన అగ్రహారం జైల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏ-క్లాస్ సదుపాయాలు కల్పించిన విషయం వాస్తవమేనని దర్యాప్తు కమిటీ నిర్ధారించింది. ఆ మేరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వినయకుమార్ నేతృత్వంలోని కమిటీ కర్ణాటక ప్రభుత్వానికి రెండు నెలల కిందట సమర్పించిన 295 పేజీల నివేదికలోని వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కార్యకర్త నర్సింహమూర్తి ఆర్టీఐ దరఖాస్తు ద్వారా అడిగిన ఈ సమాచారాన్ని హోంశాఖ పీఆర్‌వో ఎంఆర్ శోభ అందజేశారు. 2017 ఫిబ్రవరి 14న జైల్లో అడుగుపెట్టక ముందే ఆమె కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించారని కమిటీ నివేదిక స్పష్టంచేసింది. ఐదు గదులను ఒక కారిడార్‌లా మలిచి ఆమె ఉపయోగించుకునేందుకు సౌకర్యాలు కల్పించారని వివరించింది. ప్రత్యేకంగా వంట చేసుకోడానికి, గుంపులుగా సందర్శకులతో మాట్లాడేందుకు కూడా అనుమతించారని పేర్కొంది. అప్పటి జైళ్లశాఖ డీఐజీ రూప తనిఖీలు జరిపినప్పుడు శశికళకు ప్రత్యేక సదుపాయాలు గుర్తించి వీడియో ఆధారాలతో సహా ఏసీబీ అధికారులకు, జైళ్ల శాఖ డీజీపీకి పంపారు. ఆ తర్వాత రూపను రవాణాశాఖకు బదిలీ చేశారు. రూప సమర్పించిన ఆధారాలపై సమగ్రంగా దర్యాప్తు జరిపేందుకు కర్ణాటక ప్రభుత్వం వినయకుమార్ కమిటీని నియమించింది.

'జల్లికట్టు' గిన్నిస్ రికార్డ్!

- 2 వేల ఎద్దులు, 550 మంది పోటీదారులు
- లక్షకు పైగా వీక్షకులు... గాయాలతో ఇద్దరి మృతి
- ప్రధాన మంత్రి బీమా కింద రూ.2 లక్షలు అందజేత



చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో నిర్వహించే సంప్రదాయ జల్లికట్టు సాహస క్రీడ గిన్నిస్ రికార్డు సృష్టించింది. పుదుకోట జిల్లా విరాలిమలైలో ఆదివారం నిర్వహించిన జల్లికట్టులో 2 వేల పోట్లగిత్తలతో 550 మంది యువకులు పోటీ పడ్డారు. ఈ క్రీడను వీక్షించేందుకు 30 వేల మంది విదేశీయులు, లక్ష మందికిపైగా స్థానికులు వచ్చారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 5 గంటల వ్యవధిలో 647 పోట్లగిత్తలు పరుగులు తీయడం రికార్డు కాగా, 5 గంటల వ్యవధిలో 2వేల పోట్లగిత్తలతో విరాలిమలై జల్లికట్టు ఆ రికార్డును బద్ధలు గొట్టింది. ఈ విషయాన్ని ఆదివారం సాయంత్రం గిన్నిస్ బుక్ బృందం అధికారికంగా ప్రకటించింది. కాగా, విరాలిమలైలో జల్లికట్టు క్రీడను ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంలు ప్రారంభించి, ఆసక్తిగా తిలకించారు. జల్లికట్టులో పోట్లగిత్తల దాడి కారణంగా ఇద్దరు యువకులు మృతిచెందగా, 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ క్రీడలో పాల్గొన్న యువకుల నుంచి తొలిసారిగా రూ.12 కట్టించుకుని ప్రధాన మంత్రి బీమా యోజన పథకాన్ని అమలు చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం అందించారు.

ట్రాన్స్‌జెండర్ కంటే మాయావతి దారుణం

- ఆమె ఆడా కాదు... మగా కాదు... బీజేపీ ఎమ్మెల్యే సాధనా సింగ్ వ్యాఖ్యలు



చందౌలీ, జనవరి 20: బీఎస్పీ అధినేత్రి మాయావతి ట్రాన్స్‌జెండర్ కంటే దారుణమని, స్త్రీ జాతికి మచ్చ అని యూపీలోని మొఘల్‌సరాయ్ ఎమ్మెల్యే సాధనాసింగ్ ఓ సభలో నోరుపారేసుకున్నారు. 1995లో మాయావతిపై సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తల దాడి ఘటనను ఉటంకిస్తూ సాధనా సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "అధికారం కోసం మాయావతి తనను అగౌరవపరచిన వారితోనే చేతులు కలిపారు. ఆమె ఆడా కాదు మగా కాదు. ఆమె ట్రాన్స్‌జెండర్ కంటే హీనం" అంటూ కించపరిచారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మిత్రపక్షాలు, ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీజేపీలో నెలకొన్న నిరాశకు, భయానికీ మాయావతిపై అగౌరవ వ్యాఖ్యలు నిదర్శనమని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ ఆఠవలే కూడా సాధనాసింగ్ వ్యాఖ్యలను ఖండించారు. మరో వైపు సాధనా సింగ్‌ను వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయనున్నట్లు జాతీయ మహిళా కమిషన్ ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సాధనా సింగ్ క్షమాపణలు తెలిపారు. కాగా, వారణాసిలో బీఎస్పీ నాయకులు సాధనా సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాహుల్.. నీ 'మహా కులాసా'ను బయటపెడతా

- శ్రీకాంత్ జెనా ఫైర్... ఒడిసా కాంగ్రెస్‌లో ముదురుతున్న సంక్షోభం



భువనేశ్వర్, జనవరి 20: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి టార్గెట్ చేశారు. ఒడిసా కాంగ్రెస్ నేత శ్రీకాంత్ జెనా ఆదివారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర నాయకత్వంపై విరుచుకుపడ్డారు. "రాహుల్ 25న రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని తెలిసింది. ఆ రోజు ఆయన సంగతి బయటపెడతాను" అని హెచ్చరించారు. అయితే కాంగ్రెస్ అధినేతకు చెందిన ఆ 'మహా కులాసా' అంశం ఏమిటన్నది చెప్పడానికి ఆయన నిరాకరించారు. ఆయన తన ఆరోపణలను కొనసాగిస్తూ, "రాష్ట్ర కాంగ్రెస్ మైనింగ్ మాఫియా చేతుల్లో ఉంది. రాహుల్ కూడా పార్టీని ఆ మాఫియా చేతుల్లోనే ఉంచదలిచారు. ఒడిసా అధికార పగ్గాలు పట్నాయక్ కుటుంబం ఉండాలని భావిస్తున్నారు" అంటూ విరుచుకుపడ్డారు. కాగా.. శనివారం రాత్రి పొద్దుపోయిన తరువాత జెనా, మాజీ ఎమ్మెల్యే కృష్ణచంద్రలను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది.




అపర్ణ కుమార్

దక్షిణధ్రువంపై కాలుమోపిన.. తొలి మహిళా ఐపీఎస్

- డీఐజీ అపర్ణ కుమార్ అరుదైన ఘనత

న్యూఢిల్లీ, జనవరి 20: ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసు (ఐటీబీపీ) డీఐజీ అపర్ణకుమార్ అరుదైన ఘనత సాధించారు. ఇప్పటికే ఆరు ఖండాల్లోని ఎత్తైన పర్వతాలను అధిరోహించిన ఆమె.. దక్షిణధ్రువంపై కాలుమోపిన మొదటి మహిళా ఐపీఎస్‌గా గుర్తింపు పొందారు. ఈనెల 13న ఆమె ఈ ఘనత సాధించారు. మంచులో 35 కిలోల బరువును మోసుకుంటూ.. దాదాపు 111 కిలోమీటర్లు కాలినడకన పయనించిన అపర్ణ.. భౌగోళిక దక్షిణ ధ్రువాన్ని చేరుకుని, అక్కడ భారత్, ఐటీబీపీ జండాలను పాతారు. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అపర్ణను అభినందించారు.


ఫెడరర్

పాపం రోజర్ ఫెడరర్.. రికార్డు స్థాయిలో ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ అందుకోవాలన్న స్విస్ దిగ్గజానికి ఊహించని పరాభవం ఎదురైంది. గ్రీస్‌కు చెందిన 20 ఏళ్ల స్టెఫనోస్ టిట్సిపాస్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఫెడెక్స్‌కు షాకిచ్చాడు. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అతి పిన్న వయస్సులో టాప్-20లో చోటు దక్కించుకొన్న స్టెఫనోస్ ఆ స్థానానికి న్యాయం చేస్తూ కెరీర్‌లోనే అతిపెద్ద విజయం సాధించాడు. గ్రాండ్‌స్లామ్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన తొలి గ్రీస్ ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఆదివారం ఆటలో మరో ముగ్గురు స్టార్లకూ చుక్కెదురైంది. మహిళల రెండో సీడ్ కెర్బర్, ఐదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్, ఐదు గ్రాండ్‌స్లామ్‌ల విజేత మరియా షరపోవా ఇంటిదారి పట్టారు. టైటిల్ ఫేవరెట్ రఫెల్ నడాల్ అలవోకగా నాలుగో రౌండ్‌ను అధిగమించాడు.

2001 వింబుల్డన్ నాలుగో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పీట్ సంప్రాస్‌పై గెలిచినప్పుడు ఫెడరర్ వయసు 20 ఏళ్లు. ఇప్పుడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫెడరర్‌ను ఓడించిన టిట్సిపాస్ వయసు కూడా ఇరవై ఏళ్లే కావడం విశేషం.

2

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫెడరర్ క్వార్టర్‌ఫైనల్ చేరకపోవడం 16 ఏళ్లలో ఇది రెండోసారి మాత్రమే. అంతకుముందు 2015లో మూడో రౌండ్‌లో ఓడాడు.

‘ఫెడెక్స్.. వీడ్కోలెప్పుడు?’

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో యువ ఆటగాడు టిట్సిపాస్ చేతిలో ఓడడంతో.. స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ రిటైర్మెంట్‌పై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఓటమి అనంతరం సోషల్ మీడియాలో ఫెడెక్స్ రిటైర్మెంట్‌పైనే ఎక్కువగా చర్చ సాగింది. రోజర్.. ఇక టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పాలని చాలా మంది అభిప్రాయపడ్డారు. ‘ఫెడెక్స్ ఇంకా ఎందుకు ఆడుతున్నాడో? తనతోపాటు తన ఫ్యాన్స్‌నూ నిరాశ పరుస్తున్నాడ’ని ఓ అభిమాని పోస్ట్ చేశాడు. ఫెడరర్ ఇలా ఓడడం చాలా బాధగా ఉందని.. సొంత గడ్డపై బాసెల్ టోర్నీతో ఆటకు వీడ్కోలు పలికితే బాగుంటుంద’ని మరో అభిమాని వ్యాఖ్యానించాడు.


స్విటోలినా, మోన్‌ఫిల్స్

మెల్‌బోర్న్‌లో లవ్‌బర్డ్స్!

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రస్తుతం అందరి దృష్టీ కొత్త ప్రేమికులు గేల్ మోన్‌ఫిల్స్, ఎలినా స్విటోలినాలపైనే. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో స్విటోలినాకు మద్దతిచ్చేందుకు వచ్చిన మోన్‌ఫిల్స్.. ప్లేయర్ బాక్స్‌లో కనిపించడంతో వీరి ప్రేమాయణం నిర్ధారణ అయింది. దీంతో ఫ్రెంచ్ స్టార్ మోన్‌ఫిల్స్‌తో డేటింగ్‌లో ఉన్నట్టు ఉక్రెయిన్ బ్యూటీ స్విటోలినా గతవారమే వెల్లడించింది. ‘అతడు నాకోసమే వచ్చాడు. నాకు మద్దతుగా ఉన్నాడు. అలాగే నేను కూడా అతడి మ్యాచ్‌లకు వెళ్లి మద్దతు పలుకుతాను. మేమిద్దరం ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకున్నాం’ అంటూ తమ లవ్ ఎఫైర్‌పై స్విటోలినా మనసు విప్పింది. అలాగే ఇద్దరూ కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో ‘జెమ్స్ (జీ.ఈ.ఎం.ఎస్) లైఫ్’ పేరిట ఖాతా తెరిచి తమ దైనందిన షెడ్యూల్‌పై వీడియోను కూడా పోస్ట్ చేశారు.


స్టెఫనోస్ టిట్సిపాస్

కల చెదిరె


● ప్రీక్వార్టర్స్‌లో ఫెడరర్‌కు షాక్ ● గ్రీస్ కుర్రాడి సంచలనం
● కెర్బర్, షరపోవా కూడా అవుట్ ● ఆస్ట్రేలియన్ ఓపెన్




షరపోవా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల విభాగంలో అతిపెద్ద సంచలనం. గత రెండుసార్లు చాంపియన్, వరుసగా మూడో ఏడాదీ టైటిల్ రేసులో అగ్రభాగాన నిలిచిన 20 గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ రోజర్ ఫెడరర్‌కు షాక్ తగిలింది. గ్రీస్‌కు చెందిన 14వ సీడ్ టిట్సిపాస్ 6-7 (13), 7-6 (3), 7-5, 7-6 (5)తో 37 ఏళ్ల ఫెడరర్‌ను చిత్తుచేశాడు. రోజర్ కంటే 17 ఏళ్లు చిన్నవాడైన స్టెఫనోస్ తన సంచలన విజయం క్రమంలో 12 బ్రేక్ పాయింట్లు కాచుకోవడం విశేషం. ఈనెలలోనే జరిగిన హాప్‌మన్ కప్‌లో తొలిసారి ఫెడరర్‌తో తలపడ్డ టిట్సిపాస్ ఆ మ్యాచ్‌లో ఓడినా.. మెల్‌బోర్న్‌లో మాత్రం అద్భుత ప్రదర్శనతో ఫలితాన్ని రాబట్టాడు. మొదటి సెట్ టైబ్రేక్‌లో ఫెడరర్ 12--11తో ఆధిక్యంలో ఉన్న దశలో టిట్సిపాస్ కొట్టిన ఫోర్‌హ్యాండ్ షాట్‌ను అభిమాని ఒకరు ‘అవుట్’ అని గట్టిగా అరవడం వివాదం రేపింది. తర్వాత స్టెఫనోస్ ఫోర్‌హ్యాండ్ షాట్‌ను తప్పుగా కొట్టడంతో తొలిసెట్ ఫెడరర్ సొంతమైంది. రెండోసెట్‌లో ఫెడెక్స్ ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినా టిట్సిపాస్ సమర్థంగా ఎదుర్కొన్నాడు. రెండో సెట్ టైబ్రేకర్‌కు చేరే సమయానికే ఫెడరర్ 10 బ్రేక్ పాయింట్లను తిప్పికొట్టిన స్టెఫనోస్‌కు ‘బ్రేక్’లో ఎదురు లేకపోయింది. ఆ తర్వాత ఫెడరర్ పదేపదే అనవసర తప్పిదాలు చేసి మూడో సెట్ చేజార్చుకున్నాడు. బాగా వేడి కారణంగా అలిసి పోయిన టిట్సిపాస్ నాలుగో సెట్ ఏడో గేమ్‌లో ట్రెయినర్‌తో చికిత్స తీసుకున్నాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయిన ఫెడరర్ మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫలితంగా మెల్‌బోర్న్ పార్క్‌లో 17 మ్యాచ్‌ల ఫెడరర్ విజయ పరంపరకు బ్రేక్ పడింది. మూడున్నర గంటల పోరులో ఫెడరర్ 12 ఏస్‌లు సంధించి 61 విన్నర్లు కొట్టాడు. 55 అనవసర తప్పిదాలు చేశాడు. ఇక ఏకంగా 20 ఏస్‌లు వేసిన స్టెఫనోస్ 62 విన్నర్లు కొట్టి, 36 అనవసర తప్పిదాలకు పాల్పడ్డాడు. ‘నా కంటే మెరుగైన ఆటగాడి చేతిలో ఓడిపోయా’ అని తన ఓటమిని ఫెడరర్ హుందాగా అంగీకరించాడు. గ్రాండ్‌స్లామ్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన తొలి గ్రీస్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించిన స్టెఫనోస్.. సెమీస్ బెర్త్‌కోసం 22వ సీడ్ రాబెర్టో బౌటిస్టా అగట్ (స్పెయిన్)ను ఢీకొంటాడు. ఐదుసెట్ల హోరాహోరీ పోరులో అగట్ 6-7 (8), 6-3, 6-2, 4-6, 6-4తో నిరుటి రన్నరప్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)ను కంగుతినిపించాడు. 18వ గ్రాండ్‌స్లామ్ దిశగా రఫెల్ నడాల్ మరో అడుగు వేశాడు. ప్రీక్వార్టర్స్‌లో స్పెయిన్ బుల్ 6-0, 6-1, 7-6 (4)తో బెర్డిచ్ (చెక్‌రిపబ్లిక్)పై గెలిచి ఫ్రాన్సెస్ టియాఫో (అమెరికా)తో అమీతుమీకి సిద్ధమయ్యాడు. అన్‌సీడెడ్ టియాఫో 7-5, 7-6 (6), 6-7 (7), 7-5తో 20వ సీడ్ గ్రిగార్ డిమిత్రోవ్ (బల్గేరియా)ను ఓడించాడు.

కెర్బర్, స్టీఫెన్స్‌కు షాక్: మహిళల్లో రెండో సీడ్ కెర్బర్ (జర్మనీ), ఐదోసీడ్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా), మాజీ చాంపియన్ షరపోవాలకు నిరాశ ఎదురైంది. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడుతున్న అమెరికన్ డానిలీ రోజ్ కొలిన్స్ 6-0, 6-2తో 2016 చాంపియన్ కెర్బర్‌ను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో రష్యన్ అన్‌సీడెడ్ అనస్తాసియా పవ్ల్యుచెన్కోవా 6-7 (7), 6-3, 6-3తో 2017 యూఎస్ ఓపెన్ విజేత స్టీఫెన్స్‌ను మట్టికరిపించింది. 15వ సీడ్ యాష్లీ బార్తీ (ఆస్ట్రేలియా) 4-6, 6-1, 6-4తో మాజీ చాంపియన్ షరపోవా ఆశలకు గండికొట్టింది. క్వార్టర్స్‌లో క్విటోవాతో బార్తీ తలపడనుంది. 8వ సీడ్ క్విటోవా 6-2, 6-1తో అమందా అనిస్మోవా (అమెరికా)పై నెగ్గింది.


కెర్బర్

యాష్లీ బార్తీ.. క్రికెట్‌లోనూ మేటి!

యాష్లీ బార్తీ..ఈ ఆస్ట్రేలియన్ భామ అటు టెన్నిస్‌తోపాటు ఇటు క్రికెట్‌లోనూ అరితేరిన ప్లేయర్. టెన్నిస్ మహిళల డబుల్స్‌లో ఇప్పటికే యూఎస్ ఓపెన్ టైటిల్ సాధించింది. తాజాగా సింగిల్స్‌లో అందాల తార షరపోవాను కంగుతినిపించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. 2014లో 20 ఏళ్ల వయస్సుకే టెన్నిస్‌లో సత్తా చాటిన బార్తీ.. తరచూ ప్రయాణాలు చేయాల్సి రావడంతో విసుగుచెంది ఆ ఆటకు కొద్దికాలం గుడ్‌బై చెప్పింది. ఆ వెంటనే క్రికెట్‌లో అడుగుపెట్టింది. టెన్నిస్‌లో సింగిల్స్, డబుల్స్ ఆడిన మాదిరే క్రికెట్‌లో బ్యాటింగ్, మీడియం పేస్ బౌలింగ్‌తో రాణించింది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో బ్రిస్బేన్ హీట్ జట్టు తరపున టీ20 అరంగేట్ర మ్యాచ్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ జట్టుపై 27 బంతుల్లో 39 పరుగులు చేసి అదరగొట్టింది. 2017 నుంచి మళ్లీ టెన్నిస్ ఆడుతోంది.

యూట్యూబ్‌లో వీడియోలు చూసి..

స్టెఫనోస్ టిట్సిపాస్.. ప్రస్తుతం టెన్నిస్ ప్రపంచంలో మార్మోగుతున్న పేరు. దిగ్గజ ఆటగాడు రోజర్ ఫెడరర్‌ను కంగుతినిపించిన ఇతడిని అంతా ‘గ్రీకు వీరుడు’ అని ప్రస్తుతిస్తున్నారు. ఫెడరర్ తొలి గ్రాండ్‌స్లామ్ (వింబుల్డన్ జూనియర్) నెగ్గే సమయానికి టిట్సిపాస్ భూమిమీద పడనే లేదు. తండ్రి గ్రీస్‌కు చెందినవాడు కాగా తల్లి రష్యా దేశస్థురాలు. 1998లో జన్మించిన అతడు మూడేళ్ల వయస్సులోనే రాకెట్ చేతబట్టినా ఆరేళ్ల వయస్సులో పూర్తిగా టెన్నిస్‌పై దృష్టి నిలిపాడు. జూనియర్‌గా వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్ సాధించిన టిట్సిపాస్.. 2016 వింబుల్డన్ బాలుర డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 2017లో ఏటీపీ ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించిన స్టెఫనోస్ 2018లో నెక్స్ట్‌జెన్ ఫైనల్స్ చాంపియన్‌గా నిలిచాడు. తాను ఎంతో ఆరాధించే రోజర్ ఫెడరర్‌పై గెలిచేందుకు స్టెఫనోస్ పెద్ద కసరత్తే చేశాడు. ఫెడెక్స్ మ్యాచ్‌లను పదేపదే యూట్యూబ్‌లో వీక్షిస్తూ అతడి ఆట తీరును ఆకళింపు చేసుకున్నాడు. దీంతో రోజర్ బలాలు బలహీనతలపై చక్కటి అవగాహన ఉన్న స్టెఫనోస్ అవే ఆయుధాలుగా స్విస్‌గ్రేట్‌ను దెబ్బకొట్టాడు. మొత్తంగా.. ఫెడరర్‌ను ఓడించాలన్న తన కలను అనతి కాలంలోనే నెరవేర్చుకున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



బజరంగ్ అదుర్స్

లూథియానా: స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా ఆఖరి బౌట్‌లో అదరగొట్టడంతో.. ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో పంజాబ్ రాయల్స్ మరో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ రాయల్స్ 4-3తో ఢిల్లీ సుల్తాన్స్‌ను ఓడించింది. నిర్ణాయక మ్యాచ్‌లో బజరంగ్ 9-0తో ఆంద్రే వియాట్‌కోవిష్కీపై గెలిచి పంజాబ్‌కు విజయాన్ని అందించాడు. మహిళల 62 కిలోల్లో ఢిల్లీ రెజ్లర్ సాక్షి మాలిక్ 11-0తో అనితపై నెగ్గి మ్యాచ్ ఫలితాన్ని చివరి బౌట్ వరకు తీసుకెళ్లింది. అంతకు ముందు 74 కిలోల విభాగంలో కీతిక్ సబలోవ్ 16-0తో వినోద్ కుమార్‌పై నెగ్గి ఢిల్లీకి మంచి ఆరంభాన్నిచ్చాడు. కానీ తర్వాత జరిగిన మహిళల 76 కిలోల్లో పంజాబ్ రెజ్లర్ సయంతియా వెస్కాన్ 2-1తో సుసోస్టవా అనస్టాసియాపై గెలిచి 1-1తో స్కోరు సమం చేసింది. 86 కిలోల్లో ఢిల్లీ రెజ్లర్ ప్రవీణ్ రాణాను డాటో మార్గషివెలి నాకౌట్ చేసి పంజాబ్‌ను 2-1తో ఆధిక్యంలో నిలిపాడు. నాలుగో బౌట్‌లో ఢిల్లీ రెజ్లర్ పింకి 9-4తో అంజుపై నెగ్గి మరోసారి స్కోరు సమం చేసింది. 125 కిలోల్లో పంజాబ్ ప్లేయర్ కోరె జార్విస్ 7-2తో సతేందర్ మాలిక్‌పై గెలిచాడు.

సింగిల్స్ చాంప్ పుల్లెల గాయత్రి


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కొన్నాళ్లుగా అద్భుతఫామ్‌తో అదరగొడుతున్న యువ తెలుగు షట్లర్ పుల్లెల గాయత్రి గోపీచంద్ మరో టైటిల్‌తో సత్తాచాటింది. బెంగళూరులో జరిగిన ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో గాయత్రి అండర్-19 విభాగంలో మహిళల సింగిల్స్‌లో చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్ గాయత్రి 21-12, 21-13తో రెండోసీడ్ ఉన్నతి బిస్త్‌ను వరుసగేముల్లో చిత్తు చేసి ట్రోఫీని అందుకుంది. మరో తెలుగు ఆటగాడు నవనీత్ బొక్కా డబుల్స్, మిక్స్‌డ్‌లో విజేతగా నిలిచి ‘డబుల్’ సాధించాడు. అండర్-19 బాలుర డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ నవనీత్- విష్ణువర్ధన్‌గౌడ్ ద్వయం 18-21, 21-13, 21-12తో రెండోసీడ్ మన్‌జీత్ సింగ్-డింకూ సింగ్ జంటను ఓడించింది. మిక్స్‌డ్ టైటిల్‌పోరులో నవ్‌నీత్-సాహితి జోడీ 21-10, 21-18తో రవికృష్ణ-వర్షిణి జంటపై గెలిచింది.



అంపైర్‌కు తప్పిన ‘స్పైడర్’ ముప్పు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో స్పైడర్ కెమెరా ప్రమాదం నుంచి చైర్ అంపైర్ త్రుటిలో బయటపడింది. రష్యన్ బ్యూటీ మరియా షరపోవా, యాష్లీ బార్తీ మధ్య ప్రీ క్వార్టర్స్ మ్యాచ్ సందర్భంగా ఈ ప్రమాదం జరిగింది. అప్పర్ వ్యూ కోసం ఉపయోగించే స్పైడర్ కెమెరా అదుపుతప్పి అంపైర్ అలిసన్ హ్యూజెస్ కూర్చున్న చైర్ పైకప్పును కూల్చేసింది. అలిసన్ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడిందని.. లేకపోతే కెమెరా ఆమె తలను బలంగా తాకేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.




వెంగ్‌సర్కార్

క్రికెటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలి

ముంబై: యువ ఆటగాళ్లు నియంత్రణ కోల్పోకుండా ఉండేందుకు బీసీసీఐతో పాటు ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల సహచర ఆటగాడితో అనుచితంగా ప్రవర్తించాడనే కారణంతో ముంబై అండర్-16 కెప్టెన్ ముషీర్ ఖాన్‌పై ఎంసీఏ మూడేళ్ల నిషేధం విధించింది. దీంతో 14 ఏళ్ల ముషీర్ 2022 వరకు క్రికెట్‌కు దూరంగా ఉండాల్సిందే. ఈ నేపథ్యంలోనే వెంగీ పై విధంగా స్పందించాడు.

కోహ్లీయే అత్యుత్తమం!

న్యూఢిల్లీ: వన్డే ఫార్మాట్ చరిత్రలోనే భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ ప్రశంసించాడు. ‘నా అభిప్రాయం ప్రకారం కోహ్లీని మించిన ఆటగాడు వన్డే చరిత్రలో లేడు. భారత్ తరపున అతడు సాధించిన రికార్డులను గమనిస్తే ఈ విషయం తెలుస్తుంది. మ్యాచ్‌లను గెలిచేందుకు అతడు పడే తాపత్రయాన్ని మనం గౌరవించాలి. కోహ్లీకి దూకుడెక్కువ కానీ అతని అంకితభావాన్ని, సాధించిన ఘనతలను ఎవరూ ప్రశ్నించలేరు. అందుకే వన్డేల్లో అతడే బెస్ట్’ అని క్లార్క్ తేల్చాడు. మరోవైపు ధోనీ మ్యాచ్ పరిస్థితులకు తగ్గట్టు ఆడే బ్యాట్స్‌మన్ అని, ప్రపంచకప్‌లో అతడు ఏ స్థానంలో బ్యాటింగ్ చేసినా రాణిస్తాడని చెప్పాడు. ఇక ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న హార్దిక్ పాండ్యా జట్టులో ఉంటే సమతూకంగా ఉంటుందని, కచ్చితంగా అతడు ప్రపంచకప్ ఆడతాడని క్లార్క్ అభిప్రాయపడ్డాడు.


క్లార్క్




న్యూజిలాండ్ చేరిన టీమిండియా


ఆక్లాండ్: పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం టీమిండియా.. న్యూజిలాండ్ చేరుకుంది. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 23 నుంచి జరిగే ఐదు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌ల్లో ఆతిథ్య న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. ఆక్లాండ్ విమానాశ్రయం నుంచి భారత క్రికెటర్లు బయటకు వస్తున్న వీడియోను బీసీసీఐ వెబ్‌సైట్‌లో పెట్టింది. టీమిండియాకు అక్కడి అభిమానులు సాదరంగా స్వాగతం పలికారు. కేదార్ జాదవ్, దినేష్ కార్తీక్ ఫ్యాన్స్‌కు ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ కనిపించగా.. విరాట్, అనుష్కకు గట్టిగా అరిచి వెల్‌కమ్ చెప్పారు. బుధవారం నేపియర్‌లో తొలి వన్డే జరగనుంది.

వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు సుధ, రావత్

ముంబై: ఆసియాడ్ పతక విజేత సుధా సింగ్, నీతేంద్ర సింగ్ రావత్.. దోహాలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించారు. ఆదివారం జరిగిన ముంబై మారథాన్‌లో సుధాసింగ్ 2 గంటలా 34 నిమిషాల 56 సెకన్ల వ్యక్తిగత బెస్ట్ టైమింగ్‌తో రేస్‌ను పూర్తి చేసి ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో జాతీయ రికార్డు 2:37.29 సె.ను అధిగమించిన సుధ.. సెప్టెంబరులో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ మార్క్ 2:37.00 సె. టైమింగ్‌ను అందుకుంది. పురుషుల్లో రావత్ (2:15.52 సె.) ప్రపంచ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ టైమింగ్ (2.16.00 సె)ను అందుకున్నాడు.



సుధా సింగ్



ముంబైలో ఆదివారం జరిగిన మారథాన్ రేస్‌లో భారీగా పాల్గొన్న రన్నర్లు


హిరణ్యకశిపుడి వధ.. క్లేతో రూపొందించిన నమూనా విగ్రహం

దృశ్య తోరణం.. ప్రహ్లాద చరితం

యాదాద్రి గర్భాలయ ముఖ ద్వారంపై 10 ఘట్టాలుగా కాంస్య విగ్రహాల ఏర్పాటు




గర్భాలయ ముఖద్వారంపై కాంస్య విగ్రహాలతో ఏర్పాటు చేసే ప్రహ్లాద చరిత్ర ఊహాచిత్రం

యాదాద్రి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అద్భుత పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుంటున్న యాదాద్రి.. పురాణ ఇతిహాసాల ప్రత్యేకతలకూ నెలవు కానుంది. లక్ష్మీ నారసింహులు కొలువైన కొండగుహ (గర్భాలయ) ముఖ ద్వారాన్ని పురాణ ఇతిహాస ప్రాధాన్య ఘట్టాలతో తీర్చిదిద్దుతున్నారు. 30 అడుగుల ఎత్తు, 70 అడుగుల వెడల్పుతో పునర్నిర్మిస్తున్న ముఖద్వారానికి ఇరువైపుల జయ విజయులు, వెండిద్వారం తలుపులకు లక్ష్మీనారసింహుడి 14 దివ్యరూపాలు, ద్వారంపైన కొండగుహాకృతిలో స్వామివారి ప్రసన్నరూపం (రాతి శిల్పం) ఏర్పాటు చేస్తున్నారు. ముఖ ద్వారం తలుపుల పైభాగం నుంచి కొండగుహ పైకప్పు వరకు ప్రహ్లాద చరిత్రను ఆవిష్కరించనున్నారు. దాదాపు 7 అడుగుల ఎత్తుతో 70 అడుగుల వెడల్పు వరకు పది ఘట్టాలుగా కాంస్య విగ్రహాలు అమర్చనున్నారు. మరణం లేకుండా వరం పొందేందుకు హిరణ్యకశిపుడి కఠోర తపస్సు, ప్రహ్లాదుడు గర్భంలో ఉండగానే తల్లి లీలాదేవికి నారాయణ మంత్రం ఉపదేశించే నారద మహర్షి, బ్రహ్మ వరం పొంది ఇంద్రాది అష్ట దిక్పాలకులను ఆధీనంలోకి తీసుకుని దేవ లోకంలో కొలువుదీరిన హిరణ్యకశిపుడు, ప్రహ్లాదుడి జననం.. మునుల వద్ద విద్యాభ్యాసం.. హరినామ స్మరణ, విష్ణునామం మనకేల అంటూ ప్రహ్లాదుడిని హిరణ్యకశిపుడు చెరసాలలో బంధించడం, చిత్రహింసలు పెట్టడం, నీ శ్రీహరి ఎక్కడున్నాడంటూ ప్రహ్లాదుడితో హిరణ్యకశిపుడి సంవాదం, ప్రహ్లాదుడి వాక్కును నిజం చేస్తూ స్తంభోద్భవుడైన నారసింహుడు హిరణ్యకశిపుడిని వధించడం, ప్రసన్న వదనంతో భక్తులను కటాక్షించే ఘట్టాలు ఆవిష్కృతం కానున్నాయి. ఇప్పటికే ఈ ఘట్టాల దృశ్య నమూనాలను సిద్ధం చేశారు. త్వరలోనే కాంస్య విగ్రహాలు తయారు చేసి అమర్చనున్నారు. యాదగిరిగుట్ట ఆలయాన్ని తిరుమలస్థాయిలో ఆధ్యాత్మిక నగరిగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. కాకతీయ రాజుల కాలం నాటి రాతిశిలా నిర్మాణ రీతులు, కళాశోభితమైన శిల్పాలతో వెయ్యేళ్లు చెక్కుచెదరని రీతిలో ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. భారీ కాకతీయ, సింహరూపు యాలీ స్తంభాలతో ఆలయ ప్రాకార మండపాలు, ఆధార శిల నుంచి శిఖరం వరకు కృష్ణరాతి శిలలతో సప్తగోపుర సముదాయం, వైష్ణవ ధర్మప్రచారక భక్తాగ్రేసరులు 12 మంది ఆళ్వార్‌స్వాముల మూర్తులతో ముఖ మండప స్తంభాలు, క్షేత్రపాలకుడు ఆంజనేయుడు, యాదర్షి, శ్రీభగవత్ రామానుజల స్వామి మూర్తుల శిల్పాలను జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలకు తోడు భక్తులు గర్భాలయంలోకి ప్రవేశించడానికి ముందే ముఖద్వారం ఆలయ పురాణ ప్రాశస్త్యం తెలియజేసేలా ప్రహ్లాద చరిత్రను దృశ్య తోరణంగా మలుస్తుండడం విశేషం.

పర్యాటకుల కోసం గుడారాలు

- హోటల్ మాదిరిగానే వసతులు
- అనంతగిరిలో వినూత్న ఏర్పాట్లు


అతిథిగృహం ఆవరణలో ఏర్పాటు చేసిన గుడారాలు

వికారాబాద్, జనవరి 20: దైనందిన జీవితంలో అలసిన మనసులకు ఆహ్లాదాన్ని పంచాలనుకుంటున్నారా? ఇల్లు, ఆఫీస్ అంటూ నాలుగు గోడల జీవితానికి స్వస్తి పలికి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సరదాగా విహరించాలనుందా? అయితే తెలంగాణ ఊటీగా చెప్పుకునే వికారాబాద్ జిల్లా అనంతగిరికి వెళ్లండి. పచ్చని చెట్లు కలబోసిన ప్రకృతి సోయగాలు, చల్లని వాతావరణం, సుడులు తిరిగే ఘాట్ రోడ్డు, ఆపై పక్కనే వెళుతున్న నాగుపాములా ఉండే రైల్వే ట్రాక్, కొంత దూరం వెళితే దైవాన్ని కొలిచే భక్తులకు అనంతపద్మనాభస్వామి దేవాలయం... ఇవన్నీ అనంతగిరి సొంతం. దీనికి తోడు వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారులు పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు వినూత్న ఆలోచన చేశారు. అనంతగిరికి వచ్చే పర్యాటకులకు కొత్తగా టెంట్లతో గుడారాలు వేశారు. ఇక్కడ హరిత టూరిజం ముందు భాగంలో ఉన్న అటవీ శాఖ అతిథి గృహం (డీఎఫ్‌వో క్యాంప్ ఆఫీస్) ఆవరణలో నాలుగు గుడారాలు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్లి చూస్తే హోటల్ రూంను తలపించేలా ఉంటుంది. లోపల డబుల్ కాట్‌తో పాటు అల్మారా, ఫ్యాన్లు, విశాలమైన బాత్‌రూం ఉన్నాయి. ఇక్కడికి కొంత దూరం ఘాట్ రోడ్డులో వెళితే పర్యాటకులు అటవీ ప్రాంతంలో విహరించవచ్చు. ఆసక్తి ఉంటే ట్రెక్కింగ్ కూడా చేయవచ్చు. ఒక్కో గుడారానికి ఒక రోజుకు రూ.1500 చార్జి వసూలు చేస్తున్నారు. టెంట్‌గది కావాలంటే రెండు రోజుల ముందుగానే అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.


సదస్సులో పాల్గొన్న ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ తదితరులు

భవిష్యత్తు యుద్ధ వ్యూహాల్లో మార్పులు

- రక్షణ ఉత్పత్తుల్లో స్వయం వృద్ధి సాధించాలి
- ప్రైవేటు భాగస్వామ్యంతో పోటీతత్వం: ఆర్మీ చీఫ్

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ వ్యూహాల్లో మార్పులు చోటు చేసుకుంటాయని, దానికి అనుగుణంగా మనం సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని భారత ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ అన్నారు. రక్షణ రంగానికి ఎక్కువగా ఖర్చు చేసే దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉందని, అయినా మన రక్షణకు అవసరమైన టెక్నాలజీ, అత్యాధునిక ఆయుధాల కోసం ఇప్పటికీ ఇతర దేశాలపై ఆధారపడటం బాధాకరమన్నారు. 'సెల్ఫ్ రిలయన్స్ ఆన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ఆదివారం నాడిక్కడ ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన బిపిన్ రావత్ మాట్లాడుతూ.. సంప్రదాయ పద్ధతులతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డాటా అనాలసిస్ వంటి వాటిపైనా దృష్టి సారించాలన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' వల్ల ఆయుధాలను మన దేశంలోనే తయారు చేస్తే ధరలు అందుబాటులోకి వస్తాయన్నారు. రక్షణకు సంబంధించిన అన్ని అవసరాలను డీఆర్‌డీవో మాత్రమే తీర్చలేకపోవచ్చని, ప్రైవేటు సంస్థలను కూడా ప్రోత్సహించడంతో పోటీతత్వం పెరిగిందన్నారు. నిపుణులైన యువ శాస్త్రవేత్తలు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై దృష్టి పెట్టాలని రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డీబీ షెట్కార్ పిలుపునిచ్చారు. సైన్యం వినియోగించే ఉత్పత్తులను స్వల్ప మార్పులతో పోలీసులకు కూడా అందుబాటులోకి తేవాలని సూచించారు. వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు, ఆర్మీ అధికారులు హాజరైన ఈ సదస్సులో దేశ రక్షణకు యువత చేయాల్సిన పనులు, కావాల్సిన ఆయుధ సామగ్రి తదితర విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. కేరళ సెంట్రల్ యూనివర్సిటీ చాన్స్‌లర్ శేషగిరిరావు తాను రచించిన 'ఇండియాస్ ఓషన్ నైబర్‌హుడ్' పుస్తకాన్ని బిపిన్ రావత్‌కు బహూకరించారు.

ప్రజలకు సత్వర న్యాయం అందాలి

- న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్రప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న జస్టిస్ రాజేంద్రప్రసాద్

హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెట్రో రైళ్లు, విమానాశ్రయాలు లాంటివి అందుబాటులో ఉన్నంత మాత్రాన సరిపోదని, సత్వర న్యాయం కూడా అందించాల్సిన అవసరం ఉందని అఖిల భారత న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో న్యాయాధికారుల సంఘం జాతీయ కార్యవర్గం సమావేశమై అనేక తీర్మానాలు చేసింది. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. న్యాయవ్యవస్థలో అనేక సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని, లేకుంటే వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు ప్రయత్నిస్తున్నామన్నారు. హత్యలు, అత్యాచారం కేసుల్లో విచారణకు చాలా సమయం పడుతోందని, వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి తీర్పులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిఫ్ కోర్టు తీర్పును జిల్లా కోర్టులోనే అప్పీల్ చేసుకునే అవకాశం ఉండాలని, ఆ తీర్పే అంతిమం కావాలన్నారు. పేద వారికి అత్యున్నత న్యాయస్థానాలను ఆశ్రయించే స్థాయి ఉండదన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయమూర్తులపై సమగ్ర విచారణ జరగాలని, న్యాయాధికారులపై ఏసీబీ కేసులను ఉన్నత న్యాయస్థానాలు పర్యవేక్షిస్తాయని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



అత్యాచారానికి గురవడం కచ్చితంగా అవమానమే! అయితే జరిగింది తలుచుకుంటూ, దాక్కుని కుమిలిపోతే ఎవరికి ఉపయోగం? అందుకే... మరే మహిళకూ ఆ దుస్థితి రాకుండా, దించిన తల ఎత్తి, గళమెత్తి గర్జిస్తాం! అంటున్నారు ఆ మహిళలు! అందుకోసం దాదాపు ఐదు వేల మంది బాధితులు, ముంబయి నుంచి ఢిల్లీ వరకూ 'డిగ్నిటీ మార్చ్' సాగిస్తున్నారు.

భాష వేరు! ప్రాంతం వేరు! అయితేనేం? వారి బాధల్లో ఉన్న సారూప్యం వేర్వేరు రాష్ట్రాలకు చెందిన ఆ ఐదు వేల మంది మహిళలను ఒక్కటి చేసింది. అత్యాచారం వీడియో వాట్సా‌ప్‌లో షేర్ చేస్తాననే బెదిరింపులకు భయపడి వరుస అకృత్యాలకు బలైపోయిన కథ ఒకరిదైతే, తన 12 ఏళ్ల కూతురిని లైంగికంగా వేధించిన ఉన్మాదిని శిక్షించి తీరాలనే పట్టుదల పెంచుకున్న కథ ఓ తల్లిది! అందరి కథలూ కంటనీరు తెప్పించేవే! అయితే తమలాంటి దుస్థితి మరొక మహిళకు రాకుండా ఉండాలంటే దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలంటూ ఆ మహిళలందరూ ప్రతినబూనారు. ఈ ఆలోచనతో ఏకమైన మహిళల మహా కూటమి ముంబయికి చెందిన రాష్ట్రీయ గరిమా అభియాన్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో దేశవ్యాప్త అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించింది. ఆ క్రమంలో హైదరాబాద్ వచ్చిన కొందరు మహిళలు తమ అనుభవాలను 'నవ్య'తో పంచుకున్నారు.

ఈ అవమానం ఎవరిది?



"భన్వారీ దేవి నిరుపేద, నిరక్షరాస్య అబల కాదు. అప్పటికే ఆమె స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఉద్యోగిని. అలాంటి మహిళపై 20 ఏళ్ల క్రితమే అఘాయిత్యం జరిగింది. అయినా, ఇప్పటికీ ఆమెకు న్యాయం జరగలేదు."

ఇంటర్నెట్‌లో పెడతానని బెదిరించాడు!

నా పేరు రాధా చౌహాన్. మాది నిరుపేద కుటుంబం. చాక్లెట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాను. ఓ రోజు అటవీశాఖాధికారిగా మా గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి, ఉచితంగా మొక్కలు ఇస్తానంటూ తన ఇంటికి పిలిచాడు. ఒంటరిగా వెళ్లిన నా మీద అఘాయిత్యం చేసి, ఆ అకృత్యాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అంతటితో ఆగకుండా ఆ వీడియో ఇంటర్నెట్‌లో పెడతానంటూ బెదిరించి, ఆ తర్వాత చాలాకాలంపాటు నన్ను వేధించాడు. చిన్నదాన్ని! అటు ఇంట్లో చెప్పుకోలేక, ఇటు అతణ్ణి వదిలించుకోలేక ఎంతో కుమిలిపోయాను. మానసికంగా కూడా కుంగిపోయాను. అలా ఓరోజు అతను పిలిచిన చోటకు వెళ్తుంటే మా అన్నయ్య స్నేహితుడు చూశాడు. దాంతో విషయం ఇంట్లో తెలిసింది. అన్నయ్య నాకు ధైర్యం చెప్పి నిజం చెప్పమనడంతో జరిగింది చెప్పాను. ఆ తర్వాత అన్నయ్యతో కలిసి పోలీసు స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయబోతే పోలీసులు మా ఫిర్యాదు తీసుకోకుండా రోజుల తరబడి తిప్పించారు. చివరికి కేసు నమోదైంది. కోర్టులో ఉండగా నన్ను బలాత్కరించిన వ్యక్తి నాకు డబ్బు ఆశ చూపబోయాడు. 'నాతో వచ్చేయ్! నిన్ను నేను చూసుకుంటా!' అంటూ చేయి పట్టుకుని తీసుకెళ్లబోయాడు. కానీ నాకు జరిగిన అన్యాయానికి అతను శిక్ష అనుభవించి తీరాలి. అదే పట్టుదలతో ఉన్నాను. ఎప్పటికైనా అతనికి శిక్ష పడుతుందనీ, అతని లాంటి నరరూప రాక్షసులకు ఈ సంఘటన ఒక గుణపాఠం అవుతుందనీ ఆశిస్తున్నాను.





- రాధ, ఉత్తరప్రదేశ్

అతణ్ణి కటకటాల వెనక్కి తోయడమే నా లక్ష్యం!

మాది ఉత్తరప్రదేశ్‌లోని ఖిత్మా అనే చిన్న గ్రామం. నా కూతురు 6వ తరగతి చదువుతోంది. ఒక రోజు బడికెళ్లి వస్తుంటే ఓ కుర్రాడు మా అమ్మాయిని దారిలో ఆపి, 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు నన్ను ప్రేమించినా, ప్రేమించకపోయినా నాకు పట్టింపు లేదు. కానీ నువ్వు నాకు మాత్రమే దక్కాలి!' అంటూ వేధించడం మొదలుపెట్టాడు. అక్కడితో ఆగకుండా తనను రోడ్డు మీద అటకాయించి లైంగిక వేధింపులకు దిగాడు. ఆ దాడిలో అమ్మాయికి స్వల్ప గాయాలయ్యాయి. దుస్తులు చిరిగిపోయాయి. దాంతో నా కూతురు బెదిరిపోయింది. అనారోగ్యం పాలైంది. మరుసటి రోజు మా అమ్మాయిని తీసుకుని ఫిర్యాదు చేయడం కోసం పోలీసు స్టేషన్‌కి వెళితే వాళ్లు వెంటనే స్పందించలేదు. ఫిర్యాదు నమోదు చేసే అధికారులు లేరంటూ తాత్సారం చేశారు. చివరికి ఎంతో ఒత్తిడి చేస్తే ఫిర్యాదు నమోదు చేసుకున్నారు. కానీ నిందితుడిని అరెస్టు చేయలేదు. చివరికి అరెస్టు చేసినా, అతను బెయిల్ మీద వెంటనే బయటకొచ్చేశాడు. కోర్టులో కేసు ఇప్పటికీ నడుస్తూనే ఉంది. నేరం చేసిన వ్యక్తి అలా స్వేచ్ఛగా సంచరిస్తుంటే, తిరిగి నా కూతురి జోలికి రాకుండా ఉంటాడని నేనెలా నమ్మను? అతనికి భయపడి నా కూతురి చేత చదువు మాన్పించాను. ఇలా రెండేళ్లు గడిచాయి. ఇప్పటికీ కేసు కొలిక్కి రాలేదు. బలాత్కారం కేసుల్లో ఇంతటి అలసత్వం పనికి రాదు. ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకోవడంతోపాటు, నేరం రుజువైతే బెయిల్ లేని శిక్ష ఖరారు కావాలి. ఇలా జరిగినప్పుడే అమ్మాయిల మీద అఘాయిత్యాలు చేయడానికి పురుషులు భయపడతారు.



- కాశీబాయి, ఉత్తరప్రదేశ్

ధైర్యంగా పోరాడాలి!

"ఒక బాల్య వివాహాన్ని అడ్డుకున్నందుకు రాజస్థాన్‌కు చెందిన భన్వారీ దేవి మీద సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె ఈ అభాగినుల్లా నిరుపేద, నిరక్షరాస్య అబల కాదు. అప్పటికే ఆమె స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఉద్యోగిని. అలాంటి మహిళపై 20 ఏళ్ల క్రితమే అఘాయిత్యం జరిగింది. అయినా, ఇప్పటికీ ఆమెకు న్యాయం జరగలేదు. సామాజిక పరిస్థితులు అంతకంతకీ దిగజారుతున్నాయి. మహిళల ఫిర్యాదుల పట్ల తక్షణ స్పందన కరవవుతోంది. ఇలాంటి అభాగినులకు న్యాయం జరగాలంటే వ్యవస్థలోని ప్రతి అధికారీ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. రేప్ సంస్కృతికి అడ్డుకట్ట పడాలంటే మహిళల్లో కూడా అవగాహన పెరగాలి. అవమానంగా భావించి ఇంటికే పరిమితమైపోకుండా, నిందితులకు శిక్ష పడేలా ధైర్యంగా పోరాడాలి."



- కొండవీటి సత్యవతి, చీఫ్ సెక్రటరీ, 'భూమిక' ఉమెన్స్ కలెక్టివ్.

మౌనం వల్లే ఈ బాధలు!

మిగతా నేరాలతో పోలిస్తే, అత్యాచారం నేరంలో నిందితుల కంటే బాధితులకే బాధలు ఎక్కువ! నిందితులు చట్టానికి దొరకకుండా తప్పించుకునే అవకాశాలు, దొరికినా శిక్షల నుంచి తప్పించుకునే అవకాశాలు మరీ ఎక్కువ! ఇందుకు... భయంతో, సిగ్గుతో, పరువు పోతుందని భయపడి ఫిర్యాదు చేయకుండా మౌనంగా ఉండిపోయే బాధితులే ప్రధాన కారణం. ఈ ధోరణి మారినప్పుడే అత్యాచారాల సంస్కృతికి అడ్డుకట్ట పడుతుంది. కాబట్టి ఇలాంటి అఘాయిత్యాలకు గురికాకుండా జాగ్రత్తగా మెలగడంతోపాటు, ఘోరం జరిగినప్పుడు ధైర్యంగా ముందుకొచ్చి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి. ఇలాంటి అవగాహన ప్రతి మహిళకూ కల్పించడమే మా డిగ్నిటీ మార్చ్ లక్ష్యం!



- మంజూ చౌహాన్, కార్యకర్త, గరిమా అభియాన్, ముంబయ్

ముంబయి టు ఢిల్లీ!

డిగ్నిటీ మార్చ్ గత ఏడాది డిసెంబరు 20న ముంబయ్‌లో మొదలైంది. వీరి ప్రయాణ లక్ష్యం 65 రోజులపాటు, 24 రాష్ట్రాలు, 200 జిల్లాలు, 10 వేల కిలోమీటర్లు! ముంబయిలో మొదలైన వీరి ప్రయాణం గోవా, కర్నాటక, కేరళ, తమిళనాడు మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుంది. ఈ యాత్ర ఇలాగే ఫిబ్రవరి 22 వరకూ కొనసాగి ఢిల్లీలో ముగుస్తుంది. ఈ బృహత్తర ప్రయత్నానికయ్యే ఖర్చుకు ఆయా రాష్ట్రాల్లోని స్వచ్ఛంద సంస్థలు సహాయం అందిస్తున్నాయి. ముంబయిలో రాష్ట్రీయ గరిమా అభియాన్ సహాయమందిస్తే, తెలంగాణాలో సుభిక్ష సంస్థ తోడ్పాటును అందించింది.

(వ్యక్తిగత గోప్యత నిమిత్తం బాధితుల పేర్లు మార్చాం)

• గోగుమళ్ల కవిత ఫొటోలు: గోపి

అనుకోకుండా వచ్చిపడే అవసరాలు...!

పేరెంటచ్



అవసరాలు రెండు రకాలు. ముందే తెలిసిన అవసరాలు ఒక రకమైతే, అనుకోకుండా వచ్చిపడే అవసరాలు కొన్ని. ముందే అనుకున్నవైతే, వాటికి కావాల్సినవేవో ముందే సమకూర్చుకోగలుగుతాం. సమస్య అంతా అనుకోకుండా వచ్చిపడే అవసరాలతోనే ఉంటుంది. ఎందుకంటే అలాంటి అవసరాల కోసం ముందే సిద్ధం చేసుకున్నవేవీ ఉండవు. అయినా సరే అలాంటి వాటికి ఏమేం కావాలో ఆలోచించుకోవడం, వాటిని సమకూర్చుకోవడం వెంటవెంటనే జరిగిపోవాలి. లేదంటే విపరీతంగా గాబరా పడాల్సి ఉంటుంది. పెద్దలకు ఇలాంటి అనుభవాలుంటాయి కాబట్టి వాటిని దృష్టిలో పెట్టుకుని, పిల్లలకు వాటి గురించి అప్పుడప్పుడు చెబుతూ ఉండాలి. అంతేగానీ పెద్దవాళ్లయ్యాక చెప్పొచ్చులే అనో, మునుముందు వాళ్లే తెలుసుకుంటారులే అనో దాటవేస్తే పిల్లలు ఒక్కోసారి విపత్కర పరిస్థితుల్లో ఇరుక్కుపోవచ్చు. వాస్తవానికి ప్రస్తుత అవసరానికి సంబంధం లేని విషయాలను వినడానికి చాలా మంది పిల్లలు అంతగా శ్రద్ధ చూపరు. పైగా 'ఇదేం తలనొప్పి?' అన్నట్లుగా చూస్తారు. అయితే, భవిష్యత్‌లో సంభవించే పరిణామాల గురించి తెలుసుకోవడం వల్ల కలిగే లాభమేమిటో, తెలియకపోవడం వల్ల కలిగే నష్టమేమిటో తలితండ్రులు వారి మనసుకు తాకేలా చెప్పగలగాలి. ఎక్కువసార్లు వర్తమాన విషయాలే చెప్పినా, అప్పుడప్పుడైనా భవిష్యత్ గురించిన విషయాల్ని చెప్పడం అదనపు బాధ్యతగా భావించాలి. వాటివల్ల పిల్లలకు తప్పకుండా మేలే జరుగుతుంది.

కొండనెక్కి... స్ఫూర్తినిచ్చి...!

విజేత

ఆంక్షలున్న చోటే గళం వినిపించాలి. నీ వల్ల కాదని అన్న నోళ్లు మూతపడాలంటే మనమేంటో నిరూపించాలి. అందుకే మగాళ్లకు దీటుగా మహిళలూ కొండలు ఎక్కగలరని చాటి చెప్పారు ఐఆర్ఎస్ అధికారిణి ధన్యా సనాల్. కేరళలోని రెండో పెద్ద కొండ (1868 మీటర్ల ఎత్తు) అగస్త్యర్‌కూడమ్ ఎక్కిన తొలి మహిళగా ఇటీవల చరిత్ర సృష్టించారామె.

ధన్యా సనాల్ 2012లో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్)కు ఎంపికయ్యారు. ప్రస్తుతం డిఫెన్స్ స్పోక్స్ పర్సన్‌గా తిరువనంతపురంలో విధులు నిర్వహిస్తున్నారు. సమాచార అధికారిగా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు వారధిగా పని చేస్తూనే తన అభిరుచి అయిన ట్రెక్కింగ్‌ను కొనసాగించారు. భద్రత కారణాలను చూపుతూ చాలాకాలంగా అగస్త్యర్‌కూడమ్ కొండపైకి మహిళలు, పిల్లలను అనుమతించేవారు కాదు. దాంతో కొందరు మహిళా సామాజిక కార్యకర్తలు కోర్టును ఆశ్రయించారు. కేరళ హైకోర్టు గత ఏడాది నవంబర్ 30న ఈ అనధికార నిషేధాన్ని రద్దు చేసింది. దాంతో ప్రభుత్వం మొదటిసారిగా ఇక్కడ ట్రెక్కింగ్‌కు అనుమతి ఇచ్చింది. అప్పటికే చాలా కొండలను ఎక్కిన అనుభవం ఉన్న ధన్యా చూపు ఆ కొండపై పడింది. అంతే... జీన్స్, టీషర్ట్, స్పోర్ట్స్ షూ ధరించి, ట్రావెల్ బ్యాగు భుజానికి తగిలించుకొని ఆత్మవిశ్వాసంతో తన సాహస యాత్రను ఈ నెల 14న మొదలెట్టారు. కొండపైకి ట్రెక్కింగ్‌కు వెళ్లిన మొదటి బ్యాచ్‌లోని వంద మందిలో ధన్యా ఒక్కరే మహిళ. అడవి మార్గాన తిరువనంతపురం నుంచి 50 కి.మీ దూరంలో ఉన్న బొనాకావుడ్ బేస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ అటవీ అధికారులు మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వసతి కేంద్రంలో విశ్రాంతి తీసుకుని, 15వ తేదీన ఉదయం ఏడుగంటలకు ట్రెక్కింగ్ ప్రారంభించి, అథిరుమల బేస్ క్యాంప్‌కు వెళ్లారు. అక్కడి నుంచి మరో ఆరుకిలోమీటర్లు నడిచి, కొండపైకి చేరుకున్నారు. బొనాకావుడ్ నుంచి అథిరుల బేస్‌క్యాంప్ 13.5 కి.మీ ప్రయాణం ఫిట్‌నెస్‌కు పెద్ద పరీక్ష లాంటిది. కొండ దారిలో ఎండను తట్టుకొని 13 కిలోమీటర్లు నడవడం తేలికైన విషయం కాదు.



ఆందోళనల అడ్డంకులను దాటి...

కేరళలోని 'నెయ్యర్ వన్యప్రాణి సంరక్షణ' ప్రాంతంలో ఉంది అగస్త్యర్‌కూడమ్ కొండ. దాన్ని ఎక్కడం అంత సులువేం కాదు. పట్టు జారితే ప్రాణాలు గాల్లోనే. అగస్త్య ముని పేరు మీద ఈ కొండకు అగస్త్యర్‌కూడమ్ అనే పేరు వచ్చింది. దీన్ని యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించింది. ఈ కొండకు సమీపంలో కానీ అనే తెగ ఉంటుంది. వీళ్లు తరతరాలుగా అగస్త్యుడిని దైవంగా ఆరాధిస్తున్నారు. ఈ కొండపైన అగస్త్య ముని గుడి కూడా ఉంది, ఆయన బ్రహ్మచారి. మహిళలు కొండ ఎక్కితే గుడి అపవిత్రమవుతుందని, హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ 100 మంది కానీ తెగ మహిళలు బొనాకావుడ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. దాంతో ధన్యాకు రక్షణగా నలుగురు మహిళా పోలీసులు అథిరుమల బేస్‌క్యాంప్ వరకూ వెళ్లారు. "కానీ తెగ ప్రజల మనోభావాలు దెబ్బతీయడం నా ఉద్దేశం కాదు. లింగ వివక్షతకు తావులేని సమాజం నిర్మించాలనే సంకల్పంతోనే నేను ఈ సాహసం చేశా. ఈ అడ్వెంచర్ కోసం నేను మానసికంగా, శారీరకంగా సన్నద్ధమయ్యా. ఈ ప్రయాణంలో అనేక విషయాలు తెలుసుకున్నా" అన్నారు ధన్యా. కొండ మీదకు చేరిన తర్వాత 'థ్యాంక్యూ ఆల్' అని రాసి ఉన్న పోస్టర్‌ను చూపిస్తూ, తోటి ట్రెక్కర్స్‌తో సందడి చేశారు ధన్యా. 47 రోజుల ఈ ట్రెక్కింగ్ సీజన్ మార్చి 1న ముగుస్తుంది. ఇప్పటివరకూ ఆన్‌లైన్లో ట్రెక్కింగ్ కోసం టిక్కెట్స్ బుక్ చేసుకున్న 4700 మందిలో ఉన్న 100 మంది మహిళలకు ప్రేరణ ధన్యా సనాల్ అని వేరే చెప్పాలా!

"“కానీ” తెగ ప్రజల మనోభావాలు దెబ్బతీయడం నా ఉద్దేశం కాదు. లింగ వివక్షతకు తావులేని సమాజం నిర్మించాలనే సంకల్పంతోనే నేను ఈ సాహసం చేశా. ఈ అడ్వెంచర్ కోసం నేను మానసికంగా, శారీరకంగా సన్నద్ధమయ్యా. ఈ ప్రయాణంలో అనేక విషయాలు తెలుసుకున్నా"



డేటా ఇలా భద్రం!



ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, మెసేజ్‌లు, ఈమెయిల్స్ వీటిలో ఎంతో విలువైన డేటా. ఆ డేటాను తస్కరించడానికి హ్యాకర్లు చాలా ప్రయత్నాలు చేస్తుంటారు. ఎంతో విలువైన డాటా ఇతరుల చేతుల్లో పడకుండా ఉండాలంటే ఏం చేయాలి? ఇదిగో ఇలా చేయండి!

క్రిప్టోమీటర్

ఇది డాటా ఎన్‌క్రిప్షన్ సాఫ్ట్‌వేర్. విండోస్, మాక్, లినక్స్ ఉపయోగిస్తున్న వారు ఎంచుకోవచ్చు. వాల్ట్‌లో ఫైల్స్ స్టోర్ చేసుకోవడం ద్వారా 256 బిట్ ఎన్‌క్రిప్షన్ సెక్యూరిటీ లభిస్తుంది. వాల్ట్‌ను లోకల్ హార్డ్ డ్రైవ్‌లో లేక డ్రాప్‌బాక్స్, గూగుల్‌డ్రైవ్‌లో, వన్‌డ్రైవ్‌లో స్టోర్ చేసుకోవచ్చు. డెస్క్‌టాప్‌లో ఎన్‌క్రిప్ట్ అయిన ఫైల్స్ క్లౌడ్ సర్వీసులోనూ సురక్షితంగా ఉంటాయి. ప్రతి వాల్ట్‌కు ఒక పాస్‌వర్డ్ పెట్టుకోవచ్చు. క్రిప్టోమీటర్‌ను ఎంచుకున్నాక మీ కంప్యూటర్‌లో ఒక అప్లికేషన్‌ను క్లోజ్ చేస్తే, ఇతరులు దాన్ని ఓపెన్ చేసి చదవలేరు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులు సైతం ఈ ఎన్‌క్రిప్షన్ టూల్‌ను ఎంచుకోవచ్చు.

cryptomator.org

ట్యుటనోటా

ఇది లాటిన్ పదం. దీని అర్థం సెక్యూర్ మెసేజ్. మీరు పంపే ఈమెయిల్స్, కాన్ఫిడెన్షియల్ మెసేజ్‌లు ఇతరుల కంటపడకుండా ఉండాలంటే ఈ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇది ఎన్‌క్రిప్టెడ్ ఈమెయిల్ సర్వీసులను అందిస్తుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులు ఉపయోగించుకోవచ్చు. ఇది 'ఎండ్-టు-ఎండ్' 128 బిట్ ఏఇఎస్ ఎన్‌క్రిప్షన్‌ను అందిస్తుంది. మీ కాంటాక్ట్ లిస్ట్ పాస్‌వర్డ్‌తో ప్రొటెక్ట్ చేయబడి ఉంటుంది. మెసేజ్ స్వీకరించిన వారికి ఒక లింక్ వెళుతుంది. దానిపై క్లిక్ చేసి పాస్‌వర్డ్ ఎంటర్ చేయడం ద్వారా మాత్రమే ఆ మెసేజ్ చదవగలుగుతారు. టూ-ఫ్యాక్టర్ అథంటికేషన్‌ను సపోర్టు చేస్తుంది.

tutanota.com

ప్రోటాన్‌మెయిల్

ఇది కూడా ఎన్‌క్రిప్టెడ్ ఈమెయిల్ సర్వీస్‌ను అందిస్తుంది. వెబ్‌బ్రౌజర్ ద్వారా, ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా సమాచారాన్ని ప్రొటెక్ట్ చేసుకునే వీలుంటుంది. 4096 బిట్ ఎన్‌క్రిప్షన్, టూ-ఫ్యాక్టర్ అథంటికేషన్ వంటి ఫీచర్లున్నాయి. మెసేజ్ చదవాలన్నా, రిప్లై ఇవ్వాలన్నా పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా 28 రోజుల తరువాత ఈమెయిల్ డీఫాల్ట్‌గా సెల్ఫ్ డిస్ట్రక్ట్ అవుతుంది. కావాలంటే సెట్టింగ్స్‌లోకి వెళ్లి డ్యురేషన్‌ను మార్చుకోవచ్చు.

protonmail.com

ఎన్‌పాస్

ఇది పాస్‌వర్డ్ మేనేజర్. మీ లాగిన్ ఐడి, పాస్‌వర్డ్ వివరాలను ఎన్‌క్రిప్ట్ చేసి స్టోర్ చేస్తుంది. ఈమెయిల్స్, సోషల్ నెట్‌వర్క్, బ్యాంక్ అకౌంట్ల సమాచారాన్ని ఎన్‌క్రిప్ట్ చేసుకోవచ్చు. విండోస్, మాక్, లినక్స్ ఉపయోగిస్తున్న వారు, ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్‌లు వాడుతున్న వారు ఉపయోగించుకోవచ్చు. 256 బిట్ ఏఇఎస్ ఎన్‌క్రిప్షన్‌తో రక్షణ లభిస్తుంది.

www.enpass.io

డ్యాష్‌లైన్

ఆన్‌లైన్ అకౌంట్లలోకి సులువుగా సైనిన్ కావడానికి ఉపయోగపడే పాస్‌వర్డ్ మేనేజర్ ఇది. డౌన్‌లోడ్ చేసుకుని రిజస్టర్ అయ్యాక మాస్టర్ పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. తరువాత ఆటోమెటిక్‌గా సైనిన్ కావాలనుకుంటున్న ఆన్‌లైన్ అకౌంట్ల యాడ్ చేసుకుంటే చాలు. ఉచితంగా ఉపయోగించుకునే అకౌంట్‌తో 50 పాస్‌వర్డ్‌ల వరకు స్టోర్ చేసుకోవచ్చు. మాస్టర్ పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేయడం ద్వారా మాత్రమే డీక్రిప్ట్ చేయడం, ఎంటర్ కావడానికి వీలు పడుతుంది.

dashlane.com

మీ ముఖమే పాస్‌వర్డ్!

టెక్ గురు

మీరు ఫేస్‌బుక్‌లో ఏదైనా ఫొటో అప్‌లోడ్ చేసినప్పుడు, ఒకవేళ అందులో మీ స్నేహితులు కూడా ఉన్నట్లయితే, మీ ప్రమేయం లేకుండానే ఆటోమేటిక్‌గా వారి ప్రొఫైళ్లు కూడా ట్యాగ్ చేయబడతాయి కదా! అసలు ఫేస్‌బుక్ లాంటి సంస్థలు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ఎలా వాడుతున్నాయి అన్నది అర్థం కాక చాలా మంది ఆశ్చర్యపోతూ ఉంటారు. ఈ నేపథ్యంలో మెషిన్ లెర్నింగ్ ఆధారంగా పనిచేసే ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ గురించి వివరంగా తెలుసుకుందాం.

99 శాతం కచ్చితంగా!

ఫేస్‌బుక్ సంస్థ మనం అప్‌లోడ్ చేసే ఫోటోల్లో ఎవరెవరు ఉన్నారో వారి పేర్లని 98 శాతం నిక్కచ్చిగా గుర్తించగలుగుతుంది. ఇదంతా మెషిన్ లెర్నింగ్ ఆధారంగా సాధ్యపడుతుంది. ప్రధానంగా ఫేస్ రికగ్నిషన్ కొన్ని అంశాల ఆధారంగా పనిచేస్తుంది.

- ఒక ఫోటోను చూసి అందులో అన్ని ముఖాలు గుర్తించడం.
- ఒక్కో ముఖాన్ని నిశితంగా పరిశీలించి తల తిప్పబడిందా, లైటింగ్ ఎలా ఉన్నది అన్నది గుర్తించి అప్పటికే ఆ వ్యక్తికి సంబంధించి డేటాబేస్‌లో ఉన్న వివరాలతో పోల్చి చూడటం.
- ప్రపంచంలో ఉన్న ప్రతీ వ్యక్తికి విభిన్నంగా ఉన్న కొన్ని ఫేస్ ఫీచర్లు గుర్తించి వాటి ఆధారంగా ఒక వ్యక్తిని నిర్దిష్టంగా గుర్తించటం.
- అలా గుర్తించబడిన వ్యక్తికి సంబంధించిన ప్రొఫైల్ తమ డేటాబేస్‌లో వెతికి పట్టుకోవడం.

మనం ఒక వ్యక్తిని చూసిన వెంటనే, చాలా సందర్భాల్లో అతని పేరు సులభంగా గుర్తు తెచ్చుకోగలుగుతాం. దీనికి ప్రధాన కారణం మన బ్రెయిన్ చాలా శక్తివంతంగా పైన చెప్పిన అన్ని పనులు తనకు తాను చేయడం. కానీ కంప్యూటర్లు అలా కాదు. పైన చెప్పిన పనులు అన్నీ నేర్పించాలి. ఆ తర్వాత మాత్రమే అవి వ్యక్తుల పేర్లను గుర్తించగలుగుతాయి.

అన్ని ముఖాలూ గుర్తించడం

ఒక ఫోటోలో మనుషులు మాత్రమే కాదు, వస్తువులు, ప్రకృతి వంటివి కూడా ఉండొచ్చు. అలాంటప్పుడు ఫోటోలోని మనుషుల ముఖాలు గుర్తించడం ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ చేసే మొట్టమొదటి పని. గత పది సంవత్సరాలుగా మీకు పలురకాల డిజిటల్ కెమెరాలు, స్మార్ట్‌ఫోన్ కెమెరాలు వాడుతుంటే, అందులో స్మైల్ డిటెక్షన్ వంటి ఫీచర్లు పొందుపరచబడి ఉంటాయన్నది తెలిసిందే. తీయబడే ఫోటోలో ఫేస్‌ని గుర్తించి, అందులో ఒక వ్యక్తి నవ్వుతున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించి అప్పుడు ఆటోమేటిక్‌గా క్యాప్చర్ అవుతుంది. దాదాపు 2000 సంవత్సరంలోనే ఒక ఫోటోని పరిశీలించి అందులో మనుషులను గుర్తించగలిగే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది.

విచిత్రంగా పనిచేస్తుంది!


ఒక ఫోటోలో ఒక వ్యక్తికి సంబంధించిన ముఖ్యమైన ఫీచర్లను గమనించటం కోసం ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ హిస్టోగ్రామ్ ఆఫ్ ఓరియంటెడ్ గ్రేడియంట్స్(హాగ్) అనే ప్రత్యేకమైన ప్రక్రియను అనుసరిస్తుంది. ఉదాహరణకు శ్రీనివాస్ అనే వ్యక్తి ఫోటోని దానికి ఇన్‌పుట్‌గా ఇచ్చామనుకుందాం. మొట్టమొదట ఆ ఫేస్ బ్లాక్ అండ్ వైట్ లోకి మార్చబడుతుంది. ఆ తర్వాత ఆ ఫోటోలోని ప్రతీ పిక్సెల్ నిశితంగా పరిశీలించబడుతుంది. తన చుట్టుపక్కల ఉన్న పిక్సెళ్లతో పోలిస్తే ఒక పిక్సెల్ ఎంత డార్క్‌గా ఉంది అన్నది విలువ ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీకి కావాలి. ఈ డేటా ఆధారంగా ఒక వ్యక్తికి సంబంధించిన ఫోటోలో ఏ దిశలో ఇమేజ్ డార్క్‌గా అవడం జరుగుతోంది అన్నది బాణం గుర్తులు గీయబడతాయి. ఇలా ఒక ఫోటోలోని ప్రతీ పిక్సెల్‌నీ విశ్లేషించుకుంటూ, అది ఏ దిశగా డార్క్‌గా తయారవుతోంది అన్న దాన్ని బట్టి బాణం గుర్తులు గీసుకుంటూ వెళినట్లయితే, ఫోటో మొత్తం ఆ బాణం గుర్తులతో నిండిపోతుంది. సరిగ్గా ఇదే బాణం గుర్తుల డేటా మనకు కావాలి. దీన్ని ఆసరాగా చేసుకునే ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ పనిచేస్తుంది. శ్రీనివాస్ అనే వ్యక్తికి సంబంధించి లైటింగ్ బాగా ఉన్న ఫోటో తీసుకున్నా కానీ, లేదా బాగా డార్క్‌గా ఉన్న ఫోటో తీసుకున్నా గానీ రెండింటి విషయంలో అతని ముఖానికి సంబంధించిన బాణం గుర్తుల డేటా ఒకే విధంగా ఉంటుంది. సరిగ్గా ఈ డేటా ఆధారంగా ఒక మనిషి యొక్క ముఖం గుర్తించబడుతుంది. అయితే ఇక్కడ కూడా ఫోటోలోని అన్ని పిక్సెళ్లకి సంబంధించి డేటా విశ్లేషించడం కొద్దిగా కష్టంతో కూడిన పని. అందుకే 16 x 16 పిక్సెళ్ల పరిమాణం కలిగిన పలు చతురస్రాలుగా మనం ఇచ్చిన ఫోటో విభజించబడుతుంది. అలాంటి ఒక్కో చతురస్రాకారంలో ఒకే దిశలో ఎన్ని బాణం గుర్తులు ఉన్నాయన్నది ప్రాతిపదికగా తీసుకుని ఒక మనిషి యొక్క ముఖాన్ని గుర్తించడం జరుగుతుంది.

తమ వద్ద ఉన్న డేటాతో...

ప్రపంచంలో అందరూ ఫేస్‌బుక్ వినియోగదారుల ముఖాలకు సంబంధించిన పైన చెప్పబడిన హాగ్ డేటా ఫేస్‌బుక్ వద్ద భద్రపరచబడి ఉంటుంది. కొత్తగా అప్‌లోడ్ చేయబడిన ఒక ఫోటోని విశ్లేషించిన వెంటనే ఆ ఫోటో యొక్క హాగ్ డేటా, ఇప్పటికే తన వద్ద ఉన్న ఇతరుల ఫోటోలతో మ్యాచ్ అవుతుందా లేదా అన్న విషయం ఫేస్‌బుక్ వెంటనే గుర్తిస్తుంది.

వేరే వైపు తల తిప్పి ఉంటే?

ఇంతవరకు బాగానే ఉంది, అయితే కొన్ని సందర్భాల్లో ఒక వ్యక్తి నేరుగా చూస్తూ ఉండకపోవచ్చు. అతను పక్కకు తల తిప్పి ఉండొచ్చు, లేదా తలదించుకుని ఉండొచ్చు. అలాంటప్పుడు ఒక వ్యక్తికి సంబంధించిన కళ్లు, ముక్కు, నోరు, చెవులు, గడ్డం వంటి వివిధ భాగాలు ఎల్లప్పుడు ఒకే ప్రదేశంలో ఉంటాయి కాబట్టి ఆ డేటా ఆధారంగా ఒక ముఖం మొత్తం మీద 68 విభిన్నమైన పాయింట్స్ గుర్తించడం జరుగుతుంది. ఆ తర్వాత ప్రతీ ఫేస్‌కి సంబంధించిన 68 ప్రత్యేకమైన ల్యాండ్ మార్క్‌లను గుర్తించగలిగే విధంగా మెషిన్ లెర్నింగ్‌కి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. సరిగ్గా ఇదే టెక్నిక్ ద్వారా, ఒకవేళ మనిషి పక్కకు తిరిగి ఉన్న కూడా అతనికి సంబంధించిన లక్షణాలు సులభంగా గుర్తించవచ్చు.




క్షణాల్లో ఎలా చేస్తుందంటే?

సహజంగా ఫేస్‌బుక్ వంటి సైట్లలోకి మనం ఫొటోలు అప్‌లోడ్ చేసేటప్పుడు కేవలం కొన్ని సెకన్లలో ఆ ఫోటోలో ఉన్న వ్యక్తి ఎవరు అన్నది ట్యాగ్ చేయబడటం మీరు గమనించే ఉంటారు. ఇంత వేగంగా ఫేస్‌బుక్ మన ఫోటోని ఎలా గుర్తిస్తుంది అని చాలామంది ఆశ్చర్యపోతూ ఉంటారు. మన పైన చెప్పుకున్నట్లు మొత్తం హాగ్ డేటా, మరియు ముఖంలోని 68 వేర్వేరు పాయింట్ల ఆధారంగా.. ఫేస్‌బుక్ లోకి అప్‌లోడ్ చేయబడే ప్రతి ఫోటోనీ క్రాస్ చెక్ చేసి, ఏ వ్యక్తి ఎవరో గుర్తించాలంటే చాలా సమయం పడుతుంది. అందుకే మొత్తం డేటా కంపేర్ చేయకుండా ఫేస్‌బుక్, ఒక వ్యక్తికి సంబంధించిన చెవి పరిమాణం, రెండు కళ్ళకు మధ్య ఉన్న దూరం, ముక్కు పొడవు వంటి కొన్ని ముఖ్యమైన లక్షణాల ఆధారంగా ఆ మనిషిని గుర్తిస్తుంది. అందుకే అంత వేగంగా అది మనం అప్‌లోడ్ చేసిన ఫోటోలను ట్యాగ్ చేస్తుంది. దీనికోసం న్యూరల్ నెట్‌వర్క్‌లో డీప్ లెర్నింగ్ ఉపయోగించబడుతుంది.

ప్రపంచంలోని అందరి ముఖాలూ!

ఫేస్‌బుక్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లను ప్రపంచ వ్యాప్తంగా పెద్ద మొత్తంలో వినియోగదారులు వాడుతుండడంతో, ఆయా యూజర్లకి సంబంధించిన ఫేస్ డేటా మొత్తం దాని వద్ద సురక్షితంగా భద్రపరచబడి ఉంటుంది. ఈ మధ్యకాలంలో మీరు గమనించే ఉంటారు, ఫేస్‌బుక్ ఒక కొత్త సదుపాయం తీసుకువచ్చింది. ఒక వ్యక్తి మీకు తెలియకుండా మీ ఫోటో ఎక్కడైనా ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తే, అతను మీ ఫ్రెండ్ లిస్టులో లేకపోయినప్పటికీ, వెంటనే మీ ఫోటో ఫలానా వ్యక్తి అప్‌లోడ్ చేశారని ఒక నోటిఫికేషన్ చూపిస్తుంది. అంటే నిరంతరం ఫేస్‌బుక్ లోకి అప్‌లోడ్ చేయబడే అన్ని ఫొటోలూ ఇలా ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ఆధారంగా విశ్లేషించబడి అందులో ఎవరైతే వ్యక్తులు ఉన్నారో వారికి ఫేస్‌బుక్ నోటిఫికేషన్లను పంపిస్తుంది అన్నమాట. ఈ టెక్నాలజీలో లోపాలు లేకపోలేదు. అయితే మున్ముందు మరింత శక్తివంతంగా అభివృద్ధి చెందుతాయనడంలో సందేహం లేదు.



నల్లమోతు శ్రీధర్
fb.com/
nallamothusridhar

కొత్త 'హానర్'

నయా మొబైల్

హువాయి బ్రాండ్ నుంచి కొత్త ఫోన్ ఒకటి ఇటీవలే మార్కెట్లోకి విడుదలైంది. అదే 'హానర్ 10 లైట్' దీని ఖరీదు దాదాపు రూ. 14 వేలు. ప్రస్తుతం ఈ ఫోన్ (4జీబీ ర్యామ్+ 64 జీబీ స్టోరేజీ), (6జీబీ ర్యామ్+64 జీబీ స్టోరేజీ) వేరియెంట్లతో ఇది అందుబాటులో ఉంది. జీపీయూటర్బో ఫీచర్ ఉన్న హానర్ ఫోన్ మోడల్ ఇదే కావడం విశేషం. డిజైన్ పరంగా ఈ ఫోన్ చాలా బెటర్ అనే చెప్పవచ్చు. ఇప్పటివరకూ చాలా ఫోన్లు గ్లాస్ కోటింగ్ రావడం చూస్తూనే ఉన్నాం. కానీ ఈ ఫోన్ వెనుక భాగానికి ప్లాస్టిక్ కోటింగ్ ఇచ్చారు. ఇందులో ఉన్న కిరిన్ 710 ప్రాసెసర్ కారణంగా గేమింగ్‌కు కూడా అనుకూలమని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇందులో ఉన్న ఒకే ఒక్క లోపం ఏంటంటే, ఫాస్ట్ చార్జింగ్‌కు అస్సలు సరిపడని మోడల్ కావడమే. 15 వేల బడ్జెట్‌తో ఫోన్ కొనుగోలు చేయాలనుకునేవారికి ఈ ఫోన్ కచ్చితంగా ఓ ఆప్షన్ అవుతుంది.



బ్యాక్ కెమెరా: డ్యుయెల్ కెమెరా (13 ఎంపీ+ 2 ఎంపీ)
సెల్ఫీ కెమెరా: 24 ఎంపీ

ఇక అప్‌డేట్లు ఉండవు!

టెక్ న్యూస్

ఇప్పుడంతా ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్ల యుగమే. కొన్నేళ్ల క్రితం విండోస్ ఫోన్లను కూడా కొంత మంది వినియోగించేవారు. రొటీన్‌కి భిన్నంగా ఓ కొత్త ఓఎస్ ఉన్న ఫోన్‌ను వాడిచూద్దామన్న ఉత్సాహంతో చాలా మంది విండోస్ ఫోన్ల వైపు మొగ్గు చూపారు. ఈ మధ్యకాలంలో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లోకి అడుగుపెట్టిన నోకియా అప్పట్లో మైక్రోసాఫ్ట్ విండోస్ ఫోన్లను ఉత్పత్తి చేసేది. కానీ ఆండ్రాయిడ్ ఫీచర్లకు దీటుగా కొత్త యాప్స్‌ను తీసుకురావడంలో విఫలమైంది. దాంతో ఈ ఫోన్లకు క్రమంగా ఆదరణ తగ్గిపోయి, ఓ ఫెయిల్యూర్ ఓఎస్‌గా ముద్రవేయించుకుంది. అయితే అక్కడక్కడా కొంత మంది ఉన్నారన్న మాట వాస్తవమే. వారి కోసమే మైక్రోసాఫ్ట్ అప్‌డేట్లను విడుదల చేస్తూ వచ్చింది. అయితే 2017లో విండోస్ ఓఎస్ ఉన్న ఫోన్ల కోసం కొత్త ఫీచర్లను రూపొందించడం కూడా మానేసింది మైక్రోసాఫ్ట్. ఇప్పుడు భవిష్యత్తులో అప్‌డేట్లకూ చెక్ పెట్టాలని నిర్ణయించింది. త్వరలోనే విండోస్ 10 ఓఎస్ ఫోన్ వినియోగదారులు ఆండ్రాయిడ్ లేదా ఐఓఎస్ ఫోన్లను కొనుగోలు చేయాలనీ, ఈ ఏడాది డిసెంబర్ తర్వాత ఇక అప్‌డేట్లను విడుదల చేసేది లేదని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.



షేర్ చేస్తే చాలు!

నయా ఫీచర్

మీరు స్కైప్ లేదా గూగుల్ డ్యుయోలో వీడియో చాటింగ్ చేస్తున్నారు. ఇప్పుడు ఏకంగా ఆరుగురి వరకూ ఒకేసారి వీడియో కాల్ మాట్లాడుకునే అవకాశం ఉంది. కానీ మీకేదో ఆసక్తికరంగా అనిపించిన విషయాన్ని కాల్‌లో ఉన్న మీ మిత్రులకు చూపించాలనుకున్నారు. అంటే స్క్రీన్ షేరింగ్ చేయాలి. సాధ్యమవుతుందా? ఇప్పటివరకూ కష్టమే! కానీ ఓ యాప్ దాన్ని సుసాధ్యం చేసింది. దీని పేరు 'స్క్వాడ్'. ఫోన్‌లో ఏదైతే చూస్తున్నామో దాన్ని స్క్రీన్ షాట్ తీసి పంపించడం సహజం. కొన్నేళ్ల క్రితమే ఈ ప్రక్రియ అంటే కాఫర్డ్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి విసుగొచ్చింది. అతని కూతురు కూడా నా ఫ్రెండ్స్‌కి నేను చూస్తున్నప్పుడు అప్పటికప్పుడు ఎందుకు షేర్ చేయడానికి కుదరదు?" అంటూ ప్రశ్నించింది. అప్పుడు క్రాఫర్డ్‌కి పుట్టిన ఆలోచనే 'స్క్వాడ్'. ఈ యాప్ ఓపెన్ చేసి అందులో వీడియో కాల్ మాట్లాడం మొదలుపెట్టండి. మీరు చూస్తున్నది వారికీ చూపించాలంటే, ఆప్షన్లలో ఉండే స్క్రీన్‌షేర్ ఆప్షన్‌ను క్లిక్ చేయండి. అయితే ప్రస్తుతం ఈ యాప్ ఐఫోన్ వినియో గదారులకే అందుబాటులో ఉంది.



టెక్ సందేహం

వాట్సప్ అకౌంట్‌ను ప్రొటెక్ట్ చేసుకోవచ్చా?

నాది 4జి జియోఫోన్. నా మొబైల్‌లో ఇతరులు వాట్సప్ అకౌంట్ ఓపెన్ చేసి చూడకుండా పాస్‌వర్డ్‌తో ప్రొటెక్ట్ చేసుకోవడం కుదురుతుందా?

- సైదు, హైదరాబాద్

జియోఫోన్‌లో ఫైర్‌ఫాక్స్ కాయ్ ఆపరేటింగ్ సిస్టం వాడబడి ఉంటుంది. ప్రస్తుతానికి దానికోసం అందుబాటులో ఉన్న అప్లికేషన్ల సంఖ్య అతి తక్కువగా ఉంది. మీరు కోరినట్లు యాప్స్‌ని లాక్ చేసుకోవడానికి ఇప్పటికిప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యపడదు. కొంతకాలం తరువాత దాని యాప్‌స్టోర్‌లో అలాంటి యాప్స్ వస్తాయేమో చూడాలి.



డైలీ సుడోకు - 431

8			7	5	2		1	
3					6	8		
9	7							5
6				3				
			2		8			
				6				8
5							6	9
		1	5					2
	3		6	2	7			1

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 430 సమాధానం

2	3	7	5	6	8	1	9	4
8	4	1	7	9	2	6	3	5
6	9	5	1	4	3	2	7	8
9	5	4	3	7	1	8	6	2
3	6	2	8	5	9	7	4	1
7	1	8	6	2	4	3	5	9
5	2	3	9	1	7	4	8	6
1	8	6	4	3	5	9	2	7
4	7	9	2	8	6	5	1	3



జోష్ ఎలా ఉంది?

- నరేంద్ర మోదీ

భారతీయ సినిమా మ్యూజియమ్ ప్రారంభోత్సవ వేడుకలో 'జోష్ ఎలా ఉంది' (ఇటీవల విడుదలైన 'ఉరి' చిత్రంలోని డైలాగ్) అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించిన తీరు ప్రోత్సాహకరంగా, స్ఫూర్తిమంతంగా అనిపించిందని సినిమా ప్రముఖులు తెలిపారు. మోదీ ప్రసంగం గురించి అమీర్‌ఖాన్ మాట్లాడుతూ "మోదీ పాజిటివ్‌గా మాట్లాడిన తీరు ఆకట్టుకుంది. సృజనాత్మక రంగం పట్ల ఆయనకున్న విజన్, ఆయన ఆలోచనా విధానం చాలా బావుంది" అని అన్నారు. "మోదీ మాట్లాడిన తీరు స్ఫూర్తిమంతంగా ఉంది. భారతీయ సినిమా ప్రభావం, దాని తీరుతెన్నులు గురించి చాలా చక్కగా మాట్లాడారు. డేవోస్ తరహా ప్లాట్‌ఫార్మ్‌ను మన దేశంలోనూ ఏర్పాటు చేద్దామని ఆయన అనడం బావుంది. ఆయనకున్న హాస్య చతురత మెప్పించింది" అని కరణ్ జోహార్ తెలిపారు. సెన్సార్ బోర్డ్ ఛైర్మన్ ప్రసూన్ జోషి మాట్లాడుతూ "సినిమా రంగం గురించి యువత, పిల్లలు నేర్చుకోవడానికి అనుకూలంగా ఉండే ఈ మ్యూజియం ప్రారంభోత్సవానికి ప్రధాని రావడం ఆనందంగా ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజకీయ, సినీ ప్రముఖులు పలువురు పాల్గొన్నారు.



ప్రముఖ నటుడు కృష్ణంరాజు పుట్టినరోజు వేడుక ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో శిక్షణ!



వరుణ్‌తేజ్

వరుణ్‌తేజ్ సంక్రాంతికి 'ఎఫ్ 2'తో సందడి చేశారు. అందులో హైదరాబాదీ యువకుడిగా కనిపించారు. ప్రతి చిత్రానికీ వైవిధ్యం చూపించే వరుణ్ తేజ్, 'ఎఫ్ 2' తర్వాత చేస్తున్న చిత్రంలో బాక్సర్‌గా కనిపించనున్నారు. ఆయన కథానాయకుడిగా కిరణ్ కొర్రపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ గీతా ఆర్ట్స్ సంస్థ ఓ చిత్రం నిర్మించనున్న సంగతి తెలిసిందే. బాక్సింగ్ నేపథ్యంలో రూపొందుతోంది సినిమా. ఇందులో వరుణ్‌తేజ్‌ది బాక్సర్ పాత్ర. అందుకని, బాక్సింగ్‌లో శిక్షణ తీసుకోవడానికి అమెరికా వెళ్తున్నారు. అక్కడ ఓ ప్రొఫెషనల్ కోచ్ దగ్గర బాక్సింగ్‌లో మెళకువలు తెలుసుకోనున్నారు. అలాగే, పాత్ర కోసం ఫర్‌ఫెక్ట్ ఫిజిక్‌లోకి రావాలని ఆయన నిర్ణయించుకున్నారట! ఈ చిత్రానికి వరుణ్‌తేజ్ స్నేహితుడు సిద్ధు సహ నిర్మాతగా వ్యవహరిస్తారని సమాచారం.

నీడతో యుద్ధం చేయాల్సి వస్తే...



సందీప్ కిషన్, అన్య సింగ్

ఓ యువకుడికి తన నీడతోనే యుద్ధం చేయాల్సి వస్తే... ఆ విపత్కర పరిస్థితి నుంచి అతను ఎలా బయటపడ్డాడు? ఎలా విజయం సాధించాడు? అనే కథాంశంతో రూపొందుతోన్న ఎమోషనల్ హారర్ ఫిల్మ్ 'నిను వీడని నీడను నేనే'. సందీప్ కిషన్ హీరోగా నటిస్తూ, నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకుడు. దయా పన్నెం, వి.జి. సుబ్రహ్మణ్యన్ నిర్మాతలు. అన్య సింగ్ హీరోయిన్. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. కార్తీక్ రాజు మాట్లాడుతూ "ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని సరికొత్త పాయింట్‌తో ఉన్నత సాంకేతిక విలువలతో చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో హీరో హీరోయిన్లపై కీలక సన్నివేశాలతో పాటు ఓ ముఖ్యమైన పోరాట సన్నివేశం చిత్రీకరిస్తున్నాం" అన్నారు. దయా పన్నెం మాట్లాడుతూ "హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్‌తో సినిమా పూర్తవుతుంది. ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. తెలుగులో అనిల్ సుంకర చిత్రాన్ని విడుదల చేస్తున్నారు" అన్నారు. పోసాని కృష్ణమురళి, మురళీ శర్మ, 'వెన్నెల' కిశోర్, రాహుల్ రామకృష్ణ, పూర్ణిమా భాగ్యరాజ్, ప్రగతి నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు : శివా చెర్రీ, సీతారామ్, కృపాకరన్, సంగీతం: ఎస్.ఎస్. తమన్.




లండన్ కాలింగ్!

- శ్రుతీ హాసన్

సమయం కుదిరితే ప్రియుడు మైఖేల్ కోర్సల్‌తో చక్కర్లు కొట్టడానికి సిద్ధపడుతుంటారు శ్రుతీ హాసన్. తన ప్రియుడిది లండన్ కావడంతో ఎక్కువ అక్కడికే హాలీడే ట్రిప్ కోసం వెళ్తుంటారు. షూటింగ్‌కు సంబంధించి కాకుండా ఇప్పటికే చాలాసార్లు ఆమె లండన్ చుట్టొచ్చారు. సోషల్ మీడియా ద్వారా అక్కడి జ్ఞాపకాల్ని, ప్రియుడితో తీసుకున్న ఫొటోలను అభిమానుల ముందుంచుతారు. అయితే మరోసారి ఆమె లండన్ వెళ్లబోతున్నారు. ఈ విషయాన్ని శ్రుతీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలిపారు. "లండన్ కాలింగ్. నా డార్లింగ్‌తో బెస్ట్ టైమ్ గడపబోతున్నా. స్వచ్ఛమైన హృదయంతో నా జీవితంలో ప్రేమను, వెలుగును నింపుతున్న నా డార్లింగ్‌కు అంతే స్వచ్ఛమైన ప్రేమను పంచుతా" అని శ్రుతీ హాసన్ పేర్కొన్నారు.

గుడిలో కంగన నృత్యం

- కంగనా రనౌత్



హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిలో ఉన్న ఓ ఆలయంలో నటి కంగనా రనౌత్ నృత్య ప్రదర్శన ఇచ్చిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అక్కడ భక్తి పాటలకు ఆమెతో పాటు మరికొందరు మహిళలు కూడా నృత్యం చేశారు. ఆ ప్రదేశంలో ఓ ఆలయాన్ని నిర్మించాలని అనుకుంటున్నట్టు ఇటీవల కంగన తెలిపారు. ఆమె టైటిల్ పాత్ర పోషించిన 'మణికర్ణిక' ఈ శుక్రవారం విడుదల కానుంది. ఇదిలా ఉండగా, ఈ సినిమా నిర్మాత కమల్ జైన్ అస్వస్థతకు గురయ్యారు. "కష్టానికి ఫలితం దక్కుతున్న ఈ సమయంలో చిత్ర యూనిట్‌కు దూరంగా ఆసుపత్రిలో ఉండటం బాధగా ఉంది. యూనిట్‌ను మిస్ అవుతున్నా. త్వరలోనే కోలుకుని వస్తాను. అన్ని పనులను నిర్వహిస్తున్న జీ స్టూడియోస్‌కు ధన్యవాదాలు. మన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మణికర్ణిక' సక్సెస్‌మీట్‌లో కలుద్దాం. జై హింద్" అని కమల్ జైన్ ట్వీట్ చేశారు.

అంత తేలిక కాదు

- కాజోల్



"పాపులర్ కావడం ఇవాళ్టి రోజున తేలికైన పని. కానీ స్టార్‌గా కొనసాగడం అంత సులువు కాదు" అని అన్నారు కాజోల్. ఆమె పరిశ్రమకు పరిచయమై పాతికేళ్లవుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "నా తొలి సినిమా 'బేఖుది' పెద్దగా ఆడలేదు. అప్పుడు పరిస్థితులు ఎలా అనుకూలిస్తే అలా ముందుకెళ్లాను. అంతేగానీ ఎప్పుడూ ఏటికి ఎదురెళ్లలేదు. నా వద్దకు వచ్చిన ప్రతి అవకాశాన్ని పట్టుకుని వేగంగా ఎదగాలనుకోలేదు. అవి నా కెరీర్‌కు ఎంత వరకు సరిపోతాయనే విషయాన్ని నిలకడగా నేలమీద నిలుచుని ఆలోచించేదాన్ని. నేను సినిమాల్లో పనిచేయడాన్ని ఆస్వాదించాను. నా వృత్తిలో భాగంగా ఎంతో మంది గొప్ప వ్యక్తులను కలిశాను. నా 16వ ఏట ఉన్న పరిపక్వతతో పోలిస్తే ఇప్పుడు వృత్తిపరంగానూ, వ్యక్తిగతంగానూ ఎదిగాను. నేను కోరుకున్న ఎదుగుదల ఇది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎవరైనా ఫేమస్ కావచ్చు. కానీ అందరూ స్టార్లు కాలేరు. ఒకప్పుడు స్టార్, ఫేమస్ అనే పదాలు నానార్థాలుగానే ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు" అని చెప్పారు.

జెఇఇ మెయిన్ 2019 పరీక్ష విశ్లేషణ

వంద పర్సంటైల్ విజేతల మనోగతం

మాక్ టెస్టులతో పట్టు



ఎ.సాయి కిరణ్

సిద్దిపేట జిల్లా పాలపర్తి మా స్వస్థలం. నాన్న దయానంద్, అమ్మ సునంద ప్రభుత్వ టీచర్లు. మా పెద్దనాన్న బార్క్‌లో సైంటిస్ట్‌గా చేశారు. ఆయనే నాకు స్ఫూర్తి. నాకు కూడా భవిష్యత్తులో సైంటిస్ట్ కావాలని ఉంది. కెమిస్ట్రీ ఒలింపియాడ్ సెకండ్ లెవల్ రాసేందుకు ఇప్పటికే అర్హత కూడా సాధించాను. జెఇఇ మెయిన్ ఎగ్జామ్‌ను ఈ నెల 12న మధ్యాహ్నం రాశాను. నాకు కెమిస్ట్రీ టఫ్‌గా అనిపించింది. మేథ్స్ మోస్తరుగా ఉంది. ఫిజిక్స్ సులువుగా, చాలా బాగా ఉంది. ఎగ్జామ్ రాసిన తరవాత కూడా హండ్రడ్ పర్సంటైల్ వస్తుందని అనుకోలేదు. మాకు కోచింగ్‌లో భాగంగానే షార్ట్‌కట్ మెథడ్స్, స్మార్ట్ టిప్స్ చెబుతారు. అలాగే ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయడంలో అవి బాగా ఉపకరిస్తాయి. ఆక్యురసీకి తోడు వేగం పెంచుకునేందుకు తోడ్పడతాయి. క్లాస్‌లో శ్రద్ధగా వినడం, సందేహాలు ఉంటే వెంటనే క్లియర్ చేసుకోవడం నా పద్ధతి. అలాగే టీచర్లు చెప్పినట్టు ఫాలో అయ్యాను. మాక్ టెస్టులు రాశాను. తప్పులు దొర్లితే వెంటనే సవరించుకునేవాడిని. మళ్ళీ అవి రిపీట్ కాకుండా చూసుకునేవాడిని. అలాగే నాకు కెమిస్ట్రీ కష్టం. అందువల్ల ఆ సబ్జెక్టును ఎక్కువసార్లు రివిజన్ చేస్తుంటాను. జెఇఇ మెయిన్‌కు సంబంధించి అంతా కలిపి రెండు నెలలు బాగా ప్రిపేరయ్యాను. సబ్జెక్టులను టాపిక్ వారీగా అలాగే అన్నీ కలిపి ఒకసారి మాక్ టెస్టులు రాయడంతో మొత్తమ్మీద వివిధ టాపిక్స్‌పై పట్టు సాధించగలిగాను.

కూల్‌గా ఉంటాను



కె.విశ్వనాథ్

మాది సూర్యాపేట. నాన్న గురుమూర్తి, అమ్మ పద్మ ప్రభుత్వ టీచర్లు. స్నేహితుల కంటే మెరుగ్గా ఉండాలన్న భావనతో బాగా చదివేవాడిని. పోటీలో ఎక్కడా వెనుకపడకూడదని ముందు నుంచీ అనుకునేవాడిని. అదే నన్ను ముందుకు నడిపిస్తోంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలింపియాడ్స్ రెండో లెవెల్ రాసేందుకు అర్హత సాధించాను. కంప్యూటర్ లేదా సంబంధిత రంగంలో రాణించాలన్నది నా ఆకాంక్ష. నాకు కెమిస్ట్రీ బాగా ఇష్టమైన సబ్జెక్టు. ఈ నెల 11న ఉదయం సెషన్‌లో జెఇఇ ఎగ్జామ్ రాశాను. నాకు మూడు సబ్జెక్టులూ సులువుగానే అనిపించాయి. మాకు అంతా సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్, ఒత్తిడి అసలు ఉండదు. నేను కూడా కూల్‌గా ఉండే వ్యక్తిని. భయపడటం నా స్వభావం కాదు. పరీక్ష రోజున కూడా అలాగే ఉన్నాను. ఎక్కడా ఇబ్బంది పడలేదు. మొదట సబ్జెక్టును ఆసాంతం అర్థం చేసుకోవడం, అప్లికేషన్ యాంగిల్ తెలుసుకోవడం, ప్రాక్టీస్ నా పద్ధతి. షార్ట్‌కట్స్‌తో ఆక్యురసికి తోడు వేగం పెరుగుతుంది. టీచర్ల చెప్పిన ప్లాన్ ప్రకారం ముందుకు వెళితే చాలు అని నాకు అనిపిస్తుంది.

ఎర్రర్ లిస్ట్



బి.కార్తికేయ

మాది నెల్లూరు. నాన్న సురేష్ నాయుడు ఆక్వా రంగంలో ఉన్నారు. అమ్మ అమరావతి గృహిణి. మా అక్క తిరుచ్చిరాపల్లిలోని ఎన్ఐటిలో చదువుతోంది. ఆమే నాకు స్ఫూర్తి. కంప్యూటర్ లేదంటే సైంటిస్ట్‌గా కెరీర్ సాగించాలని అనుకుంటున్నాను. ప్రస్తుతానికి ఇంజనీరింగ్ చేయాలన్నది నా ఆకాంక్ష. ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలింపియాడ్ సెకండ్ లెవల్ రాసేందుకు ఇప్పటికే అర్హత కూడా సాధించాను. ఈ నెల 9న ఉదయం జెఇఇ మెయిన్ రాశాను. మాకు ఫిజిక్స్ కష్టంగా వచ్చింది. మిగిలిన రెండూ సులువుగానే అనిపించాయి. పరీక్షలు అంటే అస్సలు టెన్షన్ పడను. ప్రశ్న కష్టంగా ఉంటే విడిచిపెడతాను. తరవాతి ప్రశ్నకు కదులుతాను. టైమ్ అస్సలు వృథా చేయను. చదువుకునే క్రమంలో షార్ట్ నోట్స్ రాసుకుంటాను. దాని సహాయంతోనే పదేపదే రివిజన్ చేస్తుంటాను. మాక్‌టెస్ట్ రాసిన ప్రతిసారీ ఎర్రర్ లిస్టు రూపొందించుకునే వాడిని. ఆ తప్పులు మళ్ళీ చేయకుండా జాగ్రత్తపడేవాడిని. ఎగ్జామ్ రాసేటప్పుడు కూడా కనీస స్థాయిలో జాగ్రత్తగా ఉండటం చాలా మంచిది.

బిజినెస్ బెటర్ కాదన్నారు



జయంత్ ఫణి సాయి

మాది విజయవాడ. నాన్న వైవీ హనుమంతరావు ఇంజన్ ఆయిల్ బిజినెస్ చేస్తుంటారు. అమ్మ లలిత లావణ్య గృహిణి. బిజినెస్ అంటే కష్టనష్టాలు, అది వద్దు బాగా చదువుకో అని నాన్న అనేవారు. ఆయన మాటలే నన్ను ముందుకు నడిపించాయి. కెమిస్ట్రీ ఒలింపియాడ్స్ రెండో లెవెల్ రాసేందుకు అర్హత సాధించాను. నేను ఈ నెల 10న మధ్యాహ్నం జెఇఇ మెయిన్ రాశాను. ఫిజిక్స్, మేథ్స్ రెండూ టఫ్‌గానే మాకు వచ్చాయి. రెలిటివ్‌గా కెమిస్ట్రీ సులువుగా ఉంది. నిజానికి ఫిజిక్స్‌లో రెండు ప్రశ్నలు తప్పుగా ఇచ్చారు. ఆ ఇబ్బందితోనే టఫ్ అనిపించింది కూడా. స్కూలు స్థాయి నుంచి ఒక చోటే కోచింగ్ కావడంతో ఇంటర్ సిలబస్ సైతం అప్పుడే పూర్తికానిచ్చాను. దాంతో ఇంటర్లో అన్నింటిపై దృష్టి కేంద్రీకరించగలిగాను. జెఇఇ మెయిన్ ప్రిపరేషన్ డిసెంబర్ నెలలో మొదలుపెట్టాను. మాక్ టెస్టులు రాసి మెరుగయ్యాను. నిజానికి అందరూ బాగా చదువుతారు. అందుకే నేను మరొకరితో పోల్చుకోను. అది అనవసరం. నిన్నటి కంటే నేడు నేను మెరుగయ్యానా లేదా అన్నదే నా ప్రశ్న. అలాగే ప్రతి ఎగ్జామ్‌లోనూ ర్యాంకు తెచ్చుకోవాల్సిందే. అప్పుడే ఆ స్పిరిట్ చల్లారకుండా ఉంటుంది. రీసెర్చ్ అంటే నాకు అసక్తి. నా దారి అటువైపా లేకా టెక్నికల్ సైడా అన్నది ఇంకా తేల్చుకోలేదు. బీటెక్‌లో చేరాలా లేదంటే ప్యూర్ సైన్సెస్ వైపు వెళ్ళాలా అన్నది ఖరారు చేసుకోవాల్సిన విషయం.

ఐఐటిలో చేరడమే లక్ష్యం



బొజ్జ చేతన్‌రెడ్డి

మా స్వస్థలం కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి. అయితే విజయవాడలో స్థిరపడ్డాం. నాన్న రమేష్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్‌లో ప్రొఫెసర్. మొదటి నుంచి చదువులో టాపర్‌నే. ఐఐటీల్లో చేరాలన్నదే లక్ష్యం. అందుకోసమే కృషి చేస్తున్నా. రోజుకు 12 - 13 గంటలు కష్టపడుతున్నాను. అకడమిక్ మధ్యలోనే ఈ పరీక్ష జరిగినప్పటికీ ఎటువంటి ఇబ్బంది పడలేదు. జెఇఇ-మెయిన్‌లోని మూడు సబ్జెక్టులు.. మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సులభంగానే ఉన్నాయి. కాకపోతే ఫిజిక్స్‌లో రెండు తికమక పెట్టడంతో ఆ సబ్జెక్ట్‌కు ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చింది. అయితే మాకు ఆగస్టులోనే సిలబస్, రివిజన్ కూడా పూర్తి కావడంతో ప్రిపరేషన్‌పరంగా ఎటువంటి ఇబ్బంది ఎదురుకాలేదు.



మేథ్స్‌లో కాలిక్యులేషన్స్, ఫిజిక్స్‌లో ఫార్ములా బేస్డ్ ప్రశ్నలు!

ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి ఉద్దేశించిన జెఇఇ మెయిన్ తొలి విడత ఈ జనవరిలోనే జరిగింది. ఇంటర్ పరీక్షలకు ముందే దీన్ని నిర్వహించడం, అలాగే మరో విడతకు అవకాశం ఇవ్వడం చెప్పుకోదగ్గ విశేషాలు. పూర్తిగా ఆన్‌లైన్‌లో రోజుకు రెండు విడతలు చొప్పున మొత్తం నాలుగు రోజుల్లో ఎనిమిది సెషన్లలో ఈ పరీక్షను జరిపారు. ప్యాట్రన్‌లో మార్పులు లేవు. అలాగే పూర్తిగా పాఠ్య పుస్తకాల్లో ఇచ్చిన అంశాల పరిధిలోనే ప్రశ్నలు అడిగారు. ప్రధానంగా ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలతో ప్రిపేరైన విద్యార్థులకు తొలి విడత సానుకూలంగా ఉందని సమాచారం. జాతీయ స్థాయిలో పరీక్ష జరుగుతున్నందున రెండో విడత జరిగే సమయానికి ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలను పూర్తిగా ఫాలో కావడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రశ్నల తీరు

తేదీ	షిఫ్ట్	మేథ్స్	ఫిజిక్స్	కెమిస్ట్రీ
జనవరి 9	ఉదయం	సులువు ఇంటర్ సిలబస్ ఆధారంగా	మీడియం, ప్రామాణికం, ప్రశ్నల నిడివి ఎక్కువ	సులువుగా ఉన్నప్పటికీ ప్రశ్నల నిడివి ఎక్కువ
జనవరి 9	మధ్యాహ్నం	మీడియం, ప్రశ్నల నిడివి ఎక్కువ	కష్టం, ప్రశ్నల నిడివి ఎక్కువ	సులువు
జనవరి 10	ఉదయం	కష్టం	మీడియం, ప్రశ్నల నిడివి ఎక్కువ కాలిక్యులేషన్లు ఎక్కువే	సులువు
జనవరి 10	మధ్యాహ్నం	కష్టం, ప్రశ్నల నిడివి ఎక్కువ	కష్టం, ఫస్టియర్ సిలబస్ నుంచి ఎక్కువ ప్రశ్నలు	సులువు
జనవరి 11	ఉదయం	మీడియం, ప్రశ్నల నిడివి ఎక్కువ, సెకండియర్ సిలబస్ నుంచి ఎక్కువ ప్రశ్నలు	కష్టం, ఫార్ములా ఆధారిత ప్రశ్నలు వచ్చాయి	సులువు
జనవరి 11	మధ్యాహ్నం	మీడియం	కష్టం.	సులువు
జనవరి 12	ఉదయం	కష్టం	మీడియం, ఫార్ములా ఆధారిత ప్రశ్నలు వచ్చాయి	సులువు, ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి ఎక్కువ ప్రశ్నలు
జనవరి 12	మధ్యాహ్నం	కష్టం	నిడివి ఎక్కువ, ఫస్టియర్ సిలబస్ నుంచి ఎక్కువ ప్రశ్నలు	సులువు, ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి ఎక్కువ ప్రశ్నలు

జెఇఇ మెయిన్ 2019 మొదటి విడత ఆన్‌లైన్ పరీక్ష జనవరి 8 నుంచి 12 వరకు జరిగింది. పరీక్షకు హాజరయ్యేందుకు మొత్తం 11,09,250 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నారు. దీనిలో పేపర్-1 ఇంజనీరింగ్ ప్రవేశానికి కాగా, పేపర్-2 బి.ఆర్క్, బి.డిజైనింగ్ కోసం నిర్వహిస్తారు. ఇది మొదటి దఫా కాగా, రెండో దఫా ఏప్రిల్ నెల మొదటివారంలో జరుగుతుంది. విద్యార్థి అవసరం అనుకొంటే రెండు విడత పరీక్షకూ హాజరుకావచ్చు.

జనవరి నెలలో జరిగిన జెఇఇ పరీక్ష పేపర్ విషయానికి వస్తే గతేడాది లాగానే క్వశ్చన్ పేపర్ ప్యాట్రన్‌లో ఎలాంటి మార్పులు లేవు. మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో ఒక్కోదానిలో 30 చొప్పున మొత్తం 90 ప్రశ్నలు ఇచ్చారు. సరైన సమాధానానికి నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కట్ చేయాలని నిర్ణయించారు. మొత్తం 360 మార్కులకు ఈ పరీక్ష జరిగింది.

పేపర్-2లో మేథ్స్‌లో 30 ప్రశ్నలకు 120 మార్కులు, ఆప్టిట్యూడ్/మెంటల్ ఎబిలిటిలో 50 ప్రశ్నలకు 200 మార్కులు, డ్రాయింగ్‌కు సంబంధించిన 3 ప్రశ్నలకు 90 మార్కులు. మొత్తం 390 మార్కులకు ఈ పరీక్షను నిర్వహించారు. పేపర్ 1 & 2 రెండూ కూడా ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్)లోనే జరిగాయి.

పేపర్-1 విశ్లేషణ

అందరూ ఊహించిన విధంగానే ఈ ఏడాది జెఇఇ మెయిన్ పరీక్ష గతేడాదితో పోలిస్తే సులభంగానే ఉందని చెప్పవచ్చు. అయితే పరీక్ష జనవరిలోనే జరగడం, ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరగడంతో విద్యార్థులు ఒకింత ఒత్తిడికి గురై అనుకొన్న స్థాయిలో రాణించలేకపోయారని సమాచారం. ప్రశ్నలు ఎక్కువగా ఇంటర్ సిలబస్, కాన్సెప్ట్‌కి దగ్గరగా ఉండటంతో ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలు చదివిన విద్యార్థులు కొంత మెరుగ్గా రాణించి ఉండవచ్చు. విశ్లేషకుల నుంచి అందిన సమాచారం ప్రకారం యాభై నుంచి అరవై శాతం ప్రశ్నలు ఇంటర్ పుస్తకాల ఆధారంగానే రూపొందించారు. అంతేకాకుండా న్యూమరికల్ ఎబిలిటి అని కాకుండా కాన్సెప్ట్, థియరీ నుంచి ఎక్కువగా అడిగారు. ఈ పరీక్షలో ప్రశ్నల విధానం ఒక ఎత్తు అయితే, ఆప్షన్స్ మధ్య సారూప్యత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఆయోమయానికి గురయ్యారు. దీంతో ఒకటికి మరొకటి అనుకొని సమాధానం గుర్తించి తప్పులుకు పాల్పడే అవకాశం ఉంది. ఫలితంగా నెగిటివ్ మార్కులు వచ్చి స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది. నాలుగు రోజులు ఎనిమిది సెషన్లగా జరిగిన ఈ పరీక్షలు కొన్ని ప్రశ్నలు రిపీట్ అయ్యాయి. అలాగే గతంలో జరిగిన జెఇఇ మెయిన్ ప్రశ్నపత్రాల నుంచి ప్రశ్నలు వచ్చినట్లు సమాచారం.

పైన పేర్కొన్న వివరాల ప్రకారం జెఇఇ మెయిన్ 2019 జనవరి విడత ప్రశ్నపత్రాల నుంచి గమనించదగ్గ విషయాలు..

- ఎక్కువ శాతం ప్రశ్నలను ఇంటర్ సిలబస్ ఆధారంగా రూపొందించారు. అంటే ఇంటర్ పాఠ్యపుస్తకాలను ఫాలో అవ్వాలని గుర్తించాలి.
- ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర సిలబస్‌కు సమ ప్రాధాన్యం ఇచ్చారు.
- కెమిస్ట్రీ సాపేక్షంగా సులువుగా ఉంది. ఇదే స్కోరింగ్ సబ్జెక్ట్ కూడా.
- మేథ్స్‌లో ప్రశ్నల నిడివి ఎక్కువ. అలాగే క్యాలుక్యులేషన్‌తో కూడిన ప్రశ్నలు అడిగారు. అంటే ఏప్రిల్‌లో జరిగే తదుపరి ప్రయత్నంలో ఇలాంటి ప్రశ్నలపై దృష్టి సారించకపోవడం మంచిది.
- ఫిజిక్స్‌లో ఎక్కువగా ఫార్ములా బేస్డ్ ప్రశ్నలు ఉన్నాయి. అందువల్ల అన్ని ఫార్ములాలను ఒక పట్టికగా రాసుకొని ఎక్కువసార్లు ప్రాక్టీస్ చేయడం మంచిదని గుర్తించాలి.
- ఆప్షన్స్ కూడా చాలా ఒకదానికి ఒకటి దగ్గరగా ఉన్నాయి. వైల్డ్ గెస్‌కి ఆస్కారం లేదు. తెలియని ప్రశ్నలను వదిలేయడం మంచిది.

మొత్తానికి ఈ దఫా పరీక్షలో కటాఫ్ అనేది గతేడాదితో పోలిస్తే కొంచెం పెరగవచ్చు. అయితే ఇంకొక అవకాశం ఉన్నందున కొన్ని ఇన్‌స్ట్రక్షన్స్ పాటించి తరవాతి ప్రయత్నంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

వివిధ ఫేజ్‌లో జరిగిన ఈ పరీక్షలో ఫలానాది సులువు, మరొకటి కష్టం అని చెప్పలేం. అయితే ఒక్కో ఫేజ్‌లో ఒక్కో సబ్జెక్ట్ కష్టంగా ఉన్నట్లు సమాచారం. విద్యార్థుల నుంచి రాబట్టిన విషయాలను అనుసరించి ఏ ఫేజ్‌లో ఏ సబ్జెక్టు ఎలా ఉందన్నది పైన పట్టికలో ఇచ్చాం, పరిశీలించండి.



పవన్ కుమార్ కాసు
ఎమ్మెస్సీ (పిహెచ్‌డి), శ్రీ సంజీవని ఐఐటి అకాడమి, హైదరాబాద్

వివరాలు ఇవిగో

మేథ్స్‌లో హయ్యర్ స్టడీస్ ఎక్కడ?

☞ మా అమ్మాయి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. మేథ్స్‌లోనే బ్యాచిలర్ డిగ్రీ చేయాలని అనుకుంటోంది. దీనిలో హయ్యర్ స్టడీస్ ఎలా ఉంటాయో తెలుపగలరు?

- మేఘన, హైదరాబాద్

- దేశంలోని ప్రతిష్ఠాత్మాక సంస్థలు మేథ్స్‌లో డిగ్రీని అందిస్తున్నాయి. ఐఐఎస్ఇఆర్, ఐఐటి, ఎన్‌ఐటి, ఐఐఎస్‌సి, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై మేథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ మొదలైన వాటిలో మీరు చేరొచ్చు. ఇంటర్ తరువాత ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు నైసర్, అమృత తదితర కొద్ది సంస్థల్లో ఉంది.

మేథ్స్ చదవడం అనేకాకుండా కోర్సులో చేరేప్పుడే లాంగ్‌టర్మ్ గోల్స్‌ను కూడా ఇప్పుడే నిర్ణయించుకుంటే మంచిది. ఉదాహరణకు టీచింగ్, రీసెర్చ్, ఎకనోమెట్రిక్స్, స్టాటిస్టిక్స్, డేటాఎనలిటిక్స్ లాంటివి. వీటి ఆధారంగా ఉన్నత చదువులు కొనసాగించవచ్చు.

జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ర్యాంకు తెచ్చుకోవడం సాధ్యంకాకపోతే ఇతర సబ్జెక్టులతో కలిపి స్థానికంగా పేరున్న కాలేజీలో మేథ్స్ చదవొచ్చు. ఆపై కూడా ఉన్నత చదువులకు వెళ్ళవచ్చు.

ఏరోస్పేస్ ఇంజనీరింగ్ కష్టమా!

☞ నేను ప్రస్తుతం ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాను. తరువాత ఏరోస్పేస్ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఇస్రోలో పనిచేయాలని కోరిక. ఇది చాలా కష్టమైన కోర్సు, ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు అన్నింటిలో ఇది చాలా కష్టమైన కోర్సు. నీవు చదవలేవు అని మా బంధువులు అంటున్నారు. మరోపక్క నేను ఇందులో సీటు సాధించగలనా లేదా అనే సందేహం కూడా వస్తోంది?

- చరణ్, వరంగల్

- అన్ని బ్రాంచ్‌లకన్నా ఇదే అతికష్టమైనది అనేది నిజం కాదు. ఇది పూర్తిగా ఆ వ్యక్తి నైపుణ్యాలు, ఆప్టిట్యూడ్ తదితరాలపై ఆధారపడి ఉంటుంది. అయితే మేథ్స్‌తో పాటు ఇతర సబ్జెక్టులపై పట్టు ఉండడం చాలా అవసరం. ఏరోస్పేస్ లేదా ఇస్రోలోకి రెండు రకాలుగా వెళ్లవచ్చు. బేసిక్ ఇంజనీరింగ్ చేసి పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ఏరోనాటిక్స్ చేయొచ్చు. లేదా డిగ్రీ స్థాయిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేయొచ్చు. ఐఐటి, ఎన్ఐటిలతోపాటు మన రాష్ట్రంలోని కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో కూడా ఏరోనాటికల్ ఇంజనీరింగ్ ఉంది. అయితే దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది మాత్రం తిరువనంతపురంలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టి). దీనికి ఇస్రో స్పాన్సరర్‌గా వ్యవహరిస్తోంది. జెఇఇ అడ్వాన్స్‌డ్ ద్వారా దీనిలో అడ్మిషన్స్ జరుగుతాయి. వివరాల కోసం www.iist.ac.in/admission వెబ్‌సైట్ చూడొచ్చు.

• గోవర్ధనం కిరణ్‌కుమార్

చిరునామా: వివరాలు ఇవిగో, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్వినీ ఎన్‌క్లేవ్, హుడా హైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033